మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 07, సంచిక: 339 | ఆదివారం | 10-11-2024 | మహబూబ్‌నగర్ Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00

## నేడు మహబూబ్‌నగర్‌కు సిఎం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు సిఎం హైదరాబాద్ నుంచి బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం అమ్మాపురంలోని కురుమూర్తి స్వామి దేవాలయానికి చేరుకుంటారు. దేవాలయానికి సమీపంలో ఘాట్ రోడ్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం శ్రీ కురుమూర్తి స్వామి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

## అమోయ్‌కుమార్‌పై ఇడికి 12 ఫిర్యాదులు

నాగారంలో 30 మంది ఐపిఎస్‌లకు శతగోపం పెట్టిన వైనం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) విచారణను ఎదుర్కొంటున్న సీనియర్ ఐఎఎస్ అధికారి అమోయ్‌కుమార్‌పై ఇడి అధికారులకు ఇప్పటివరకు 12 ఫిర్యాదులు అందాయి. రంగారెడ్డి జిల్లాలో భూదాన్ భూకుంభకోణంపై పెద్దఎత్తున మనీలాండరింగ్ జరిగిందనే నేరంపై అమోయ్‌కుమార్‌పై ఇడి కేసు నమోదు చేసి విచారిస్తున్నది. ఈ కేసులో అమోయ్‌కుమార్‌ను విచారిస్తున్న విషయం తెలుసుకున్న రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఉన్న బాధితులు ఒక్కొక్కరూ ఇడి కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారు. ఇలా 12 ఫిర్యాదులు ఇడి కార్యాలయానికి వచ్చాయి. ఇందులో బాధితులు సుమారు 2000 మందికి పైగానే ఉంటారని పోలీసులు అంటున్నారు. వచ్చిన ఫిర్యాదులు అన్నీ కూడా భూములకు సంబంధించినవే. అమోయ్‌కుమార్ పై రెండు జిల్లాలలో కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో వివాదాస్పద భూములకు అక్రమంగా లైన్ క్లియర్ చేయడం, హైకోర్టు ఉత్తర్వులను సైతం ధిక్కరించి ఆ భూములకు ఎన్‌ఓసిలు ఇచ్చారని తరువాయి 2లో

# పచ్చి అబద్ధాలు

## హామీలు అమలు చేయలేదనడం విడ్డూరం

మా రాష్ట్రాలకు వచ్చి చూడాలని బిజెపికి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సిఎంల సవాల్

ప్రగల్భాలు పలికేందుకు మహారాష్ట్రలో ఎలాంటి విజయగాథలు లేవని బిజెపిపై తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ఫైర్

**ముంబయి :** ఇటీవల కాలంలో అసెంబ్లీ ఎన్నికల జరిగిన రాష్ట్రాల్లో పోలింగ్‌కు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నేరవేర్చలేదు అని బిజెపి చేసిన ఆరోపణలపై ఆ పార్టీ ఘాటుగా కౌంటర్ ఇచ్చింది. హామీల అమలుపై తమ రాష్ట్రాలకు వచ్చి చూడాలని పేర్కొంటూ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులు, కర్నాటక ఉప ముఖ్యమంత్రి కాషాయ పార్టీపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మహారాష్ట్ర రాజధాని ముంబయిలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, హిమాచల్ సిఎం సుఖ్విందర్ సింగ్ సుఖు, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌లు మాట్లాడారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు గురించి ప్రధాని మోడీ పచ్చి అబద్ధాలు చెబుతున్నారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. తాము ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక క్రమపద్ధతిలో అమలు చేస్తున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రుణాలను మాఫీ చేశామన్నారు. 22,22,067 మంది రైతులకు సంబంధి రూ. 17,869 రుణాలు మాఫీ అయ్యాయని చెప్పారు. పది నెలల్లోనే తమ ప్రభుత్వం యువతకు 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని, 200 యూనిట్ల మేరకు ఉచిత విద్యుత్ పథకం కింద 50 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. మహారాష్ట్రలో ప్రగల్భాలు పలికేందుకు బిజెపికి ఎలాంటిట విజయగాథలు లేవని ధ్వజమెత్తారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టే ప్రాజెక్టులను మహారాష్ట్ర నుంచి గుజరాత్‌కు తరలించుకుపోయిందని, అలాంటి కాషాయ పార్టీని రాష్ట్రంలో కనుమరుగు చేయాలని ప్రజలకు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కలిసి ఉంటేనే రక్షణ అనే మోదీ సందేశంపై ప్రశ్నించగా సుఖు మాట్లాడుతూ దేశ సంస్కృతిని అదిబంధీ చేస్తుందన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారు దేశాన్ని ఐక్యంగా ఉంచలేరని విమర్శించారు. జాతిని ఐక్యం చేయడమే మన సంస్కృతి అని ఆయన చెప్పారు. ప్రజలకు ఎంతో మేలు చేసే పాత పెన్షన్ విధానాన్ని తరువాయి 2లో

# ఇంటింటికీ ఎన్యూమరేటర్లు

## సమగ్ర కుటుంబ సర్వేలో వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

ప్రజాపక్షం/హైదరాబాద్

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేరెండవ దశ ప్రారంభమైంది. మొదటి దశలో తమకు కేటాయించిన 150 ఇళ్లకు వెళ్లి వాటికి స్టిక్కరింగ్ పూర్తిచేసిన సర్వే సిబ్బంది శనివారం నుంచి పూర్తి సర్వేను చేపట్టారు. హైదరాబాద్ మహానగరం (జిహెచ్‌ఎంసి) పరిధిలో 24,488 మంది, రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాల్లో 70,262 మంది మొత్తం 94,750 మంది సర్వే సిబ్బంది ఇంటికి వెళ్లి కుటుంబాల వివరాలను సేకరిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సర్వే ప్రక్రియను 9,478 మంది తరువాయి 2లో

## బిజెపి అనుకూలమా? వ్యతిరేకమా? : పొన్నం

కుల గణనకు బిజెపి అనుకూలమా?, వ్యతిరేకమా సమాధానం చెప్పాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. బిసి,ఎస్‌సి,ఎస్‌టిలకు బిజెపి వ్యతిరేకమని, ఆ పార్టీ కార్పొరేట్‌లకు చెందిన పార్టీ అని మంత్రి ఆరోపించారు. గత ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే తరహాలో తాము ఈ నివేదికను ఆల్మారాలో పెట్టబోమని, పబ్లిక్ డొమైన్‌లో పెడుతామని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పొన్నం ప్రభాకర్ తరువాయి 2లో

## అనుమానాలు నివృత్తి చేయాలి : భట్టి

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైన నేపథ్యంలో కలెక్టర్లు ఎన్యూమరేటర్లతో విస్తృతంగా మాట్లాడాలని, ప్రజల సందేహాలను కలెక్టర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి, అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. మంత్రులు, ఎంఎల్‌ఎలు ఎక్కువ సార్లు సర్వేలో భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. 'సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే' అంశంపై ఉన్నతాధికారులతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క శనివారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క తరువాయి 2లో

## నాడు ప్రజలకు జీవనది నేడు..

# జీవులకు ప్రాణసంకటం

ఒకప్పుడు బతుకు దెరువు ఇచ్చిన మూసీ ఇప్పుడు శాపమైంది

ముఖ్యమంత్రి పర్యటనలో సంగెం ప్రజల ఆవేదన

మూసీ పునరుజ్జీవం పట్ల హర్షాతిరేకం

( బొమ్మలపల్లి అంజన్‌కుమార్)

మూసీ ఒకనాడు జీవ నది. రూపాయి బిల్ల వేస్తే కనిపించేంత స్వచ్ఛతగా ఉండేది. కొబ్బరి నీటికి తీసిపోని తియ్యదనంతో మనుషులు, జీవరాసుల దాహం తీర్చిన గొప్పనది. అంతేకాదు.. సంగెం గ్రామం వద్ద నది మధ్యలోని భీమ లింగాన్ని నిత్యం తన జలాలతో అభిషేకిస్తూ ముందుకు సాగే మూసీనది ఆధ్యాత్మికతకు సైతం ఆనవాలు. అంత గొప్ప విశిష్టత కలిగిన ఈ మూసీ నది ఒకప్పుడు లక్ష లాది మంది జీవనాధారం కాగా, నేడు వారికి శాపమైంది. మనుషులకే కాదు... ఆ నది పరిసర ప్రాంతంలో సకల జీవరాసులకు ప్రాణ సంకటంగా మారింది. ఎంతో స్వచ్ఛత గలిగిన ఈ నదినే నమ్ముకుని బతికిన నాటి తరం.. ఆ నది దుస్థితిని చూసి నేడు విలవిలాడుతున్నారు. తమకు జీవితాన్ని, బతుకు దెరువు ఇచ్చిన ఈ నది ఎవరో చేస్తున్న పాపాలకు నేడు విషతుల్యమై భరించలేని కంపుతో భారంగా ముందుకు సాగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ జీవనదికి పునరుజ్జీవం కల్పించేందుకు ప్రభుత్వం నడుం బిగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూసీనది పునరుజ్జీవమే తరువాయి 2లో

## కార్మిక-కర్షకుల అంతానికి ఆయుధాలుగా నోట్ల రద్దు, జిఎస్‌టి

జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్‌గాంధీ విమర్శ

**జంషెడ్‌పూర్/ధన్‌బాద్ :** నోట్ల ఉపసంహరణ, జిఎస్‌టి రెండూ దేశంలో రైతులు, కార్మికులు, నిరుపేదల అంతానికి ఆయుధాలుగా మారాయని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. జంషెడ్‌పూర్, ధన్‌బాద్‌లలో జరిగిన బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే దేశంలో కులగణన చేపడతామని, రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎట్టిపరిస్థితుల్లోనూ తొలగిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఝార్ఖండ్‌లో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే, ఎస్‌టిలకు 26 నుండి 28 శాతానికి రిజర్వేషన్లు పెంచుతామని, ఎస్‌కిలకు పది నుండీ 12 శాతం మేరకు, ఓబిసిలకు ప్రస్తుతం ఉన్న 14 శాతం నుండి 27 శాతం మేరకు రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చారు. తొలుత జంషెడ్‌పూర్‌లో జరిగిన ర్యాలీలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ, నోట్ల ఉపసంహరణ, వస్తుసేవల పన్నులపై కేంద్రంలోని బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశంలో రైతులు, కార్మికులు, తరువాయి 2లో

## ఆ రాష్ట్రాలన్నీ కాంగ్రెస్‌కు ఎటిఎంలు

ఎంవిఎ అంటేనే అవినీతి, కుంభకోణాలకు నెలవు : మోదీ

అకోలా : దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎక్కడ ఏర్పడినా ఆయా రాష్ట్రాలు ఆ పార్టీ రాజ కుటుంబాలకు (షాహీ పరివార్) ఎటిఎంలా మారుతున్నాయని ప్రధాని మోడీ విమర్శించారు. మహారాష్ట్రను కాంగ్రెస్‌కు ఎటిఎంలా మారబోనీయమని స్పష్టం చేశారు. శనివారం ఆయన అకోలాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల్లో గెలుపొందేందుకు కాంగ్రెస్ అవినీతికి పాల్పడుతోందని, ఒక్కసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ మరెంత అవినీతికి పాల్పడుతుందో ఊహించుకోవచ్చునని ప్రధాని అన్నారు. కాంగ్రెస్ ఎక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా, ఆ రాష్ట్రం ఆ పార్టీ షాహీ పరివార్‌కు ఎటిఎం అవుతుందన్నారు. మహారాష్ట్ర ఎన్నికల కోసం (కాంగ్రెస్ పాలిత) కర్ణాటకలో మద్యం వ్యాపారం నుండి 700 కోట్ల రూపాయల దోపిడీ జరిగిందని, తెలంగాణ , హిమాచల్ ప్రదేశ్ కూడా ఈ షాహీ పరివార్‌కు ఎటిఎంలుగా మారాయని దుయ్యబట్టారు. మహాయితి (మహారాష్ట్రలో పాలక కూటమి) మేనిఫెస్టోలో మహిళల భద్రత, ఉద్యోగ అవకాశాలు, లడ్కీ బహిన్ యోజన విస్తరణపై దృష్టి సారిస్తే... కాంగ్రెస్, శివసేన (యుబిటి), శరద్ పవార్ ఎన్‌సిపితో కూడిన మహా వికాస్ అఘాడీ మాత్రం 'ఘోటాల పత్ర'తో ప్రజల ముందుకు తరువాయి 2లో

# సైనికులే లక్ష్యంగా..

పాక్ రైల్వేస్టేషన్‌లో ఆత్మాహుతి దాడి

27 మంది మృతి : 62మందికి గాయాలు

**క్వెట్టా :** పాకిస్థాన్ రైల్వే స్టేషన్‌లో ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది. ఈ దాడిలో 14 మంది సైనికులు సహా 27 మంది మరణించారు. వీరిలో సామాన్య పౌరులు ఉన్నారు. మృతులసంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. సుమారు 62 మంది గాయపడ్డారు. గాయపడినవారిని క్వెట్టాలోని ట్రామా ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఆరుగురి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. క్వెట్టా నుండి పెషావర్‌కు జాఫర్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న సమయంలో ఆ ఆత్మా హుతిబాంబుదాడి జరిగింది. ఆ ఆత్మాహుతిదాడికి తామే కారణమని పాకిస్థాన్‌లో నిషేధిత బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఉగ్రవాద సంస్థ ప్రకటించుకుంది. 46 మంది భద్రతాదళ సిబ్బంది, మరో 14 మంది సామాన్య పౌరులు కూడా ఈ ఆత్మాహుతి బాంబుదాడిలో తీవ్రంగా గాయపడ్డారు. రక్తదానం ఇచ్చేందుకు ప్రజలు ముందుకు రావాలని ప్రభుత్వం ప్రకటించింది. బలూచిస్థాన్ ఆరోగ్యశాఖామంత్రి బాఖత్ మహ్మద్ కాకర్ హుటాహుటిన ఆసుపత్రికివెళ్ళి సహాయ కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు.శనివారం ఉదయం 8.25 గంటలకు జరిగిన ఆ ఆత్మాహుతి బాంబుదాడిలో ఆత్మాహుతికి పాల్పడిన తరువాయి 12లో

## రెండో రాజధానిగా వరంగల్

# అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

వరంగల్‌లో బిఆర్‌ఎస్‌ను లేకుండా చేయడమే లక్ష్యమా?

(తోట సుధాకర్, హనుమకొండ)

వరంగల్‌ను రాష్ట్ర రెండో రాజధానిగా చేస్తామంటూ మంత్రులు ఇటీవల పలు సందర్భాలలో చెప్పడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అలాగే రాష్ట్ర సిఎం,మంత్రులు వరంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెబుతున్నారు. హైదరాబాద్, వరంగల్ లో ఈ మేరకు సమీక్షా సమావేశాలు కూడా నిర్వహించారు.ఈ క్రమంలో ఇప్పటికిప్పుడు వరంగల్‌పై రేవంత్ సర్కారు దృష్టి ఎందుకు పెట్టిందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తెలంగాణలో అభివృద్ధి పరంగా చూస్తే ప్రధాన ఆదాయ వనరుగా హైదరాబాద్ ఉంది. దీంతో అభివృద్ధి అంతా హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉంది. రాష్ట్రంలో హైదరాబాద్ కాకుండా ఇతర నగరాలను అభివృద్ధి చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. వరంగల్, కరీంనగర్ నగరాలను అభివృద్ధి చేస్తే హైదరాబాద్ పై ఒత్తిడి తగ్గుతుంది. అయితే చాలా ఏళ్లుగా ప్రభుత్వాలు వరంగల్, కరీంనగర్ అభివృద్ధి చేస్తామని చెబుతున్నాయి తప్ప.. చేతల్లో కనిపించడం లేదు. తాజాగా రేవంత్ సర్కార్ వరంగల్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఓరుగల్లును రాష్ట్రానికి రెండో రాజధానిగా ప్రకటించేందుకు సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఇదే జరిగితే తరువాయి 12లో

## వచ్చేది బిఆర్‌ఎస్ ప్రభుత్వమే

11 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి

ఏం కోల్పోయారో తెలిసొచ్చింది : మాజీ సిఎం కెసిఆర్

ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి/జగదేవ్‌పూర్

చాలా రోజులుగా ఫాంహౌస్‌కే పరిమితమైన బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలు పూర్తయిందని ..ప్రజలు తరువాయి 2లో

# అసత్యాలు, దుష్ప్రచారాలతో నిజాలను ఏమార్చలేరు : ఐరాసలో భారత్



**న్యూయార్క్ :** అసత్యాలు, దుష్ప్రచారాలతో వాస్తవాలను మరుగుపరచలేరనీ, ఎవరినీ ఏమార్చలేరనీ ఐక్యరాజ్యసమితి వేదికపై పాకిస్థాన్‌కు భారతదేశం గట్టి సమాధానం చెప్పింది. శుక్రవారంనాడు ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో అసందర్భంగా జమ్మూ కశ్మీరు ప్రస్తావన లేవనెత్తిన పాకిస్థాన్‌కు భారతదేశం మరోసారి గట్టి సమాధానం చెప్పింది. ప్రత్యేక రాజకీయ, వలస నిర్మూలన కమిటీ సమావేశంలో శాంతిదళాల కార్యకలాపాలపై జరిగిన చర్చలో పాకిస్థాన్ తప్పుదోవ పట్టించే అప్రస్తుత సంభాషణలు చేసింది. జమ్మూ కశ్మీరు సరిహద్దులో భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణను పర్యవేక్షించేందుకు ఐక్యరాజ్యసమతి నాయకత్వానగల శాంతి దళాలు 1948లో మొదటిసారి ఆ సరిహద్దుకు చేరుకున్నాయి. ఈ శాంతి దళాల విషయాన్ని పాకిస్థాన్ అనవసర ప్రస్తావన చేసింది. అసందర్భమైన పాకిస్థాన్ అప్రస్తుత ప్రసంగాన్ని భారత్ తిప్పికొట్టింది.భారతపార్లమెంటు రాజ్యసభ సభ్యుడు, బిజెపి జాతీయ అధికార ప్రతినిధి సుధాంషు త్రివేదీ దీనిపై దీటుగా స్పందించారు. ఈ విషయాలను తర్వాత ఆయన ఎక్స్ వేదికగా పోస్టింగ్ చేశారు. సరిహద్దుల్లో ఐక్యరాజ్యసమితి సైనిక పరిశీలకబృందం (యుఎన్ ఎంఓజిఐపి) గురించి పాకిస్థాన్ అధికార ప్రతినిధి జనరల్ అసెంబ్లీలో అవాక్కులు పలకడంతో త్రివేది పైవిధంగా స్పందించారు. సిమ్లా ఒప్పందం తర్వాత కూడా శాంతి దళాలు అక్కడ ఉండటం అసహేతుకమని త్రివేది అన్నారు. జమ్మూ కశ్మీరు భారతదేశంలో అంతర్భాగమని, ప్రజాస్వామ్యబద్ధంగా ఇటీవల ఎన్నికలు కూడా జరిగాయన్నారు. ఐక్యరాజ్యసమితి శాంతి దళాలలో భారతదేశం మొదటి నుండీ కీలకపాత్ర వహిస్తోంది. ఈ విషయంలో భారత్ అగ్రభాగంలో ఉంది. ఐక్యరాజ్యసమితి శాంతిదళాల భద్రత కూడా చాలా ముఖ్యమైన విషయమని ఆయన అన్నారు. ఈ శాంతిదళాలు కేవలం ఒకదేశం కోసం కాకుండా యావత్ మానవాళి శ్రేయస్సుకోసం పాటుపడుతున్నాయన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రపంచవేదికలోని వివిధ విభాగాల కార్యకలాపాలలో భాగంగా భారత్‌కు చెందిన 12 మంది బృందం పర్యటనలో భాగంగా త్రివేదీ కూడా వెళ్ళారు. పాకిస్థాన్ చేస్తున్న అసత్య ప్రచారాలకు ఈ వేదికపై దీటుగా గట్టి సమాధానం చెప్పారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ వంటి ఒక గొప్ప వేదికపై అసత్యాలు వల్లెవేయడం ద్వారా అక్కడ జరిగే చర్చను తప్పుదోవ పట్టించేందుకు పాకిస్థాన్ ప్రయత్నం చేసిందని, దీనికి భారత్ దీటుగా స్పందించి సమాధానం చెప్పిందని సుంధాషు త్రివేదీ అన్నారు. జమ్మూ కశ్మీరు భారతదేశంలో ఒక అంతర్భాగమని, దానిని ఎవరూ ఆక్రమించలేరని కూడా ఆయన జనరల్ అసెంబ్లీ సమావేశంలో చెప్పారు. ఇటీవల జమ్మూ కశ్మీరు ప్రజలు స్వేచ్ఛగా జరిగిన ఎన్నికల్లో పాల్గొన్ని ఓటు హక్కు ఉపయోగించుకున్నారనీ, ప్రజాప్రతినిధును ఎన్నుకున్నారనీ అన్నారు. తమ ఓటు హక్కు ద్వారా భారత చట్ట పరిధిలో కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారన్నారు. అందువల్ల పాకిస్తాన్ ఈ ప్రాంతంలో దుష్ప్రచారాలు చేయకుండా వాటికి దూరంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. జనరల్ అసెంబ్లీపట్ల తమకు ఎంతో గౌరవం ఉందని, సభలో ఉన్న సభ్యులపట్ల కూడా తమకు ఎంతో గౌరవం ఉందని అన్నారు. అందువల్ల ఐక్యరాజ్యసమితి కార్యాకలాపాలను దుర్వినియోగం చేయవద్దని కూడా ఆయన పాకిస్థాన్ ప్రతినిధికి హితవు చెప్పారు.

# ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర

## ఏడురోజుల్లో చంపాలని రివల్యూషనరీ గార్డ్స్ హుకుం

## ఆఫ్ఘన్ వ్యక్తిని నియమించారని అమెరికా ఆరోపణ

**న్యూయార్క్:** డోనాల్డ్ ట్రంప్‌ను హత్య చేసేందుకు ఇరాన్ కుట్ర చేసిందని అమెరికా ఆరోపించింది. ఈ హత్యచేసేందుకు అఫ్గానిస్థాన్‌కు చెందిన వ్యక్తి ఫర్హాద్ షకేరీ (51)ను కిరాయికి నియమించిందని పేర్కొంది. గడచిన సెప్టెంబరునెలలోనూ ఫర్హాద్ షకేరీని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్‌లోని ఒక ఉన్నతాధికారి కిరాయికి నియమించారనీ, ట్రంప్‌పై నిఘా వేసి చెక్కుచెదరని ప్రణాళికలో ఆయనను హత్యచేసే లక్ష్యాన్ని అప్పగించారని జస్టిస్ డిపార్ట్‌మెంట్ ప్రాసిక్యూటర్ ఆరోపించారు. 2020లో ఇరాన్‌కు చెందిన సైనిక జనరల్ క్వాస్సెమ్ సోలెమని హత్యకు ప్రతీకారంగా ట్రంప్‌ను హతమార్చాలని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ఈ అసైన్‌మెంట్‌ను అఫ్గాన్ జాతీయుడికి అప్పగించిందని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని ఏడురోజుల్లో పూర్తిచేయాలని అతడికి బాధ్యతలు ఇచ్చారని పేర్కొంది. ఒక అమెరికన్ జర్నలిస్టును హత్యచేసేందుకు మరో ఇద్దరు కిరాయి వ్యక్తులను కూడా నియమించారని పేర్కొంది. వీరేకాకుండా సోషల్ మీడియాలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఉన్న మరో ఇద్దరు యూదు వ్యాపారవేత్తలను కూడా చంపే బాధ్యతలను ఇరాన్ వారికి అప్పగించిందని ప్రాసిక్యూటర్ ఆరోపించారు. పాప్ అని పిలిచే బ్రూక్లిన్‌కు చెందిన కార్లిస్‌లే రివేరా (49), స్టార్ట్‌లేన్ ఐలాండ్‌కు చెందిన జోనాథన్ లోడ్‌హాఫ్ట్ (36)లుగా ఈ ఇద్దరు వ్యక్తులను ఈ పపెలో దోషులుగా గుర్తించినట్లు కూడా చెప్పింది. వీరిద్దరినీ న్యూయార్క్‌కు చెందిన సదరన్ జిల్లా కోర్టులో గురువారంనాడు హాజరుపరిచారు. వీరిపై విచారణా కార్యక్రమం ఇంకా పెండింగ్‌లో ఉంది. ఒక ప్రణాళిక రచించి ట్రంప్‌ను గురితప్పకుండా పక్కాగా హత్య చేసే బాధ్యతలను ఫర్హాద్ షకేరీ (51)కి ఇరాన్ అప్పగించిందని జస్టిస్ డిపార్ట్‌మెంట్ ఆరోపించింది. ఈ వ్యక్తిని ఇంకా అమెరికా అధికారులు అరెస్టు చేయలేదు. బాల్యంలోనే అఫ్గానిస్థాన్‌నుండి అమెరికా వచ్చిన షకేరీ చోరీ నేరాలపై 14 ఏళ్ళు జైలు జీవితం గడిపాడు. తర్వాత బహిష్కారానికి గురయ్యాడు. జైలులో ఉన్నప్పుడే ఇరాన్ లక్ష్యాలు సాధించేందుకు బయట నేర ముఠాలతో సంబంధాలు పెట్టుకున్నాడు. ఇరాన్‌లో మానవహక్కులు, అవినీతిపై వార్తలు రాస్తున్న మహిళా జర్నలిస్టు మాసిన్‌అలినెజాద్‌ను చంపితే లక్షడాలర్లు ఇస్తానని జర్నలిస్టు కార్లిస్‌లే రివేరా, స్టార్ట్‌లేన్ జోనాథన్ లోడ్‌హాఫ్ట్‌లకు షకేరీ వాగ్దానం చేశాడని మన్‌హట్టన్ కోర్టులో ఈ క్రిమినల్ ఫిర్యాదు నమోదైంది. అతడు ఇంకా రహస్యంగా ఇరాన్‌లో ఉన్నాడని తాము అంచనావేస్తున్నామని కూడా అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది. ఐతే ఈ ఆరోపణలను ఇరాన్ తిరస్కరించింది. గతంలో కూడా అమెరికా ఇదేవిధంగా ఆరోపణలు చేసిందనీ, పదే పదే ఈ విధమైన ఆరోపణలు చేయడంవల్ల రెండు దేశాల మధ్య మరిన్ని కొత్త చిక్కులు తీసుకువస్తాయని ఇరాన్ విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బాఘెయిల్ అన్నారు. ఈ ఏడాది జులైనెలలో పెన్సిల్వేనియాలో జరిగిన బహిరంగ సభలో ట్రంప్ ప్రసంగిస్తుండగా ఆయనపై హత్యాయత్నం జరిగింది. ఒక తూటా ఆయన చెవి మీదుగా దూసుకుపోయింది. ఆ తర్వాత సెప్టెంబరులో వెస్ట్‌పామ్ బీచ్‌లో ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా ఒకవ్యక్తి ఆయనపై తుపాకీ గురిపెట్టాడు. అతడిని అరెస్టు చేశారు. ఆ విధంగా రెండోసారి కూడా హత్యాప్రయత్నం జరిగింది.

# ఇక యుద్ధం మధ్యాసియాకే పరిమితం కాదు

## ఇరాన్ విదేశాంగమంత్రి హెచ్చరిక



**టెహ్రాన్ :** ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధ విస్తరణ ఇక మధ్యాసియాకు మాత్రమే పరిమితమయ్యే అవకాశం లేదని ఇరాన్ హెచ్చరిక చేసింది. గాజాలో ఇజ్రాయెల్‌కు హమాస్‌కు మధ్య యుద్ధం, లెబనాన్‌లో ఇజ్రాయెల్‌కు హిజ్బొల్లాకు మధ్య జరుగుతున్న యుద్ధాలు ఇక మధ్యాసియాకు మాత్రమే పరిమితమయ్యే అవకాశం లేదని, దూర ప్రాంతాలకు కూడా విస్తరిస్తుందని ఇరాన్ విదేశాంగశాఖామంత్రి అబ్బాస్ అరఘ్చి శనివారంనాడు హెచ్చరించారు. ఈ మేరకు ప్రభుత్వ టీవీ చానల్‌లో ఆయన ఒక సందేశం ఇచ్చారు. యుద్ధ విస్తరణ ప్రమాదం కేవలం మధ్యాసియాకు మాత్రమే పరిమితం కాబోదని, ఇది మధ్యాసియాను దాటి విస్తరిస్తుందని అన్నారు. మధ్యాసియాలో గనుక క్రమంగాయుద్ధం విస్తరించినట్లయితే ఈ అభద్రత, దాని ప్రభావ ప్రమాదం చాలా దూరంగా ఉన్న ఇతర ప్రాంతాలకు కూడా విస్తరిస్తుందన్నారు. ఐతే మరోవైపు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ కూడా ఈనెలారంభంలో మాట్లాడుతూ, గాజాలో కాల్పుల విరమణ ఇరాన్ చర్యలను సానుకూలంగా ప్రభావితం చేసేఅవకాశం ఉంటుందని అన్నారు. కాగా ఇరాన్ సర్వాధినేత ఆయొతుల్లా ఖామైనీ సలహాదారు అలీ లరిజారీ గురువారంనాడు ఒక ప్రకటన చేస్తూ, ఇజ్రాయెల్ క్రమంగా తన యుద్ధాన్ని ఇరాన్ దాకా విస్తరించాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తోందనీ, ఇలాంటి కుట్రలకు ఇరాన్ తలవొగ్గబోదని, చాలా వివేకంతో తమదేశం అడుగులు వేస్తుందని హెచ్చరించారు. ఇజ్రాయెల్ ఉచ్చులో పడకుండా తాము జాగ్రత్తగా వ్యవహరిస్తామన్నారు. ఈ ఏడాది అక్టోబరు 1వ తేదీన ఇజ్రాయెల్‌పై ఇరాన్ వందలాది క్షిపణులను ప్రయోగించింది. దానికి ప్రతీకారంగా ఇజ్రాయెల్ కూడా అక్టోబరు 26న ఇరాన్ సైనిక స్థావరాలపై గగనతల దాడులు చేసింది. ఈ దాడుల్లో నలుగురు ఇరాన్ సైనికులు మరణించారు.

**గాజాలో దాడులు: జర్నలిస్టులు సహా 13 మంది మృతి**

గాజాలో ఇజ్రాయెల్ శనివారం జరిపిన రెండు వేరువేరు దాడుల్లో ఇద్దరు స్థానిక జర్నలిస్టులు, ఒక గర్భవతి, పిల్లలు సహా 13 మంది మరణించారు. గాజా సిటీలోని తూర్పు తుఫా పొరుగున ఆవాసప్రాంతంగా మార్చిన ఒక స్కూలు షెల్టర్‌పై జరిగిన దాడుల్లో ఆరుగురు మరణించారని గాజా ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించింది.మృతుల్లో ఇద్దరు స్థానిక జర్నలిస్టులు కూడా ఉన్నారని తెలియజేసింది. ఐతే పాలస్తీనియన్ ఇస్లామిక్ జీహద్ ఉగ్రవాద ముఠాకు చెందిన స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని తాము దాడులు చేశామని ఇజ్రాయెల్ సైన్యం అందుకు జవాబుగా ప్రకటన చేసింది. సదరన్ సిటీ ఖాన్ యూనిస్‌లో ఒక గుడారంపై జరిపిన మరోదాడిలో ఏడుగురు మరణించారు. నిరాశ్రయులైన ప్రజలు ఇక్కడ తలదాచుకుంటున్నారని నస్సెర్ ఆసుపత్రి వర్గాలు వివరణ ఇచ్చాయి. ఈ మృతుల్లో ఇద్దరు మహిళలు, ఒక బిడ్డ ఉన్నారు. ఐతే దీనిపై ఐడిఎఫ్ స్పందించలేదు. ఇదిలా ఉండగా ఇజ్రాయెల్ సైనిక విభాగం 'కోగాట్' ఒక ప్రకటన చేస్తూ, జబాలియా శరణార్థశిబిరంతోసహా గాజాలోకి ఉత్తరమార్గంలో 11 ఆహార సహాయ వాహనాలు ప్రవేశించాయని పేర్కొంది.

# డెమోక్రాట్ల ఓటమికి బైడెన్ కారకుడు: పెలోసీ

**న్యూయార్క్ :** అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాట్ల ఓటమికి జో బైడెన్ కారకుడని అమెరికా దిగువసభ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ ఆరోపించారు. బైడెన్ వృద్ధాప్యం కారణంగా పోటీ నుండి వైదొలగిన తర్వాత రాష్ట్రాలలో పార్టీ తరపున అభ్యర్థి ఎంపికకు ప్రైమరీల జోక్యం లేకుండా నేరుగా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌ను ఎంపిక చేసి తప్పుచేశారని విమర్శించారు. కమలాహారిస్ నేరుగా అధ్యక్ష అభ్యర్థిగా బరిలోకి దిగకుండా రాష్ట్రాలలో ప్రైమరీల్లో ఎంపికల పోటీ ద్వారా ట్రంప్‌పై పోటీ పడితే ఎంతో ప్రయోజనం ఉండి ఉండేదని, దీనివల్ల డెమోక్రటిక్‌పార్టీలో కూడా కొత్త కొత్త అభ్యర్థులు పోటీచేసేందుకు సమర్థులు ముందుకు వచ్చి ఉండేవారని, బైడెన్ ఆ అవకాశం లేకుండా చేశారని విమర్శించారు. దీనివల్ల డెమోక్రటిక్‌పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిని మూటగట్టుకుని కీలక రాష్ట్రాలను కూడా ట్రంప్‌కే అప్పగించాల్సి వచ్చిందని నాన్సీ పెలోసీ విమర్శించారు. అమెరికా కాంగ్రెస్‌లో అత్యంత శక్తిమంతులైన నేతలలో నాన్సీ పెలోసీ కూడా ఒకరు. ఓటమిపై విశ్లేషణలో భాగంగా ఆమె పైవిధంగా విమర్శలు చేశారు. ట్రంప్ విమర్శలు ఎదుర్కొనేందుకు బైడెన్ ఆదరాబాదరాగా నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. రాష్ట్రాలలో ప్రైమరీ ప్రక్రియ ద్వారా వచ్చి ఉంటే కమలా హారిస్ ఎన్నికల్లో ఇంకా ఎంతోబాగా రాణించి ఉండేదని నాన్సీ పెలోసీ అన్నారు. మంగళవారంనాడు అమెరికా కాంగ్రెస్‌కు కూడా జరిగిన ఎన్నికల్లో నాన్సీ పెలోసీ 20వ సారి ఎన్నికయ్యారు. ఇదిలా ఉండగా, డెమోక్రటిక్‌పార్టీలో జో బైడెన్‌ను వెళ్ళగొట్టేందుకు అంతర్గతంగా జరుగుతున్న సంఘర్షణను అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా బహిరంగంగా ప్రోత్సహించారని, ఐతే వారు కూడా కమలాహారిస్‌ను అధ్యక్ష అభ్యర్థిగా కోరుకోలేదనీ జో బైడెన్‌కు చెందిన మాజీ సహాయకుడు ఒకరు చెప్పారు. ఐతే ఆయన తన పేరు వెల్లడించడానికి ఇష్టపడలేదు.

## అనుకూలమా? వ్యతిరేకమా? : పొన్నం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ కుల గణనలో సేకరించే వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంటుందని, ఈ సర్వే ద్వారా సామాజిక, ఆర్థిక, రాజకీయ,ఉద్యోగ అవకాశాలకు న్యాయం జరుగుతుందని వివరించారు. యుపిఎస్‌సిలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు 22.5 శాతం రిజర్వేషన్లు దాటడంలేదని, దీనికి ప్రధాని మోదీ విధానాలే కారణమన్నారు. సామాజికంగా మార్పు తీసుకురావడానికే కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే చేపడుతుందన్నారు. ఎన్నికల కోసమే తాము కుల గణన చేపడుతున్నామని బిజెపి నేత లక్ష్మణ్ ఆరోపించారని, ప్రస్తుతం అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన విషయాన్ని లక్ష్మణ్ గ్రహించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు బిసి రిజర్వేషన్లు పెట్టాలా వద్దా? బిజెపి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల అంశంపై ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా, బిజెపి పొంతన లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ పరివాహక జీవన విధానాలను మార్చాలనే ఉద్దేశంతోనే సిఎం రేవంత్ రెడ్డి సంగెంను పరిశీలించారని, రైతులు,గీత, కుమ్మరి, కమ్మరి కుల వృత్తిదారుల సమస్యలను తెలుసుకున్నారని వివరించారు. కెటిఆర్, హరీశ్‌రావు కోరినట్లు కూలగొట్టిన మూసీ ప్రాంతాలకు వస్తామని, ఎవ్వరికీ అన్యాయం చేయబోమని, అందరికీ న్యాయం చేస్తామని మంత్రి పొన్నం భరోసానిచ్చారు.

## ఎన్యూమరేటర్లు (మొదటి పేజీ తరువాయి)

సూపర్ వైజర్లు పర్యవేక్షించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లు రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కుటుంబ వివరాలను సేకరించగా, ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కార్యదర్శులు సందీప్‌కుమార్ సుల్తానియా, బుర్రా వెంకటేశం, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ స్నేహ శబరిష్, ప్లానింగ్ డైరెక్టర్లు రూఫర్స్, ఓంప్రకాష్‌లు పాల్గొన్నారు. అదేవిధంగా అదేవిధంగా బంజారా హిల్స్‌లోని రోడ్ నంబర్ 13లోని మినిస్టర్స్ కాలనీలోని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ వివరాలను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ స్నేహా శబరీస్‌లు సమక్షంలో ఎన్యూమరేటర్ల వివరాలను తీసుకున్నారు.

**ప్రజలందరు సహకరించాలి : మంత్రి పొన్నం**

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలందరు సహకరించాలని కోరారు. ప్రభుత్వం షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతులు అలాగే ఇతర బలహీన వర్గాల అభ్యున్నతిక కోసం సామజిక, ఆర్థిక, విద్య, ఉపాధి అలాగే రాజకీయ అవకాశాలను మెరుగుపర్చేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేసేందుకే సమగ్ర సర్వే చేట్టామని తెలిపారు. కుటుంబ సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు పూర్తిగా సహకరించి వివరాలను తెలపాలని కోరారు.

## పచ్చి అబద్ధాలు (మొదటి పేజీ తరువాయి)

అమలు చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. కొత్త పెన్షన్ విధానం కింద నెలకు రూ. 5 వేల పింఛన్ తీసుకునే వారు, పాత పెన్షన్ విధానం కింద నెలకు రూ. 50 వేలు పొందుతారని చెప్పారు. 2022 జూన్‌లో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని ప్రభుత్వం కూలిపోవడాన్ని ప్రస్తావిస్తూ, డబ్బు వినియోగంతో ప్రభుత్వాన్ని పడగొట్టడం ప్రజాస్వామ్యమా... కాదా.. అని మహారాష్ట్ర ప్రజలు నిర్ణయించుకోవాలి అని ఆయన అన్నారు. బిజెపి 'ఆపరేషన్ లోటస్'ను తమ ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొందని చెప్పారు. శివకుమార్ మాట్లాడుతూ మహాయితి నేతలు తమ రాష్ట్రానికి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలు ఏ విధంగా లబ్ధి పొందుతున్నారో చూడాలని డిమాండ్ చేశారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సమాజంలోని ప్రతి వర్గానికి ఒకటి లేదా అంతకన్నా ఎక్కువగా పథకాలను అమలు చేశామన్నారు. ఇదిలా ఉండగా గత వారంలో కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్రలో ఎన్నికల హామీలను ప్రకటించింది. రైతు రుణాలు మాఫీ, ముఖ్యమంత్రి మాఝీ లడ్కీ బెహిన్ యోజన కింద ఇస్తున్న రూ. 1500లను రెట్టింపు చేస్తామని వాగ్దానం చేసింది.

## నోట్ల రద్దు, జిఎస్‌టి

(మొదటి పేజీ తరువాయి)

పేదలను అంతంచేసే ఆయుధాలుగా మారాయని అన్నారు. అదేవిధంగా దేశంలో విద్వేషానిన నమ్ముకున్న బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతానికీ, ప్రేమాభిమానాలను నమ్ముకున్న 'ఇండియా' కూటమి సిద్ధాంతానికీ మధ్య పెద్ద జగడం జరుగుతోందని కూడా రాహుల్‌గాంధీ అన్నారు. ఈ జగడం కేవలం దానికిమాత్రమే పరిమితం కాదనీ, దేశంలో హింసకూ–ఐక్యతకూ మధ్య జరిగే యుద్ధంమని అన్నారు. ''దేశంలో నిరుద్యోగం పెరిగిపోవడానికి నరేంద్రమోదీ అనుసరిస్తున్న విధానాలదే బాధ్యత అన్నారు. పెద్ద నోట్ల ఉపసంహరణ (2016 నవంబరు 8), వస్తుసేవలపై పన్ను (జిఎస్‌టి)లు కూడా దేశంలో పేదలు, కార్మికులు, రైతుల అంతానికి ఆయుధాలయ్యాయన్నారు. ''బిజెపి,ఆర్‌ఎస్‌ఎస్ రెండూ కులం,మతం, భాషా ప్రాతిపదికలపై భారతదేశాన్ని విభజించే రాజకీయాలు చేస్తున్నాయి, కాంగ్రెస్‌పార్టీ భారతదేశ రాజ్యాంగాన్ని రక్షించాలని కోరుకుంటున్నది, అదేసమయంలో ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి రెండూ దానిని నాశనం చేయాలనుకుంటున్నాయి'' అని రాహుల్‌గాంధీ విమర్శించారు. విదేశాలలో మనీ ఇన్వెస్ట్ చేసేపెట్టుబడిదారులకు నరేంద్ర మోదీ నిధులు సమకూరుస్తున్నారని విమర్శించారు. ఐతే ఈ విషయాన్ని రాహుల్‌గాంధీ తదుపరి వివరంగా చెప్పలేదు. మోదీని ఓడిస్తామని, జనబాహుళ్య సంక్షేమంకోసం పాటుపడతామని ఆయన అన్నారు. రాహుల్‌గాంధీ ఈ బహిరంగ సభలో రెండు నిమిషాలు విరామం తీసుకున్నారు. ఆయన ఎందుకు విరామం తీసుకున్నారు? అనే విషయంపై వేదికపై ఉన్న జార్ఖండ్ రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి బన్నా గుప్తా ప్రజలకు వివరణ ఇచ్చారు. ఆజామ్ (ముస్లిం మత ప్రార్థనాసమయం) జరుగుతున్నందువల్ల రాహుల్‌గాంధీ తన ప్రసంగానికి విరామం ఇచ్చారని బన్నా గుప్తా చెప్పారు.

అదేవిధంగా ధన్‌బాద్‌లోని భాగ్‌మరలో జరిగిన మరో ర్యాలీలో కూడా ఆయన ప్రసంగించారు. పేదలను దోచుకోవడంకోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక పన్నుల విధానాన్ని రూపొందించిందని రాహుల్‌గాంధీ ఈ బహిరంగ సభలో విమర్శించారు. భారతదేశంలో అమలు చేస్తున్న పన్నుల విధానం పేదలను దోచుకుంటోందన్నారు. అదానీ కూడా దేశంలో పేదలతోపాటే వారికి సమానంగానే పన్నులు చెల్లిస్తున్నాడని, పేద, ధనక తరతమ భేదాలతో పన్నులు విధించడంలేదని విమర్శించారు. ధారవీ ల్యాండ్ (ముంబయి) ధర ఒక లక్షకోట్ల రూపాయలు విలువ ఉంటుందని, దానిని అదానీకి కేంద్రం అప్పగించిందని ఆరోపించారు. ప్రధానమంత్రి సముద్ర విహంగాలలో ఎక్కి సముద్రం లోతుల్లో ప్రయాణిస్తుంటే, దేశంలో పేదలు, మహిళలూ మాత్రం ధరల మంటల్లో కాలిపోతున్నారని ఆవేదన చెందారు. దేశంలో ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఓబిసిలు మొత్తం జనాభాలో 90 శాతం ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో మాత్రం వారికి తగిన ప్రాతినిధ్యం లేకుండాపోయిందని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పెట్టుబడిదారుల రుణాలను ఎంతభారీ మొత్తంలో మాఫీ చేశారో అంతకుసమాన మొత్తాన్ని తాము అధికారంలోకి వస్తే, పేదలకు నిధులుగా సమకూరుస్తామని హా మీ ఇచ్చారు.

## జీవులకు ప్రాణసంకటం

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యంగా శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగెం గ్రామం నుంచి 'మూసీ పునరుజ్జీవ సంకల్ప యాత్ర' మొదలు పెట్టారు. ఎన్ని అడ్డుకులు వచ్చినా సంగెం శివయ్య సాక్షిగా మూసీనదికి పునరుజ్జీవం కల్పించి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిన బూనడం పట్ల సంగెం వద్ద మూసీ పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు, పశువుల కాపర్లు హర్షం వ్యక్తం చేశారు. వారిలో కొందరి అభిప్రాయాలు ఈ విధంగా ఉన్నాయి.

**తాము పండించిన పంట తాము తినే పరిస్థితి లేదు : రైతు గురువయ్య**

''ఒక రైతు తాను స్వయంగా పండించిన పంట తానే తినే అవకాశం లేకపోవడం ప్రపంచంలో మరెక్కడా లేని దురదృష్టకర పరిస్థితి. మూసీ నది జలాల కాలుష్యం వల్ల ఇక్కడ పండిన పంటలను తాము ఇతరులకు అమ్మి ఇతరులు పండించిన పంటను కొనుక్కొని తినే దౌర్భాగ్య పరిస్థితి తమది. పంట సరిగ్గా పండుతుందా అంటే అదీ లేదు. కాలుష్యజలాల కారణంగా దిగుబడి కూడా అంతంతమాత్రమే.. చివరికి ఆ పండిన పంటలను అమ్ముకుందామన్నా సరైన ధర కూడా పలకదు. వ్యాపారులు దయ తలచి ఇచ్చిన రేటుకు ధాన్యం అమ్ముకునే పరిస్థితి. ఎక్కువ మాట్లాడితే మురికి నీటితో పండించిన పంటను ఎవరూ కొంటారంటూ ఎదురు ప్రశ్నలు.. అదిమా పరిస్థితి'' రైతు గురువయ్య తన ఆవేదనను వ్యక్తం చేశాడు.

**అనాటి రోజులు ఎటుబాయో: గొర్రెలకాపరియాదయ్య**

''నా చిన్నతనంలో మూసీనదితీరంలో ఆడుకున్నాం. పాడుకున్నాం. దాహం వేస్తే ఆ నీటిని తాగినాం.. ఆ రోజులు ఎటుబోయేనో ఏమో.. ఈ నీటినే తాము తాగుతూ మూగజీవాలకు కూడా తాగించేవాళ్ళం. కానీ నేడు ఆ నీటిని ముట్టుకుంటేనే దురదలు. వారం రోజుల పాటు చేయంతా మంటలు. ఇప్పుడు మూసీ పరివాహక ప్రాంతంలో జీవాలను మేపడమంటేనే ఓ సవాల్‌గా మారింది. ఇక్కడ పెరిగిన మేకలు కొనాలంటే జంకుతున్నారు''అని గొర్రెల కాపరి యాదయ్య చెప్పారు.

**మూసీ జలాలు అణుబాంబు కంటే ప్రమాదకర ంగా మారాయి సంగెం సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

''వికారాబాద్ గుట్టల్లో అనంత పద్మనాభ స్వామి సాక్షిగా పుట్టిది మూసీనది..ఈ నది తెలంగాణలో పుట్టి ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, ఉమ్మడి నల్లగొండ జిల్లాల గుండా 250 కిలోమీటర్లు ప్రవహించి చివరికి తెలంగాణలోనే వాడపల్లి వద్ద కృష్ణమ్మ ఒడిలో ఒదిగిపోయే ప్రత్యేకత మూసీనదిది.. రంగారెడ్డి, హైదరాబాద్, నల్గొండ జిల్లాల రైతులకు జీవనదిగా ఉండి పాడి పంటలకు నిలువుగా ఉండేవి ఈ ప్రాంతాలు. అదే జీవనది నేడు మురికి కూపంగా మారి విష జలాలలతో అణుబాంబు కంటే ప్రమాదకర ంగా మారింది. సంగెం శివయ్య సాక్షిగా చెబుతున్నా ఎవరు అడ్డు వచ్చినా.. అవసరమైతే వారిని తొక్కుకుంటూ ముందుకు వెళ్లి మరీ మూసీ నదిని

# పెండింగ్ బిల్లులు చెల్లించి అప్పుల నుండి విముక్తి

*** సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి**

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లప్రతినిధి:** జమిలి ఎన్నికల వైఖరి మోదీ ప్రభుత్వం మానుకోవాలని, దీనితో దేశాన్ని తప్పుదోవ పట్టియ్యవద్దని, ఇప్పటికే జమ్ము కాశ్మీ ర్‌లో 370 ఆర్టికల్‌ను రద్దు చేసి గందరగోళం లేపారని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ కార్మిక భవ నంలో సిపిఐ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వ హించారు. ప్రజాస్వామ్య ప్రాంతంలో ఉన్నామా నియంతృత్వంలో ఉన్నామా లేదాఫాసిస్టు ప్రాంతంలో ఉన్నామా అనేది అర్థం కాకు ండా ఉందని మండిపడ్డారు. జమిలి ఎన్నికలు ముందుకు తీసుకువచ్చి ప్రజ లను గందరగోళం చేయొద్దన్నారు. మ తోన్మాదం పెంచి పోషి స్తామంటే ఊరుకు నేది లేదన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబే ద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం అమలు అవుతున్న దేశమని రాజ్యాంగాన్ని మారుస్తా అంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.ప్రాథమిక హక్కులు కూడు, నీడ,గుడ్డ, వైద్యసౌకర్యాలు, ప్రశ్నించే హ క్కులు ఉన్నా యని ఎక్కడ తప్పులు జరిగితే అక్కడ ప్రశ్నిస్తామని మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అమలుపరచడానికి పూనుకోవా లని, పేదరికంతగ్గించడానికి పని చేయాలని అధికార దుర్వినియోగం చేస్తా అంటే సహించేది లేదని ఆగ్రహం వ్య క్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపుగా 70 శాతం బకాయిలు చెల్లించిందని, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రావాల్సిన పెండింగ్ బకాయిలు పూర్తి స్థాయిలో 100 శాతం చెల్లించి నేతన్నల ఆకలి చావులను ఆపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, జిల్లా నాయకులు పంతం రవి, కడారి రాములు, అజ్జ వేణు, సోమ నాగ రాజు, మీసం లక్ష్మణ్, అనసూర్య, మంద సుదర్శన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

**సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారం కోరుతూ చాడ వెంకట్‌రెడ్డికి వినతి**

సిరిసిల్ల పవర్‌లూం వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం సిపిఐ కార్మిక భవనం సిరిసిల్లలో పాలిస్టర్ యజమానుల సంఘం ప్రతినిధులు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లా డారు. సిరిసిల్లలోని పవర్‌లూం పరిశ్రమ సమస్యలను పరిష్కరించే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లే విధంగా కృషి చేయాలని కోరారు. చాడవెంకట్‌రెడ్డి ము ఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. వస్త్ర పరిశ్రమకు పెనుభారంగా మారిన విద్యుత్ సమస్య పరి ష్కారం కో రుతూ,గతంలో మాదిరిగా యధావిధిగా వస్త్ర పరిశ్రమకు 50శాతం ఇచ్చే విధంగా బ్యాక్ బిల్లింగ్ విషయంలో ముఖ్యమంత్రితో మాట్లా డుతానని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11మాసాలు గడుస్తున్నా ఎటువంటి ఉత్పత్తులకు ఆర్డర్లు ఇవ్వలేదని వెంటనే ఆర్డర్లు ఇచ్చే విధంగా రెండు రోజుల్లోనే ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పం తం రవి, చేనేత సెల్ అధ్యక్షులు బండారి అశోక్, యజమానుల సంఘం మాజీ అధ్యక్షులు మండల సత్యం, ఎల్లండి దేవదాసు, బూట్ల సతీష్, మంచె మల్ల య్య, కొప్పుల మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు

**మంత్రి తుమ్మల**

**ప్రజాపక్షం/హైదరాబాద్:**ధాన్యం కొనుగోళ్ళ ను వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసా య శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారు లను అదేశించారు. ధాన్యం కొనుగో లు, ఏర్పా ట్లపై సంబంధిత అధికారులతో మంత్రి శనివా రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మం త్రి మాట్లాడుతూ ధాన్యాన్ని సాధ్యమైనంత వేగంగా కొనుగోలు చేసే విధంగా యంత్రాగాన్ని అప్రమత్తం చేయాలని కోఆపరేటివ్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఉదయ్‌కుమార్‌కు సూచించారు. జిల్లా స్థాయి, మండల స్థాయి వరకు పనిచే స్తున్న కోఆపరేటీవ్ అధికారులు, డిసిఎంఎస్ అధికారులు, మార్కెటింగ్ అధి కారులతో వీడియా కాన్ఫరెన్స్ ద్వారా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచిం చారు.పిఎసిఎస్,డిసిఎంఎస్ అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు, రుణ సదుపాయాలు, కొనుగోలు చేసిన ధాన్యాన్నితరలించడానికి గోదాములను గుర్తి ంచి మార్కెటింగ్ అధికారులతో, స్టేట్ వేర్ హౌస్ అధికారులతో సమ న్వయం చేసుకుని ఏ రోజుకారోజు తరలించాలన్నారు. కొనుగోళ్ల సెంటర్లలో వడ్లను ఆరబోసుకోవడానికి, చెత్త వేరేసేందుకు ప్యాడి క్లీనర్లు, విన్నోయింగ్ ఫ్యాన్లు తగినన్ని ఏర్పాటు చేయాలని, రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగ కుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

## సామాజిక సర్వేతో అట్టడుగు వర్గాల అభివృద్ధి

**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిదామోదర రాజనర్సింహ్మ**

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** సామాజిక సర్వే తో అట్టడుగు వర్గాల అభివృద్ధి అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని విద్యానగర్ కాలనీ వార్డు నెం 32లో సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే ప్రక్రియలో భాగంగా మంత్రి కుటుంబ వివ రాలను ఎన్యుమ రేటర్ నమోదు చేశారు. సర్వే ప్రక్రియలో విద్యాన గర్‌లో గల ఇం టి నుండి మంత్రి స్వయంగా తన కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయ డం ద్వారా ప్రజలకు సర్వే యొక్క ప్రాధాన్యతను వివ రించారు. ఈ సం దర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సర్వే దేశంలోనే మొదటి సారిగా తెలంగాణ రాష్ట్రంలోనే జరుగుతుందని, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే సమగ్ర సమా చారాన్ని సేకరించడానికి ప్రతి కుటుంబానికి సంబందించిన సమాచారాన్ని సమీకరించడానికి మేలైన అవకాశం అని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి ఆపో హలు పడకుండా ఎన్యూమరేట ర్లుకు సమాచారం ఇవ్వాలని సూచి ంచారు.సర్వే ప్రక్రియలో ప్రజల పట్ల ఎన్యూమరేటర్లు బాధ్య తగా వ్యవహరిం చాలని, ప్రజలు తమ వివరాలను సక్రమంగా నమోదు చేయడం ద్వారా సేకరించిన సమా చారం తో ప్రభుత్వ విధానాల రూపకల్పన కొత్త పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం సులభం అవుతుందన్నారు.సర్వే అదికా రులను మంత్రి అభినం దించారు. అదనపు కలె క్టర్ చంద్రశేఖర్, ఎన్యూమరేటర్ అధికారులు తది తరులు సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చివరిగింజ వరకూ కొంటాం..!

**మద్దతు ధర ఇస్తాం... రైతులు అధైర్య పడొద్దు నెలాఖరులోగా రుణమాఫీ**

**మంత్రి పొంగులేటి**

**ప్రజాపక్షం/కూసుమంచి:** రైతులు పండిం చిన ధాన్యం చివరిగింజ వరకు మద్ద తు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. కూసుమంచి మం డల తహసీ ల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యా ణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లా డుతూ, వరి పంట సాగు చేసిన రైతులు నిర్భయంగా ఉండాలని, చివరి గింజ వరకు మద్దతు ధరపై ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుం దని, అదే విధంగా సన్న వడ్లకు క్వింటాల్‌కు అదనంగా రూ.500 రూపాయలు చెల్లిస్తామన్నారు. ప్రజా ప్రభుత్వం రైతులు, మహిళలు, పేదల అభ్యున్నతే లక్ష్యం గా పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను తప్పనిసరిగా అ మలు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా 61 మంది కళ్యాణలక్ష్మి, షాదీ ముబా రక్ లబ్ధిదారులకు రూ. 61,07,076 ల చెక్కులను పంపిణీ చేశారు. కూసు మంచి మండలం నాయకన్ గూడెంలో ఇటీవలి వరదల్లో మృతి చెందిన షేక్ యాకుబ్, సైదాబీ దంపతుల కుమా రులు షేక్ యూసుఫ్, షేక్ షరీఫ్ లకు కూసుమంచి మండల కేంద్రంలో ఇండ్ల స్థల పట్టాలను మంత్రి అందజే శారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డం గుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు , అభిమా నులు తదితరులు పాల్గొన్నారు.

## మళ్ళీ రాజుకున్న తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదం

**ప్రజపక్షం/నందికొండ :** తెలంగాణ, ఆంధ్ర రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మ ళ్లీ జలవివాదం రాజుకు ంది.వాస్తవ సంఘటన శుక్రవారం మధ్యా హ్నం జరగగా నాగార్జునసాగర్ డ్యాం అధికారులు, ఉన్నతాధికారులకు ఇ చ్చిన సమాచారాన్ని బయటికి రాకుండా జాగ్రత్త పడ్డారు. ఆలస్యంగా అం దిన సమాచారం ప్రకారం పూర్తి వివరాలు. తెలంగాణ రాష్ట్ర లోని నాగా ర్జు నసాగర్ ప్రాజెక్టు అధికారులు శుక్రవారం కుడి కాలువ పైన ఏర్పాటుచేసిన వాటర్ గేజ్ వద్ద వాటర్ రీడింగ్ తీసుకోకుండా తెలంగాణ ఇరిగేషన్ శాఖ అ ధికారులను, క్రింది స్థాయి సిబ్బందిని ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఇరిగేషన్ శాఖ అధికారులు అడ్డుపడంతో ఈ దశలో రెండు రాష్ట్రాలకు చెందిన ఇరిగే షన్ శాఖకు చెందిన సిబ్బంది ఒకరినొకరు దూషించుకుని కొట్టుకునే వరకు వ్యవహారం వెళ్ళింది. ఆంధ్ర ప్రాంత ఇరిగేషన్ శాఖ అధికారులు కుడి కాలు వకు సంబంధించిన నీటి విడుదల లెక్కలు చెప్పాలని తెలంగాణ ఇరిగేషన్ శాఖ అధికారులు కోరగా అలాంటి లెక్కలు ఏవి చెప్పమని, మీరు కుడి కా లువకు సంబంధించిన రీడింగులు కూడా తీయటానికి వీలులేదని తెగేసి చెప్పి పైగా మీరు ఎవరికైనా చెప్పుకోండని, బెదిరింపు ధోరణితో ఆంధ్ర ప్రాం త ఇరిగేషన్‌శాఖ అధికారులు,సిబ్బంది వ్యవహరించారని తెలంగాణ ఇరిగేషన్ శాఖకు చెందిన అధికారులు, కిందిస్థాయి సిబ్బంది తెలియజే శారు. జరిగిన విషయాన్ని క్షుణ్ణంగా తెలంగాణకు చెందిన ఇరిగే షన్ శాఖ అధికారులు అదే రోజు తెలంగాణ ఇరిగేషన్ శాఖ ఉన్నతధి కారులకు, కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ అధికారులకు తెలియజేశారు . ఇప్పటికైనా కెఆర్ ఎంబి అధికారులు కలగజేసుకొని నాగార్జునసాగర్ డ్యాం పై రెండు తెలుగు రాష్ట్రలకు సంబంధించి జలవివాదాలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

## రైల్వే ఉద్యోగాలలో తెలంగాణకు అన్యాయం చేస్తే సహించం

**ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి డిమాండ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:**రైల్వే ఉద్యోగాల భర్తీ లో తెలంగాణ యువతకు అన్యా యం చేస్తే ఇకా సహించబోమని అఖిల భారత యువజన సమా ఖ్య(ఎఐవైఎఫ్)రాష్ట్ర అధ్యక్షులు, వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్రలు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం హైదరా బాద్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఎఐవై ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. వ లీ ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్రలు మాట్లాడుతూ రైల్వే ఉద్యోగలకు భర్తీకి సంబంధించి ఏళ్ల తరబడి ఉ భయ తెలుగు రాష్ట్రాల యువతకు కేంద్ర ప్రభు త్వం తీవ్ర అన్యా యం చేస్తోందని మండిపడ్డారు. దేశంలో అత్యున్నత సర్వీసులైన ఐఎఎస్, ఐపి ఎస్,ఐఎఫ్ఎస్ లాంటిఉద్యోగాల భర్తీకే13 ప్రాం తీయభాషల్లో రాత పరీక్షలు నిర్వహిస్తుంటే.. రై ల్వే రిక్రూట్మెంట్ బోర్డు (ఆర్ఆర్బీ)ల ద్వారా భర్తీ చేసే ఉద్యోగాలకు మాత్రం కేవలం ఇంగ్లీష్, హిం దీ భాషల్లోనే పరీక్షలు నిర్వహించడంతో ఆ ఉద్యో గాలన్నీ ఉత్తరాదివారికే లభిస్తున్నాయని ఆరోపిం చారు. దీనిపై ఇప్పటికే అనేకసార్లు విజ్ఞప్తులు చేసినా కేంద్ర ప్రభుత్వం గానీ, రైల్వే శాఖ మంత్రి గానీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని రైల్వే జోన్ల పరిధిలోని ఆర్ఆర్బీ ల ఆధ్వర్యంలో 5,696 అసిస్టెంట్ లోకో పైలెట్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా ఇందులో సికింద్రాబాద్ జోన్ పరిధిలో దాదాపు 750 పోస్టులు భర్తీ చేయనున్నారు. అయితే ఇందుకు సంబంధించిన అసలైన అసలైన రాత పరీక్షలను మాత్రం హిందీ, ఇంగ్లిష్ లోనే నిర్వ హించడం సరికాదని, ఈ పరీక్షలను తెలుగుతో పాటు ఇతర ప్రాంతీయ భాషాల్లో నిర్వహించా లని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఈ అం శంపై ఎంపిలు, ఎంఎల్ఎలు రాజకీయ నాయ కులు వెంటనే స్పందించి కేంద్రంపై ఒత్తిడి తీసు కురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐ వై ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు నెర్ల కంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ లింగం రవి, సత్య ప్రసాద్,శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** ఎన్నికల సమయంలో నెరవేర్చని హామీలతో రైతులనూ, పేద ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యపెడు తూ మోసం చేస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. పోచంపల్లి మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోళ్ల తూకాలు ఆలస్యం అవుతున్న నేపథ్యంలో శనివారం ఆయన పలు మండలంలోని గౌస్కొండ రేవనపల్లి పోచంపల్లి కొనుగోలు మార్కెట్ యార్డులలోని ధాన్యపు కొనుగోళ్ళను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లా డుతూ రైతు రుణమాఫీ రైతు భరోసా హామీల అమలులో ఘోరంగా విఫ లమైందని, రాష్ట్రవ్యాప్తంగా కేవలం 17 లక్షల మందికి మాత్రమే రుణమా ఫీ జరిగిందని, మిగిలిన వాళ్ళ పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తానని మాట తప్పిందని, కేవలం సన్న వడ్లకు మాత్రమే పరిమితం చేయడం రైతులను మోసం చేయడమేన న్నారు. రైతు కూలీలు బ్యాంకులలో సకాలంలో చెల్లించే రుణాలు కట్టలేదు అనే సాకుతో మిగిలిన రైతులకు రుణమాఫీ చేయడం లేదన్నారు. భవిష్యత్తులో అప్పులు రాకుండాదగా చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వాగ్దానాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని ప్రజలను హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి కోసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్ మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి , కర్నాటి ధనంజయ,జిల్లా రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి జిల్లా కిసాన్ మోర్చాఅధ్యక్షులు ఫకీర్ రాజేందర్ రెడ్డి, ఉన్నారు.

## అమ్రాబాద్ టైగర్ రిజర్వులో పులుల సంరక్షణకు అక్కడి గ్రామాలను తరలించాలి

**-అటవీశాఖ ప్రధాన సంరక్షణాధికారి ఆర్ఎం డోబ్రియల్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:**గతంలో కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో గ్రామాల తరలింపు మాదిరిగానే అమ్రా బాద్ టైగర్ రిజర్వులో పులల సంరక్షణ కోసం అక్కడ ఉన్న గ్రామాలను మైదాన ప్రాంతాలలోకి తరలించాలని రాష్ట్ర అటవీ శాఖ ప్రధాన సంరక్ష ణాధికారి ఆర్ఎం.డోబ్రియల్ చెప్పారు. దూలపల్లి లోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో రెండు రో జుల పాటు జరిగిన అటవీశాఖ అధికారుల వర్క్ షాప్ శనివారం ముగిసింది. ఈ సమావేశంలో అన్ని జిల్లాల సిసిఎఫ్, డిఎఫ్ఒ, ఎఫ్‌డిఒ అధికా రులు పాల్గొన్నారు. అటవీశాఖకు సంబంధించిన అన్ని అంశాలపై కూలంకుషంగా ఈ వర్క్‌షాప్‌లో చర్చించారు. వైల్ లైఫ్, కంపా, ఫైర్ మేనేజ్‌మెంట్, సోషల్ ఫారెస్ట్, హరితనిధి వంటి అన్ని అంశాలపై చర్చించారు. వచ్చే ఏడాదికి సంబంధించి ఎంజిఎ న్ఆర్ఇజిఎస్ పథకం కింద నర్సరీల ఏర్పాటు ప్ర క్రియ వేగవంతం చేయాలని, రహదారుల వెంట అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటు, అలాగే ఎకో టూ రి జం, అర్బన్ పార్కుల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు.ఆర్ఎం.డోబ్రియాల్‌అటవీ ప్రాం తా ల్లో గుత్తికోయల ఆవాసాల సమస్యలపై అధికారు లతోచర్చించారు. జగిత్యాల, వికారాబాద్ జిల్లాల్లో నగర్ వాన్ యోజన పథకం కింద పనుల పురోగ తిపై సమీక్షించారు. గత పదేళ్ళలో అగ్నిప్రమాదా లు జరిగిన తీరును పరిశీలించి భవిష్యత్తులో జరగ కుండాఅటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజల దగ్గర కు వెళ్ళి వారికి అవగాహన కార్యక్రమాలు చేపట్టా లని నిర్ణయించారు. సమావేశంలో పిసిసిఎఫ్ (వైల్డ్ లైఫ్)ఈలుసింగ్ మేరు, పిసిసిఎఫ్ (అడ్మిన్) సునీ తాభగవత్, సిసిఎఫ్‌లు ప్రియాంక వర్గీస్, రామలిం గం, పలువురు అధికారులు పాల్గొన్నారు..

## సమస్యలు గాలికొదిలేసి విహార యాత్రలు

**మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు**

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనను గాలికి వదిలేసి గాలి మోటార్లలో ముఖ్యమంత్రి, మంత్రులు విహార యాత్రలు, పార్టీ యాత్రలు చేస్తున్నారని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. శనివారం నర్సాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ, సిఎం రేవంత్‌రెడ్డి బిఆర్ఎస్ నాయకులపై మాట్లాడుతున్న తీరు చూస్తుంటే సీఎం హోదాలో ఉండి దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని ఆయన ఎద్దేవా చేశా రు. ప్రతిపక్షాలపై పెట్టిన దృష్టి ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలలోని విద్యార్థులు పడు తున్న కష్టాలు విద్యాశాఖ మంత్రిగా సిఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల కష్టాలు పట్టవా అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ మురికి కంటే రేవంత్ రెడ్డి నోటికంపు ఎక్కువైందన్నారు. ఎన్ని కల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా గద్దె నెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వమని, రైతులను విద్యార్థు లను మహిళలను నిరుద్యోగులను నిండా ముం చినా ముఖ్యమంత్రిని ఆయన ఎద్దేవా చేశారు. మా జీ ముఖ్యమంత్రి కెసిఆర్‌పై కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదన్నారు. చిల్లర మాటలు మాట్లాడే మంత్రులను మంత్రి పదవి నుండి వెంటనే బర్తరఫ్ చేయాలని గవర్నర్‌ను కోరుతున్నామన్నారు. మూసి దుర్వాసనకు 50 ఏళ్ల కాంగ్రెస్ పదేండ్ల తెలుగుదేశం ప్రభుత్వాలే కారణమన్నారు. కేటీఆర్‌పై కక్ష సాధింపు ధోరణిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరి స్తుందని రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తుందని తనను పాదయా త్రకు రావాలన్నారు. పాదయాత్ర మూసి నిర్వాహకుల నుంచి పాదయాత్ర చేద్దామా నీ కు దమ్ముందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే హరీష్ రావు సవాల్ విసిరారు. టిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ప్రజల పక్షాన నిరంతరం అం డగా ఉండి కాంగ్రెస్ ప్రభుత్వం విధానాలను ఎండ గాడుతూ ప్రజలకు వివరిస్తామన్నారు . ఈ కార్య క్రమంలో ఎమ్మెల్సీలు యాదవ రెడ్డి, శేరి సుభాష్ రెడ్డి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షులు పద్మాదేవేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, క్రాంతి కిరణ్, ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దుర్గాప్ప గారి అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ నయీముద్దీన్, గోవర్ధన్ రెడ్డి, గొర్రె వెంకట్ రెడ్డి, సత్యం గౌడ్, జితేందర్ రెడ్డి, బాబ్యానాయక్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ధరణి పోర్టల్‌లోని సమస్యల పై తక్షణమే ఓ నిర్ణయం తీసు కోవాలని తెలంగాణ వ్యవసా య, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి రాష్ట్ర డిప్యూ టీ ముఖ్యమంత్రి మల్లు భట్టివి క్రమార్కను కోరారు. హైదరా బాద్ ట్రిబుల్‌ఆర్‌లో భూము లు కోల్పోతున్న రైతులను అన్నివిధాలుగా ఆదుకునేందుకు చర్యలు చేపట్టా లని ఆయన కోరారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో తెలం గాణ వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సమావేశమయ్యారు. సమావేశంలో కోదండరెడ్డితో పాటు భూమి సునీల్, రామగుండం ఎంఎల్ఎ రాజ్ సింగ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై వారు చర్చించారని కమిషన్ తెలియజేసింది. రాష్ట్రంలో చేపట్టనున్న భూసం స్కరణ చట్టం, అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టం, ధరణి సమస్యలు, ప్రతిపాదన దశలో ఉన్న కొత్త రెవెన్యూ రికవరీ చట్టం, తదితర అంశాలను రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి ఉప ముఖ్యమంత్రికి వివరించారు.

## పోలీసు శాఖ పరువు తీస్తున్నారు

**స్టేషన్‌కు వచ్చిన బాధితులపైనే థర్డ్ డిగ్రీ ప్రయోగం అన్యాయంగా ప్రాణాలను బలిగొంటున్న వైనం బాధితులతో ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మరచిన పోలీసులు**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొంత మంది పోలీసులు వ్యవహరిస్తున్న తీరు వల్ల తెలంగాణ పోలీసు శాఖ ప రువు పోతుంది. అల్లాదుర్గం, సూర్యపేట రూరల్ పోలీ సు స్టేషన్‌లో సిబ్బంది వ్యవహరించిన తీరే ఇందుకు నిద ర్శనం. అసాంఘిక శక్తులు, నిందితులు, అక్రమ ఇసుక వ్యాపారులు, సబ్సిడీ బియ్యం, గంజాయి, డ్రగ్స్ స్మగ్ ర్లతో కుమ్మకైన పోలీసులపై డిజిపి జితేందర్ సస్పెన్స న్‌లు, బదిలీలు, డిస్మిస్ లాంటి చర్యలు చేపడుతున్నప్ప టికీ కింది స్థాయిలో పోలీసులు తమ నడవడికను మార్చుకోలేకపోతున్నారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఫలితంగా అమాయక యువకుల ప్రాణా లను బలితీసుకుంటున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన తలారి కిషన్ అనే వ్యక్తి తన మెబైల్ ఫోన్ పోయిందని అల్లాదుర్గం పోలీసు స్టేషన్‌కు వెళ్లి శుక్రవారం ఫిర్యాదు చేశాడు. అయితే అక్కడి పోలీసు కానిస్టేబుల్ సాయిలు ఫిర్యాదుదారుడినే కోట్టాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన కిషన్ తన చావుకు పోలీసులే కారణమని సూసైడ్ నోట్‌లో పేర్కొంటూ పె ట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ చర్య పోలీసువర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బా ధితులతోఫ్రెండ్లీగా వ్యవహరించాల్సిన పోలీసులు అం దుకు భిన్నంగా వ్యవహరించడం వల్ల పోలీసుల పరువు బజారున పడుతున్నదని పోలీసులే అంటున్నారు. బాధి తుల కోసమే ఉన్నామని చెప్పుక

ఫోకస్

# క్రీడ

## ఆ నలుగురు..

భారత క్రికెట్ జట్టుకు వెన్నెముకగా నిలిచిన నాలుగురు లెజెండరీ స్పిన్నర్లు (ఎడమ నుంచి కుడికి)భగవత్ చంద్రశేఖర్, బిషన్ సింగ్ బేదీ, ఎర్రాపల్లి ప్రసన్న, శ్రీనివాస వెంకటరాఘవన్. 1960,1970 దశకాల్లో వెస్టిండీస్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి ప్రపంచ మేటి జట్లను కట్టడి చేసిన ఘనత ఈ నలుగురికే దక్కుతుంది. వెస్టిండీస్ ఫాస్ట్ బౌలింగ్‌తో క్రికెట్ ప్రపంచాన్ని శాసించగా, భారత ట్రాక్స్ స్పిన్‌కు అనుకూలంగా ఉంటాయి కాబట్టి, స్పిన్నర్ల హవా నడిచింది. 1945 మే 17న జన్మించిన చంద్రశేఖర్ కెరీర్‌లో 58టెస్టులుఆడి, 242 వికెట్లు సాధించాడు. ఒక వన్డే ఇంటర్నేషనల్‌లో మూడు వికెట్లు పడగొట్టాడు. 1946 సెప్టెంబర్ 25న జన్మించిన బేదీ 2023 అక్టోబర్ 23న, తన 77 ఏట కన్నుమూశాడు. అతను కెరీర్‌లో 67టెస్టుమ్యాచ్‌లు ఆడాడు. 266 వికెట్లు కైవసం చేసుకున్నాడు.10వన్డేల్లో 7 వికెట్లు కూల్చాడు. 1940 మే 22న జన్మించినప్రసన్న 40టెస్టుల్లో 189 వికెట్లనుతన ఖాతాలో వేసుకున్నాడు. 1945 ఏప్రిల్ 21న జన్మించిన వెంకటరాఘవన్ తన కెరీర్‌లో 57 టెస్టులు ఆడి 154 వికెట్లు పడగొట్టాడు. 15 ఇంటర్నేషనల్స్‌లో 5 వికెట్లు సాధించాడు. వీరి కెరీర్ చరమాంకంలో వన్డే ఇంటర్నేషనల్ ఫార్మాట్ ప్రచారంలోకి వచ్చింది. ప్రసన్నకు తప్ప మిగతా ముగ్గురూ వన్డేల్లో భాగస్వాములయ్యారు.

భగవతీ చంద్రశేఖర్, బిషన్‌సింగ్‌బేదీ, ఎర్రాపల్లి ప్రసన్న, శ్రీనివాసవెంకటరాఘవన్

## సాగర్ భరద్వాజ్

సంగీత ప్రపంచంలో అసాధారణ ప్రతిభాపాటవాలు కనబరుస్తున్న సాగర్ భరద్వాజ్ 2021లో యూత్ ఐకాన్ అవార్డు గెల్చుకున్నాడు. 2023లో మరోసారి ఈ అవార్డును సొంతం చేసుకొని, సంగీత దర్శకుడిగా తన ప్రతిభకు తగిన గుర్తింపు సంపాదించాడు. గత ఏడాది బడోలా మ్యూజిక్ ప్రొడక్షన్ విడుదల చేసిన 'మేరే భోలే' ఆల్‌బం సాగర్ భరద్వాజ్‌ను కొత్త శిఖరాలకు చేర్చింది. అతను కేవలం సంగీత దర్శకుడిగా మాత్రమేగాక, వ్యాపారవేత్తగా, గాయకుడిగా, లైఫ్‌స్టయిల్ మోడల్‌గా కూడా రాణిస్తున్నాడు. హర్యాన్వి సంగీత పరిశ్రమలో అతి పిన్న వయస్కుడైన కళాకారుడిగా రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించాడు. హర్యానాలోని గుర్‌గావ్‌కు చెందిన సాగర్ భరద్వాజ్, ప్రజలకు చేరువ కావడానికి సంగీతాన్ని మాధ్యమంగా ఎంచుకున్నాడు. అసంఖ్యాకమైన యువతను తన సంగీతం, పాటలతో ఆకట్టుకుంటునాన్నిడు. లక్షలాది మందిలో స్ఫూర్తిని నింపుతున్నాడు. ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి వయసుతో, అనుభవంతో పనిలేదని నిరూపిస్తున్నాడు. మూడేళ్ల వ్యవధిలో రెండుసార్లు యూత్ ఐకాన్ అవార్డును అందుకున్న తొలి భారతీయుడిగా గుర్తింపు పొందాడు. నేటి పోటీ ప్రపంటచంలో విజయం కోసం ప్రయత్నించే ఎంతో మంది ఔత్సాహిక కళాకారులకు మార్గదర్శిగా మారాడు.

# ఒలింపిక్స్ నిర్వహణకు భారత్ రెడీ!



ప్రపంచ మేటి క్రీడా వేడుక ఒలింపిక్స్‌ను నిర్వహిం చడానికి భారత్ సంసిద్ధత వ్యక్తం చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తు న్నది. సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండా, దేశంలో ఉన్న వసతుల గురించి ఆలోచించ కుం డా, 2036 ఒలింపిక్స్‌ను నిర్వహి ంచేందుకు భారత్ బిడ్ వేయడం తొందరపాటు చర్యగానే భావిం చాలి. దేశం ఒక మెగా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వడం హర్షణీయమే. కాదనడాకి వీల్లేదు. కానీ, అందు కు తగిన పరిస్థితులు ఉన్నాయా? అనేదే ప్రశ్న. అతి కొన్ని సందర్భాల్లో తప్ప, ఒలింపిక్స్‌లో చేసిన ఖర్చుకు, వచ్చిన ఆదాయానికీ పొంతన ఉండడం లేదు. ఒలింపిక్స్‌ను నిర్వహించామని ఘనంగా చాటుకోవడం మినహా ఆతిథ్య దేశాల కు మిగులుతున్నది ఏమీ లేదు. 2008లో ఒలింపిక్స్ చైనాలో జరిగాయి. సుమారు 40 బిలియన్ డాలర్లు ఖర్చుకాగా, వచ్చిన ఆదా యం 3.6 బిలియన్ డాలర్లు మాత్రమే. కరోనా కారణంగా పలుమార్లు వాయిదా పడిన తర్వా త, ఎట్టకేలకు నిర్వహించిన టోక్యో ఒలింపిక్స కు జపాన్ 13 బిలియన్ డాలర్లు ఖర్చు చేసిం ది. 8.87 బిలియన్ డాలర్లు రాబట్టుకోగ లిగింది. పారిస్ ఒలింపిక్స్ నిర్వహణకు ఫ్రాన్స్ 9.1 బిలియన్ డార్లు వెచ్చించింది. ఎంత ఆదాయం వచ్చిందనేది ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. లాభం లేకపోయినా, ఖర్చుకలు తడిసిమోపెడు కాకుండా ఉంటే చాలనుకునే పరిస్థితి. మన దేశం విషయానికి వస్తే, క్రికెట్ కు తప్ప మరే ఇతర క్రీడలకూ అంతగా ఆదర ణలేని మన దేశంలో ముందుగా సమగ్ర క్రీడా విధానాన్ని అమలు చేయాలి. క్రీడా సంబరాల నిర్వహణలో జరుగుతున్న మోసాలను కట్టడి చేయాలి. మౌలిక సదుపాయాల కల్పన నుంచి ప్రజలను పోటీలకు ఆకర్షించడం వరకూ ఎన్నో చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, పూర్తి చేయాలి. అంతర్జాతీయ ఒలింపిక్ మం డలి (ఐఒసి) నిబంధనలకు అనుగుణంగా స్టేడి యాల నిర్మాణం లేదా మరమ్మతులు చేపట్టా ల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వెళ్లకుండానే,ఐఒసి ఆధ్వ ర్యంలోని ఫ్యూచర్ హోస్ట్ కమిషన్‌కు లెటర్ ఆఫ్ ఇంటెండ్‌ను సమర్పి ంచడం విచిత్రం. బిడ్‌ను విజయవంతంగా పొంద గలిగితే, సమ్మ ర్ ఒలింపిక్స్‌తో పా టు దివ్యాంగులకు నిర్వహి ంచే పారాలింపిక్స్‌కు కూడా భారత్ ఆతి థ్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ చైనా, దక్షిణ కొరియా, జపాన్ మాత్రమే ఒలింపిక్స్ ను నిర్వహించిన ఆసియా దేశాలుగా గుర్తింపు పొందాయి. ఒకవేళ భారత్‌కు అవకాశం వస్తే, ఈ దేశాల జాబితాలో చేరుతుంది. వచ్చే ఏడాది ఐఒసి ఎన్నికలు జరగనున్నాయి. ఆ తర్వాతే బిడ్స్‌ను పరిశీలించి, తుది నిర్ణయం తీసుకుం టారు. 2028 ఒలింపిక్స్‌కు లాస్‌ఏంజిల్స్, 2032 ఒలింపిక్స్‌కు బ్రిస్బేన్ ఇప్పటికే ఎంపిక య్యాయి. ఆ తర్వాత అవకాశం కోసం భారత్ పోటీప డుతున్నది. ఒలింపిక్స్ చరిత్ర ను పరిశీ లిస్తే, తొలి క్రీడలు క్రీస్తు పూర్వం 8వ శతాబ్దంలో జరిగాయని అంటారు. గ్రీస్‌లోని ఒలింపియాలో, గ్రీకు దేవుడు జ్యూస్ గౌరవార్థం ఈ పోటీలను నిర్వహించారనడానికి కొన్ని చారిత్రక ఆధారాలు ఉన్నాయి. కాలక్రమేణ ఈ పోటీలకు తెరపడగా, ఆధునిక ఒలింపిక్స్‌ను 1896లో గ్రీస్‌లోని ఏథెన్స్ వేదికగా నిర్వహించారు. ఒలింపిక్ నినాదం 'సిటియస్, అల్టియస్, ఫోర్టియస్'. ఇవి లాటిన్ పదాలు. 'వేగవంత మై న', 'ఉన్నతమైన', 'బలమైన' అని ఈ పదాలకు అర్థం. ఒలింపిక్ చిహ్నంలో ఐదు వృత్తాలు ఒకదానితో ఒకటి కలిసి ఉంటాయి. ఒక్కో రింగు ఒక్కో ఖండాన్ని (ఆఫ్రికా, అమెరి కా, ఆసియా, ఐరోపా, ఓషియానియా) సూచిస్తా యి. క్రీడలు ప్రపంచ దేశాల మధ్య ఐక్యతకు దోహదపడతాయన్నది వాస్తవం. ప్రతి సారీ ఒలింపిక్స్ జరిగే ముందు, క్రీడా జ్యోతిని ఒలి ంపియా లో సంప్రదాయ విధానంలో వెలిగిస్తా రు. అక్కడి నుంచి వివిధ దేశాల మీదుగా ర్యాలీని రిలేగా ఆతిథ్య దేశానికి తీసుకొస్తారు. అక్కడ ప్రజ్వలింపచేసే ఒలింపిక్ జ్యోతి, క్రీడల ప్రారంభం నుంచి ముగింపు వరకూ వెలుగు తునే ఉంటుం ది. ఒలింపిక్ క్రీడలను నిర్వహి ంచాలని భారత్ కోరుకో వడంలో తప్పులేదు గానీ, అందుకు అవసర మైన సౌకర్యాలను సిద్ధం చేయడానికి ప్రణాళికను చేపట్టకపో వడం తప్పు. ఇప్పటి నుంచే వ్యూహాత్మకంగా నిర్ణయాలు తీసుకొని, ప్రణాళి కలను సిద్ధం చేసుకొని, రాజకీయా లతో సంబంధం లేకుండా అంద రూ కలసికట్టుగా వాటి అమలకు కృషి చేస్తే తప్ప, ఒలింపిక్స్ నిర్వ హణలో భారత్ తన లక్ష్యాన్ని చేరు కోవడం కష్టం.

## క్రీడలకు రాజకీయాల చీడ

నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టెర్‌డామ్‌లో ఇజ్రాయెల్ సాకర్ ఫ్యాన్స్‌పై శుక్రవారం జరిగిన దాడిని క్రీడాప్రపంచం ముక్తకంఠంతో ఖండిస్తున్నది. వాస్తవానికి క్రీడలకు, రాజకీయాలతో సంబంధం లేదు. పరమ విరోధులుగా యుద్ధంలో మునిగితేలే దేశాల అథ్లెట్లు కూడా, ప్రాంతీయ లేదా అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొంటారు. రాజకీయపరమైన కక్షలుగానీ, కార్పణ్యాలుగానీ లేకుండా క్రీడాస్ఫూర్తితో వ్యవరిస్తారు. కానీ, దురదృష్టవశాత్తు కొన్ని సందర్భాల్లో కొంత మంది తమ నిరసనలు తెలపడానికి క్రీడలను మాధ్యమంగా వినియోగించుకుంటున్నారు. 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఇజ్రాయెల్ అథ్లెట్ల బృందంలో 11 మందిని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. వారిని పాలస్తీనా అనుకూలవాదులుగా అప్పట్లో అనుమానించారు. బందీలుగా చేసుకున్న అథ్లెట్లను వారు చంపేశారు. ఆ ఘటనను 'మ్యూనిచ్ మారణ హోమం','ఒలింపిక్స్‌లోబ్లాక్ సెప్టెంబర్'అని పిలుస్తారు. వాదనలు ఎలా వున్నా.. డిమాండ్లు ఏవైనా... క్రీడలను వేదికగా చేసుకోకూడదు. క్రీడాకారులను లక్ష్యంగా ఎంచుకోకూడదు. క్రీడాభిమానులపై కక్షపూరితంగా వ్యవహరించకూడదు. కానీ, నెదర్లాండ్స్‌కు చెందిన అజెక్స్, ఇజ్రాయెల్ జట్టు మకాబి టెల్ అవీవ్ మధ్య ఫుట్‌బాల్ మ్యాచ్ ప్రారంభానికి ముందు, స్టేడియంలో కొంత మంది పాలస్తీనాకు అనుకూల నినాదాలు చేసిన వారంతా, గాజాలో ఇజ్రాయెల్ జరుపుతున్న మారణకాండను ఖండించారు.అంతటి ఆగకుండా ఇజ్రాయెల్ మద్దతుదారులపై దాడులకు పాల్పడ్డారు.ఈఘటనను అంతర్జాతీయక్రీడా సమాజం ఖండించింది. దాడిలో గాయపడిన వారంతా త్వరగా కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేసింది. గాజాలో ఇజ్రాయెల్ అనుసరిస్తున్న అమానుష వైఖరిని ఎవరూ హర్షించరు. సమర్థించరు. కా నీ, క్రీడలను ఈ వి వాదాలకుదూరం గా ఉంచాలి. క్రీడలకు రాజకీయ చీ డ అంటితే, భవిష్యత్తులో దాడులు పెరుగుతాయి. అనర్థాలు జరుగుతాయి.

## పొంచివుండే ప్రమాదం?



క్రీడల వెంటనే ప్రమాదాలు కూడా పొంచి ఉంటాయి. అయితే, కొన్ని క్రీడలు అత్యంత ప్రమాదకరమైనవి. బాక్సింగ్, రగ్బీ, ఐస్ స్కేటింగ్, స్కీయింగ్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ వంటి క్రీడల్లో అథ్లెట్లు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఎన్నో. ఇక ప్రపంచంలోనే ఎక్కువ ప్రమాదకరమైన క్రీడగా పర్వతారోహణను పేర్కోవాలి. కేంబ్రిడ్జి యూనివర్శిటీ నిర్వహించిన అధ్యయనంలో పర్వతారోహకులు ఎక్కువగా ప్రమాదబారిన పడతారని తేలింది. సరైన ఫిట్నెస్, మంచి నైపుణ్యం ఉంటే ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చు. క్రీడలతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిసినప్పటికీ, చాలా మంది ఆ వైపే అడుగులు వేయడం కొత్తకాదు. 'జంటిల్మన్ గేమ్'గా పేర్కొనే క్రికెట్ మైదానంలోనూ, ఫిల్ హ్యూజెస్, రమణ్ లాంబా వంటి ఆటగాళ్లు తీవ్రంగా గాయపడి మరణించారు. నారీ కాంట్రాక్టర్ తలకు బలమైన గాయం తగిలి, దాదాపు ప్రాణాలు కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొని, అదృష్టవశాత్తు బయటపడ్డాడు. కానీ, అతని క్రికెట్ కెరీర్ అక్కడితో ముగిసింది. ఈ రకంగా చూస్తే, ప్రతి క్రీడలోనూ ఏదో ఒక ప్రమాదం ఉండనే ఉంటుంది. పిల్లలు ఆటలాడుతూ దెబ్బలు తగిలించుకోవడం చాలా సహజం. అయినప్పటికీ ఆటలు మానరు. క్రీడ ల్లో పాల్గొనడమేకాదు...వృత్తిగాతీసుకునేవారు కూడా లక్ష ల్లోనే ఉంటారు.

# సమాజ పురోగమనంలో శ్రమ విలువ వెలకట్టలేనిది

### ప్రముఖ కవి సుద్దాల అశోక్‌తేజ

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ప్రపంచ చరిత్ర మొత్తం శ్రమతోనే నిండి ఉందని, మానవ వికాసం, సమాజ పురోగమనంలో శ్రమ విలువ వెలకట్టలేనిదని ప్రముఖ కవి, ఉత్తమ సినీ గేయ రచయిత జాతీయ అవార్డు గ్రహిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. హైదరాబాద్, కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లో నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ సుద్దాల అశోక్ తేజ రాసిన 57వ ''శ్రమ కావ్య" గానం కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఆర్ఆర్ పరిశోధన కేంద్రం డైరెక్టర్ డా. టి. సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తమ సిని గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, సీఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, ప్రొ. జివి. రత్నాకర్‌లు పాల్గొన్నారు. అనంతరం ''శ్రమకావ్యం''రచయిత సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ నాలుగు వేదాలు పుట్టకన్నా ముందే శ్రమ సామవేదాన్ని నేను ప్రవచిస్తున్నానని, ఆధునిక కథా వాఙ్మయాని కన్నా ముందే తను, శ్రమ కవితా కథా కథనకావ్యానికి సిరా పుష్పాల నేరి అక్షర మాల కట్టనని, ఇప్పుడు మనుషులను విడదీసే మతాలు పుట్టక ముందే తాను ఏకైక శ్రామిక మతాన్ని ప్రకటిస్తున్నానని తెలిపారు. క్రైస్తవం, ముస్లిం, హిందూ మతాల కంటే ముందే ఏర్పడిన ఏకైక మతం శ్రామిక మతమని, పౌరాణిక ప్రతీకలను వాడుకొని కావ్యాలను రాశానని చెప్పారు. శ్రమ ప్రయాణమే శ్రమాయణం అని, రాముడు ధనస్సు, కృష్ణుడు వేణువు వేసుకున్న ఆభరణాలు, విష్ణువు పెట్టుకున్న కిరీటం కూడా శ్రమ జీవులు తయారు చేసిందేనని, శ్రముడు, శ్రమి కలిసి సాగిన ప్రస్థానం ఈ శ్రమ కావ్యం అని అన్నారు. శారీరక శ్రమ నుండే పాట, నృత్యం,పుట్టాయన్నారు. సుద్దాల అశోక్ తేజ తనదైన బాణీ ఁశ్రమకావ్యం' గానం వినిపించగా, అయన సాహిత్యంలోని గుబాళింపు పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శులు మాజీ ఎమ్మెల్సీ పి.జె. చంద్రశేఖర్ రావు, చెన్నమనేని వెంకటేశ్వర్ రావు, కోశాధికారి వి. చెన్నకేశవ రావు, ఎన్ఆర్ఆర్ పరిశోధన కేంద్రం సభ్యులు దేశిని లక్ష్మినారాయణ, జోస్యభట్ల కల్పన, కనపర్తి జ్యోశ్న, డి కృష్ణ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల అభివృద్ధిపై పాలకులు దృష్టి

### ఆదివాసీల అస్తిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే

### తెలంగాణ గిరిజన సమాఖ్య(టిజిఎస్)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్

**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** ఆధునితకు దూరంగా కొండకోనల్లో నివసించే ఆదివాసిల అభివృద్ధిని కేంద్ర, రాష్ట్ర పాలకులు దృష్టి సారించాలని, ఆదివాసిలను కేవలం ఓటు బ్యాంకుగానే పాలకులు పరిగణిస్తున్నారని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్ అన్నారు. తెలంగాణ గిరిజన సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3వ మహాసభ శనివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసిలను గుర్తించి వారి అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర పాలకులదేనన్నారు. అడవులనే నమ్ముకొని జీవిస్తున్న గిరిజనులను ఆ అడవుల నుంచి దూరం చేసే కుంట్రలు జరుగుతున్నాయని, హరితహారం పేరుతో దాడులు, నిర్భందాలకు పాల్పడుతూ గిరిజనుల అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లిస్తుండటంతో గిరిజన గ్రామాల కనీస మౌళిక వసతులకు నోచుకోవడం లేదన్నారు. కేంద్ర స్థాయిలో, రాష్ట్రస్థాయిలో గిరిజనుల సంక్షేమం కోసంరూపొందించిన చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని, పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికి ఆదివాసిలఅభివృద్ధిసాధించలేకపోతున్నారన్నారు.కొమరంభీం, బిర్సా ముండసేవాల్,మల్లుదొర, సమ్మక్క, సారక్క లాంటి ఎందరో ఆదివాసి నాయకులు రాజ్యాంగం కల్పించిన చట్టాల అమలు కోసం ప్రాణత్యాగాలు చేశారని వారి స్ఫూర్తితో హక్కుల సాధన, పెట్టుబడిదారుల ఆదిపత్యం నుండి బయటపడేందుకు ఆదివాసి గిరిజనులు సంఘటితమై ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు రామ్మూర్తినాయక్, నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు, గిరిజన సమాఖ్య జిల్లాప్రధాన కార్యదర్శి భూక్యా శ్రీనివాస్, సోంది కుటుంబరావు, బానోతు వెంకట్, గుగులోతు రామచంద్రనాయక్, వెంకటనర్సమ్మ, భూక్యా దసురు, గుగులోతు కృష్ణ పాల్గొన్నారు.

# చట్ట సభలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

### ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి డిమాండ్

**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** చట్ట సభలలో మహిళలకు యాభైశాతం రిజిరేషన్ కల్పించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి అన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్లూ) వరంగల్ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం శనివారం వరంగల్‌లోని తమ్మెరభవన్‌లో జిల్లా కార్యదర్శి రాయల అధ్యక్షత నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా సదాలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మహిళలు అంణచివేతకు గురౌతున్నారని, రెండవ తరగతి పౌరులుగా చూడబడుచున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు సామాజింగా, ఆర్థికంగా, రాజకీయంగా పురుషులతో సమానంగా ఎదగాలే కాని, మహిళలు అనేక హింసలకు బలౌతున్నారన్నారు. మహిళలపై రోజు రోజుకు దాడులు, అత్యాచారాలు, గృహ హింసలు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టడానికి బలమైన చట్టాలు రావాలని, పాస్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని కోరారు. స్త్రీలకు విద్య,వైద్యం సౌకర్యాలు పెంచాలని, వారిఆరోగ్య పరిస్థితులను మెరుగుపరచాలన్నారు. చట్టసభలలో మహిళలకు 50% రిజరేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్ఎఫ్ఐడబ్లూ జిల్లా అధ్యక్షురాలు కవిత, విక్టోరియ, నాయకురాలు భవాని, విజయలక్ష్మి , సౌందర్య, ఉమ, పద్మశెట్టి మారుతి, హంస, మంజుల, సింగారావు శైలజ తదితరులు పాల్గొన్నారు.

# అజేయమైనది కమ్యూనిజం

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** అజేయమైనదని కమ్యూనిజమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సిపిఐ 100 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా గాంధీపార్కు సెంటర్ నుండి సిపిఐ కార్యాలయం వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో సిపిఐ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడారు. పేద ప్రజలకు అండగా ఎర్ర జెండా నిలిచిందని, అనేక పోరాటాల ద్వారా బడుగు,బలహీనవర్గాల హక్కుల సాధనకై, పేదప్రజల సమస్యల పరిష్కారానికై వారి వెంట నిలిచిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. సిపిఐ వంద సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులను సన్మానించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సిపిఐకనబరిచిన తీరు గుర్తు చేశారు.తెలంగాణ సాయుధ పోరాటంలో అనేకమంది నాయకులు అమరులైనారన్నారు. అమరవీరుల పోరాట స్ఫూర్తితో నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. శ్రమ దోపిడికి వ్యతిరేకంగా తన,మన స్వార్థం లేని నూతన సమాజం నిర్మించడమే లక్ష్యంగా వందేళ్ల నాడు భారతదేశంలో కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భవించిందని పేద ప్రజల సమస్యలే అజెండాగా ముందుకు సాగుతున్నామని భారతదేశంలో జరిగిన అన్ని ప్రజా ఉద్యమాలలో పాల్గొన్న సిపిఐ అని ఆయన సగర్వంగా ప్రకటించారు. ములు, జిల్లా కార్యదర్శి బెజవాడవెంకటేశ్వర్లు,కంబాల శ్రీనివాస్, ఎం. వెంకటేశ్వర్లు, ఉస్తేల నారాయణరెడ్డి, దేవరం మల్లీశ్వరీ,ధూళిపాళ ధనుంజనాయుడు, గుండు వెంకటేశ్వర్లు, జడ శ్రీనివాస్, దొంతగాని సత్యనారాయణ, జడ వెంకన్న, సోమగాని కృష్ణ, ఇందిరాలవెంకటేశ్వర్లు, సుందరి పద్మ,జక్కుల రమేష్, యల్లావుల రమేష్, మామిడి వెంకయ్య, జక్కుల శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.

# 6 గ్యారంటీల అమలు కోసం పోరాటం

### మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఉస్తెల సృజన

**ప్రజాపక్షం/భువనగిరి:** రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ శాసనసభ ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ప్రకటించిన 6 గ్యారంటీల అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా మహిళలు పోరాటాలు నిర్వహించాలని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఉస్తెల సృజన తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా సమాఖ్య జిల్లా సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు సోమన సబిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్న ఇచ్చిన వాగ్దానాలు అమలు కావడం లేదన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడం కొంత ఉపయోగం జరిగినప్పటికీ మహిళల సమాన హక్కులు అమలు కాలేదని అన్నారు. దేశంలో మహిళలపై అత్యాచారాలు పెరిగినాయని, నేరస్తులపై ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి కేసులు త్వరితగతిన పరిష్కరించాలని, కఠిన శిక్షలు అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య జాతీయ మహాసభలు డిసెంబర్ 6 7 8 తేదీలలో న్యూఢిల్లీలో జరుగుతున్న మహాసభలకు మహిళలు రక్షణ విద్య ఉద్యోగం ఉపాధి కల్పన సౌకర్యాలు గ్రామీణ నిరుపేద మహిళల కుటుంబాలకు సమగ్ర చట్టం పార్లమెంటులో తీసుకురావడానికి చర్చలు జరిపి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు. మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి సమాఖ్యను నిర్మాణం చేస్తామని అన్నారు. గ్రామ మండల జిల్లా రాష్ట్ర నిర్మాణ మహాసభల సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు ప్రసంగిస్తూ జిల్లాలోని మహిళా సమస్యలపై ప్రసంగించారు. మూసి ప్రక్షాళన పనులు ప్రారంభించాలని, జిల్లాలో కొత్త పరిశ్రమలు నెలకొల్పి మహిళలకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు మహిళా ఉద్యమం ముందుకు తీసుకు వెళ్లాలని అన్నారు. మహిళా సమాఖ్య నాయకులు వడ్లకొండ భారతమ్మ ఆరే పుష్ప మాటూరు జానమ్మ ముసుకుంట్ల నరసమ్మ టీ మాధవి ఉపేంద్ర లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదలను దోచుకునేలా పన్ను విధానం'

### కేంద్ర సర్కార్‌పై రాహుల్‌గాంధీ ఫైర్

**న్యూఢిల్లీ :** బిజెపి నేతృత్వంలోని కేంద్ర సర్కార్ పేదలను దోచుకునేలా పన్ను విధానాన్ని రూపొందించిందని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రధాని మోడీ సీప్లేన్‌లో సముద్రంలో ప్రయాణిస్తారని, కానీ పేదలు, మహిళలు అధిక ధరల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. జార్ఖండ్‌లో బగ్మారాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత్‌లో ప్రస్తుతం ఉన్న పన్నుల విధానం పేదలను దోచుకోవడం కోసమే. రూ.లక్ష కోట్ల విలువైన ధారవి భూమిని అదానీకి అప్పగిస్తున్నారు. దేశ జనాభాలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలు దాదాపు 90 శాతం ఉన్నారు. అయితే వారికి ప్రభుత్వ సంస్థల్లో ప్రాతినిధ్యం లేదు. ప్రధాని మోడీ పారిశ్రామికవేత్తలకు చేసిన రుణాల మాఫీని సమానమైన నిధులను పేదలకు అందజేస్తాం' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

## బాధితులకు ఆర్థిక సహాయం అందించడంలో

# కేరళకు 'కేంద్రం మొండిచేయి'

### చెలక్కర అసెంబ్లీ నియోజకవర్గం బహిరంగ సభలో కేరళ సిఎం పినరయి విజయన్ ధ్వజం

### ఇతర రాష్ట్రాలకు ప్రకృతి విపత్తు సహాయంలో త్వరగా స్పందించి కేరళపై సవతితల్లి ప్రేమ

**త్రిస్సూర్ (కేరళ) :** ప్రకృతి బీభత్సానికి భారీగా నష్టపోయిన వాయనాడ్‌కు కేంద్రం సహాయం అదించడంలో సవతితల్లి ప్రేమను ప్రదర్శిస్తోందని కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఆవేదన వ్యక్తంచేసింది. జులైలో కొండచరియలు విరిగిపడి నిర్వాసితులైన వారికి పునరావాసం కల్పించేందుకు తగిన సహాయం అం దించాలని కేంద్రాన్ని పదే పదే కోరినప్పటికీ ఇప్పటివరకూ ఒక్క పైసా విడుదల చేయలేదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆరోపించారు. శనివారం నాడు సిఎం పినరయి విజయన్ లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) అభ్యర్థి తరపున ప్రచారంలో భాగంగా చెలక్కర అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన బహిరంగసభలో ప్రసంగించారు. ప్రకృతి వైపరీత్యం సంభవించి నెలలు గడుస్తున్నదని, 200మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయి, వందలాది మంది ఇళ్లు నేలమట్టం అయ్యాయని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం కేరళ రాష్ట్రానికి సహాయం అందలేదని తెలిపారు. అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం సహా పదే పదే విజ్ఞప్తులు చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేకపోవడం దారుణం అన్నారు. 'ఇప్పటి వరకూ ఎలాంటి సహాయం లేదు. మా విజ్ఞప్తికి కేంద్రం ఇంకా లేదు అని చెప్పలేదు. అది ఒక మంచి విషయం' అని పినరయి విజయన్ ఎద్దేవా

చేశారు. ఇతర రాష్ట్రాలు ప్రకృతి విపత్తుల బారిన పడినప్పుడు ఆర్థిక సహాయం అందించే విషయంలో త్వరగాస్పందించే కేంద్ర ప్రభుత్వం కేరళ రాష్ట్రం విషయంలో ఎందుకు ఇలాంటి వైఖరి అవలంభిస్తున్నదో ఏ మాత్రం అర్థం కావడం లేదన్నారు. ఎందుకు కేరళ రాష్ట్రాన్ని పక్కన పెడుతున్నారు ? అని సిఎం పినరయి విజయన్ కేంద్రాన్ని అడిగారు. కేంద్ర ప్రభుత్వానిది ఈ విషయంలో 'క్రూరమైన నిర్లక్ష్యం'అని విజయన్ ఆరోపించారు. సిపిఐ(ఎం) సభ్యులు కె.రాధాకృష్ణమూర్తి అలథూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి విజయం సాధించడంతో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న చెలక్కర అసెంబ్లీ నియోజకవర్గానికిఉప ఎన్నిక అనివార్యం అయ్యింది. నవంబరు 13న చెలక్కర అసెంబ్లీ నియోజకవర్గానికి పోలింగ్ జరుగనున్నది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ శనివారం నాడు ఎల్‌డిఎఫ్ అభ్యర్థి తరపున ప్రచారకార్యక్రమంలో భాగంగా జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు.

## ఢిల్లీపై కాలుష్య 'పొగమంచు పొర'

### 'ఎక్యుఐ' 358గా నమోదై 'వెరీపూర్' కేటగిరీలోకి వాయునాణ్యత

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీని సోమవారం ఉదయం పొగమంచు పొర కమ్మివేసింది. ఉదయం 9గంటలకు సగటున వాయు నాణ్యత సూచిక (ఎక్యుఐ) 358గా నమోదు కావడంతో 'వెరీ పూర్ కేటగిరీ'కి వాయునాణ్యత చేరిందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సిపిసిబి) డేటా ఈ విషయాన్ని వెల్లడించింది. గంటగంటకూ వాయు నాణ్యత సూచిక ద్వారా సమాచారం అందించే సిపిసిబి సమీర్ యాప్ అప్‌డేట్ ప్రకారం బవానా, న్యూ మోతీ బాగ్ స్టేషన్లు రెండింటి వద్ద 409 ఎక్యుఐ నమోదై 'తీవ్రమైన కేటగిరీ'లో ఉన్నాయి. గత కొద్ది వారాలుగా దేశ రాజధాని ఢిల్లీలో అత్యధిక స్థాయిలో వాయు కాలుష్యం నమోదు అవుతోంది. కాయధాన్యం పంట కోసివేయగా మిగిలిన కాడల దుబ్బును సమీప రాష్ట్రాలలో తగులబెట్టడం, దీపావళి బాణసంచాలు కాల్చడం, గాలివేగం తగ్గిపోవడం ప్రాథమిక కారణాలుగా ఆరోపణలు ఉన్నాయి. ఢిల్లీలో శుక్రవారం ఉదయం ఎక్యుఐ 387రీడింగ్ వద్ద 'వెరీ పూర్ కేటగిరీ'లో నమోదైంది. సగటు నాణ్యత సూచిక ప్రకారం 050 నమోదైతే 'గుడ్' అని, 51100 నమోదు అయితే సంతృప్తికరం అని , 100200 నమోదు అయితే 'తీవ్రంకాని' అని, 201300 నమోదైతే 'పూర్' అని, 301400 నమోదు అయితే 'వెరీ పూర్' అని, 401500 ఉంటే 'తీవ్రమైన' అనే కేటగిరీలతో వర్గీకరించింది. అదే సమయంలో శనివారం నాడు ఢిల్లీలో 18.3సెల్సియస్ డిగ్రీల కనీస ఉష్ణోగ్రత నమోదైంది. సీజన్ సగటు కంటే నాలుగు గీతలకు పైగా నమోదు అయ్యి ఉంది. ఉదయం 830గంటల సమయానికి తేమ శాతం 98 వద్ద నిలిచిందని భారత వాతావరణ శాఖ తెలియజేసింది. ఆ రోజు గరిష్ట ఉష్ణోగ్రత దాదాపు 32డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుని ఎక్కువగా స్పష్టమైన వాతావరణం ఉంటుందని వాతావరణ కార్యాలయం అంచనావేసింది.

## ప్రధాన సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లిస్తున్న బిజెపి

**నాగ్‌పూర్ :** రెచ్చగొట్టే ప్రసంగాలు, అబద్ధాల ద్వారా ప్రధాన సమస్యల నుంచి ప్రజల దృష్టిని బిజెపి మళ్లిస్తోందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చేందుకు మంచి ప్రభుత్వం అవసరమని అన్నారు. శనివారం ఖర్గే నగ్‌పూర్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ) ఎన్నికల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. విదర్భకు చెందిన ఇద్దరు పెద్ద నాయకులు తమ సొంత పదవులను కాపాడుకోవడంపై ఆందోళన చెందుతూనే ఉంటారని ఆరోపించారు. అందుకే ప్రజల ప్రయోజనాలతో సంబంధం లేకుండా గుజరాత్‌కు వెళ్లిపోతున్న పెద్ద పెట్టుబడులను ఆపలేకపోయారని విమర్శించారు. గత 11 ఏళ్లలో బిజెపి ప్రభుత్వం ఏ పని చేసిందో చెప్పాలని, కాంగ్రెస్‌తో బిజెపి చర్చకు రావాలని డిమాండ్ చేశారు. 55 ఏళ్లలో తామేం చేసేమో చెబుతామని అన్నారు.

## ఎన్‌సిపి చీలికకు కారకుడైన ముండేను ఓడించాలి

### బీడ్ జిల్లా పార్టీ ఎన్నికలర్యాలీలో శరద్‌పవార్ పిలుపు

**ఛత్రపతి శంభాజీనగర్ / లాతూర్ :** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌పి) చీఫ్ శరద్ పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సన్నిహితుడైన మంత్రి ధనుంజయ్ ముండేపై ఆరోపణల దాడి చేశారు. ఎన్‌సిపిలో చీలిక వెనక ఉన్నవారిని తప్పనిసరిగా ఓడించాలని ఆయన ప్రజలను కోరారు. శనివారం బీడ్ జిల్లా పార్లీలో శరద్‌పవార్ ప్రసంగిస్తూ ప్రజలు బెదిరింపులకు గురవుతున్నారని , దీనిని ఆపాలని కోరారు. ధనుంజయ్ ముండేకు నేను ఏమి చేయాలో అది చేస్తా. కొంత మంది వ్యక్తులు ఎన్‌సిపి చీలికలో ముఖ్య పాత్ర పోషించారు. వారిని తప్పకుండా ఓడించాలి అని శరద్‌పవార్ ఆయన కొలీగ్ రాజేసాహెబ్ దేశ్‌ముఖ్ ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. 'ఒకానొక సమయంలో పండిట్ ముండే ఆయన కుమారుడు ధనుంజయ్ ముండేతో నావద్దకు వచ్చారు. వారు కష్టాలలో ఉన్నారని, నా నుంచి సహాయం కోరారు. ధనుంజయ్ ముండేను నేను ఎంఎల్‌సిగా చేశాను. శాసనమండలిలో ప్రతిపక్షనేతగా, రాష్ట్ర మంత్రిగా చేశాను. బీడ్‌లో ఆయనకు నేను నాయకత్వ స్థాయిని ఇచ్చాను. కానీ ఇక్కడి ప్రజలను ధనుంజయ్ ముండే చాలా కష్టాలకు గురిచేస్తున్నాడు. ప్రజలు ఆయనను అడ్డుకోవాలి. ఎన్నికలలో తప్పకుండా ఓడించాలి' అని శరద్ పవార్ పిలుపునిచ్చారు.పార్లీ మహారాష్ట్రకు విద్యుత్‌ను సరఫరా చేస్తోన్న ప్రాంతం అని, మహారాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతోందని, కానీ నేరాల పెరుగుదల ఎక్కువగా ఉన్నదని శరద్‌పవార్ చెప్పారు.'ఎన్‌సిపి (ఎస్‌పి) ఈ పరిస్థితిని మార్చివేస్తుంది. మున్ముందు బీడ్ జిల్లా అభివృద్ధి బాధ్యతను మేం తీసుకుంటాం. రైతుల సమస్యలు, నీటి కొరత, నిరుద్యోగిత సమస్యలను మేం పరిష్కరించాలనుకుంటున్నాం. రాజేసాహెబ్ దేశ్‌ముఖ్‌కు ఓట్లేసి గెలిపించాలి' అని శరద్‌పవార్ ఓటర్లను కోరారు. దీనికి ముందు శరద్‌పవార్ లాతూర్‌లోని ఉద్గిర్‌లో ప్రసంగించారు. మహాయుతి ప్రభుత్వంపై విమర్శల దాడి చేశారు. మహాయుతి ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తోందని, విద్యాధికులైన నిరుద్యోగులను బాధలకు గురిచేస్తోందని, మహాయుతి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చే హక్కును కోల్పోయిందని శరద్ పవార్ ధ్వజమెత్తారు.

## కులగణన, రిజర్వేషన్లపై సీలింగ్ ఎత్తివేత

### ఈ రెంటికీ మా ప్రాధాన్యం: జైరాంరమేష్

**న్యూఢిల్లీ :** జాతీయస్థాయి కుల గణనసర్వేపై శనివారం కాంగ్రెస్ తన అభిప్రాయాన్ని స్పష్టం చేసింది. కులగణన, రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ ఎత్తివేత రెండూ కాంగ్రెస్ ప్రాధాన్యత అంశాలని, ఈ రెండింటి అమలు ను ప్రధానంగా దేశ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ చేయనున్నదని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌ఛార్జి, కమ్యునికేషన్స్ జైరాంరమేష్ తెలిపారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభు త్వం శనివారం నుంచి ప్రారంభించనున్న కులగణన సర్వే గురించి ప్రధానంగా తన 'ఎక్స్' పోస్ట్ లో ప్రస్తావించారు. 80వేల మంది ఎన్యుమరేటర్లు కొద్ది వారాలలో ఇంటింటికీ తిరిగి తెలంగాణ రా ష్ట్రంలోని 33 జిల్లాలలో 1.17కోట్ల కుటుంబాలను కవరింగ్ చేయనున్నట్లు తెలియజేశారు. తెలంగాణలో ప్రభుత్వం కుల ఆధారిత సర్వే చేయడం 1930 సంవత్సరం నుంచి పరిశీలిస్తే ఇదే మొదటిసారి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఇది ఒక చరిత్రక, విప్లవాత్మక ఉద్య మం అని జైరాం రమేష్ ప్రస్తుతించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ము ఖ్య ఆశయాలు, ఆదర్శాలనుమాత్రమే కాకుండా, తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమాల ఆకాంక్షల ను కూడా దీనిద్వారా తెలంగాణ ప్రభు త్వం నెరవేర్చనున్నదన్నారు. ఈ వారం ప్రారంభంలో హైదరాబాద్‌లో రాహుల్‌గాంధీ ఇం డియా కూటమి ప్రభుత్వంలో చేపట్టనున్న జాతీ య స్థాయి కులగణన సర్వే బ్లూప్రింట్‌ను గురించి కూడా ఈ సందర్భంగా జైరాం రమేష్ నొక్కిచెప్పారు. సుప్రీంకోర్టు 50శాతం రిజర్వేషన్లను ఏకపక్షంగా ఎత్తివేస్తూ తీర్పును ఇచ్చినప్పటికీ దేశ భవిష్యత్తును ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తోందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, ఇతర బిసి వర్గాలకు దీనివల్ల న్యాయం జరుగనున్నదన్నారు. నవంబరు 5న తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన కుల గణన సర్వే సమావేశానికి కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ హాజరైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

## 'కోడలు' చాపపై పడుకోవడం,టివి చూడనీయకపోవడం క్రూరత్వం కాదు

**ముంబయి :** క్రూరత్వానికి పాల్పడిన కేసులో 20 ఏళ్ల శిక్షను ఎదుర్కొంటున్న కుటుంబానికి బాంబే హైకోర్టు ఊరటనిచ్చింది. క్రూరత్వం, ఆత్మహత్యకు ప్రేరేపించిన వ్యక్తిని, అతడి కుటుంబాన్ని నిర్దోషిగా ప్రకటిస్తూ బాంబే హైకోర్టు ఔరంగబాద్ బెంచ్ తీర్పు చెప్పింది. తన చనిపోయిన భార్య పట్ల క్రూరత్వానికి పాల్పడ్డాడని ఒక వ్యక్తి అభియోగాలు ఎదుర్కొన్నాడు. అతనితో పాటు అతడి కుటుంబంపై 20 ఏళ్ల శిక్ష పడింది. అయితే 498ఎ కింద నిందలువేయడం, పరిమితులు విధించడం తీవ్రమైన క్రూరత్వం కాదని కోర్టు తీర్పు చెబుతూ శిక్షని రద్దు చేసింది. భార్యని అవహేళనర చేయడం, టివి చూడనివ్వకపోవడం, ఒంటరిగా ఆలయాన్ని సందర్శించకుండా చేయడం, చాపపై పడుకునేలా చేయడం వంటి ఆరోపణలు భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 498ఎ ప్రకారం తీవ్రమైన చర్యలు కాదని కోర్టు గుర్తించింది. క్రూరత్వం, ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు సెక్షన్లు 498ఎ, 306 కింద దిగువ కోర్టు మరణించిన మహిళ భర్తని అతడి తల్లిదండ్రుల్ని, సోదరుడిని దోషులుగా నిర్ధారించింది. ఈ కేసును విచారించిన హైకోర్టు వీరిని నిర్దోషులుగా ప్రకటించింది. అక్టోబర్ 17న జస్టిస్ అభయ్ ఎస్ వాఘ్వాసే ఈ కేసును విచారించారు. మహిళ తయారు చేసిన భోజనం గురించి అవహేళన చేయడం, ఆమె టీవీని చూడటాన్ని పరిమితం చేయడం, పొరుగింటికి వెళ్లడాన్ని, ఒంటరిగా ఆలయానికి వెళ్లడాన్ని నిషేధించడం, ఆమె కార్పెట్‌పై పడుకునేలా చేయడం వంటివి ఆరోపణలుగా ఉన్నాయి. మరణించిన మహిళ కుటుంబం ఈ ఆరోపణల్ని చేసింది. ఇదే కాకుండా సదరు మహిళని అర్ధరాత్రి నీటిని పట్టాలని వేధించారని ఆరోపించింది. అయితే, కోర్టు విచారణలో మహిళ, ఆమె అత్తమామలు నివసించే ఏరియాలో తెల్లవారుజామున 1.30 గంటలకు నీటి సరఫరా జరుగుతుందని సాక్ష్యులు వెల్లడించారని కోర్టు గుర్తించింది.

## ప్రతీ హామీ నెరవేరుస్తాం

### హోషియార్‌పూర్ ఎన్నికల ర్యాలీలో అరవింద్ కేజ్రీవాల్

**చబ్బెవాల్ (పంజాబ్) :** చబ్బెవాల్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అభ్యర్థి ఇషాంక్‌కు ఓట్లేసి గెలిపించాలని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పిలుపునిచ్చారు. ఆయన శనివారం నాడు హోషియార్ పూర్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగించారు. ఆప్ అభ్యర్థిని చబ్బెవాల్ అసెంబ్లీ నుంచి గెలిపిస్తే ప్రజలు నియోజకవర్గం అభివృద్ధికి కోరుకునే ప్రతిదీ నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగ్‌వంత్ మాన్‌తో కలిసి అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల ప్రచార సభలలో పాల్గొన్నారు. గిద్దెర్‌బాహ, డేరా బాబా నానక్, చబ్బెవాలా, బర్నాలా అసెంబ్లీ స్థానాలకు నవంబరు 20వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి. నవంబరు 23న ఓట్ల లెక్కింపు జరుగనున్నది. 'మేం మీ కోసం చాలా పనిచేశాం' అని కేజ్రీవాల్ ఎన్నికల ర్యాలీని ఉద్దేశించి మాట్లాడారు. ఇషాంక్ గతంలో ఓ తప్పుడు పార్లీ ఉన్నాడని, ఇప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీలోకి చేరారని కేజ్రీవాల్ గుర్తుచేశారు. 'నాకు ఊపిరి ఆడని ఫీలింగ్ ఉన్నది. కాంగ్రెస్‌తో నేను ఉన్నప్పుడు ఆయన ఏ పనికూడా చేయలేకపోయారు. ప్రస్తుతం ఆయన ఇప్పుడు సరైన స్థానంలోనే ఉన్నారు అని హోషియార్‌పూర్ ఎంపి డాక్టర్ రాజ్‌కుమార్ చబ్బెవాల్ గురించి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. హోషియార్ పూర్ లోక్‌సభ నియోజకవర్గంలో ఎంపిగా డాక్టర్ రాజ్‌కుమార్ చబ్బెవాల్ పనితీరును కేజ్రీవాల్ ఈ సందర్భంగా ప్రశంసించారు. ప్రజలకు ఉచిత వైద్యం అందించారని, ఇప్పుడు ఆయన కుమారుడి గెలుపుకోసం ఓట్లను అడుగుతున్నారని కేజ్రీవాల్ ప్రజలకు వివరించారు.

## జార్ఖండ్ సిఎం సహాయకుడి ఇంట్లో ఐటి సోదాలు

**రాంచి :** జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తోన్న తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పలు చోట్ల ఆదాపుపన్ను విభాగం సోదాలు నిర్వహించింది. ముఖ్యమంత్రి, జెఎంఎం నేత హేమంత్ సోరెన్ సహాయకుడు సునీల్ శ్రీవాత్సవ ఇంట్లో ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు చేసినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. రాంచీ, జంషెడ్‌పుర్‌లలో ఈ తనిఖీలు కొనసాగాయి. మొత్తంగా 9 ప్రాంతాల్లో ఈ సోదాలు జరుగుతున్నట్లు వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో మైనింగ్, అక్రమ మద్యం వ్యాపారం జరుగుతున్నట్లు ఆరోపణల నేపథ్యంలో ఇడి, సిబిఐ దర్యాప్తు ప్రారంభించింది. ఈ నెల 13, 20వ తేదీల్లో రెండు దశల్లో జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దాంతో జెఎంఎం, కాంగ్రెస్, ఆర్‌జెడి కూటమికి.. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకు మధ్య రాజకీయంగా వాడీవేడీ వాతావరణం నెలకొంది. ఈ తరుణంలో సిఎం సన్నిహితుడి ఇంట్లో సోదాలు జరగడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే.. భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కొద్దినెలల క్రితం సోరెన్ జైలు జీవితం గడిపిన సంగతి తెలిసిందే. జైలుకు వెళ్లడానికి ముందు ఆయన సిఎం పదవికి రాజీనామా చేశారు. బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత మళ్లీ ఆ బాధ్యతలు స్వీకరించారు. మరోసారి అధికారాన్ని దక్కించుకునేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

## పట్టాలు తప్పిన సికింద్రాబాద్– షాలీమార్ ఎక్స్‌ప్రెస్

**న్యూఢిల్లీ :** గతంలో ఎన్నడూ లేని విధంగా ఇటీవల రైలు ప్రమాదాలు విపరీతంగా పెరిగిపోయాయి. ఎప్పుడు ఏ రైలు పట్టాలు తప్పుతుందో.. ఏ ట్రైన్‌లో మంటలు వస్తాయో అర్థంకావడం లేదు. తాజాగా, పశ్చిమ బెంగాల్‌లోని నల్పూల్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ప్రమాదం తప్పింది. నల్పూర్‌లోని హౌరా జిల్లాకు 20 కిలోమీటర్ల దూరంలో సిక్రింద్రాబాద్– శాలీమార్ ఎక్స్‌ప్రెస్ రైలుకు పెను ప్రమాదం తప్పింది. పశ్చిమ బెంగాల్‌లోని నల్పూల్ రైల్వే స్టేషన్‌లో సమీపంలో ఉదయం 5.31 గంటలకు ఈ ట్రైన్‌కు చెందిన మూడు బోగీలు పట్టాలు తప్పాయి. వెంటనే సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది హుటాహుటినా సంఘటన స్థలంకు చేరుకుని ప్రయాణికులను సమీప స్టేషన్‌కు తరలించారు. అయితే, ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. రైల్వే అధికారులు, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన రైల్వే ట్రాక్ మరమ్మతులు వేగవంతం చేపట్టారు. ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పడంతో ఈ మార్గంలో ట్రైన్ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే, ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగపోవడంతో ప్రయాణికులతోపాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పడానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ రైలు ప్రమాదంపై సౌత్ ఈస్టర్న్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఓం ప్రకాష్ చరణ్ స్పందించారు. పశ్చిమ బెంగాల్ లోని నల్పూర్ స్టేషన్ సమీపంలో 22850 సికింద్రాబాద్ శాలీమార్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పినట్లు వెల్లడించారు. మిడిల్ లైన్ నుంచి డౌన్ లైన్‌కు మారుతున్న సమయంలో ఒక పార్సిల్ వ్యాన్, రెండు ప్యాసింజర్ కోచ్‌లు పట్టాలు తప్పాయని తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని స్పష్టం చేశారు. ప్రయాణికులందరూ సేఫ్‌గా ఉన్నారని అన్నారు. ప్రయాణికులను సమీప స్టేషన్‌కు తరలించేందుకు 10 బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. రెండు ప్రయాణికుల బోగీలు, మరో పార్సిల్ వ్యాన్ పట్టాలు తప్పినట్లు తెలిపారు. ట్రాక్ పునరుద్ధరించే పనిలో రైల్వే సిబ్బంది నిమగ్నమైనట్లు చరణ్ అన్నారు. త్వరగా ట్రాక్ లను క్లియర్ చేసి సాధారణ సర్వీసులను పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. అంతేకాకుండాఅంతేకాకుండా రైలు పట్టాలు తప్పడానికి గల కారణాలపై దర్యాప్తునకు ఆదేశించినట్లు తెలిపారు.

## మస్క్, ట్రంప్–జెలెన్‌స్కీ మధ్య సంభాషణ

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడుగా గెలిచిన మరునాడు డోనాల్డ్ ట్రంప్, ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, వార్తల్లో వ్యక్తిగా రికార్డు సృష్టించిన వ్యాపారవేత్త ఎలాన్‌మస్క్ మధ్య ఏడు నిమిషాలసేపు ఫోన్ సంభాషణ జరిగిందని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఐతే ఈ ముగ్గురూ విధానపరమైన చర్చలేమీ ఈ సంభాషణలో చేయలేదు. 2022 నుండీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌లో నిత్య సంబంధాలు కొనసాగిస్తున్నాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎలాన్ మస్క్ ఈసారి జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికలలో ప్రముఖ వ్యక్తిగా దేశంలో తెరమీదకు వచ్చారు. రాబోయేకాలంలో ట్రంప్ ప్రభుత్వంలో, ప్రభుత్వంద్వారా చాలా ప్రాముఖ్యతగల ప్రయోజనాలు ఆయన పొందుతారని వార్తలు వినిపిస్తున్నవేళ ఈ ఫోన్ సంభాషణకు కూడా ఎంతో ప్రాధాన్యత వచ్చింది. మొదట ట్రంప్–జెలెన్‌స్కీ మధ్య ఫోన్ సంభాషణ జరిగింది. ట్రంప్ విజయం సాధించినందుకు జెలెన్‌స్కీ ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఆ తర్వాత ట్రంప్ స్పీకర్ ఆన్‌చేసి ఎలాన్‌మస్క్‌ను లైనులోకి తీసుకువచ్చారు. దీంతో ట్రంప్‌తోపాటు జెలెన్‌స్కీకి ఎలాన్‌మస్క్‌కు మధ్య ఏడు నిమిషాలసేపు సంభాషణ కొనసాగింది. ఉక్రేన్‌వ్యాప్తంగా స్టార్ లింక్ ద్వారా సేవలు అందిస్తున్నందుకు మస్క్‌కు జెలెన్‌స్కీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. తూర్పు డాన్‌బోస్ ప్రాంతంలో పుతిన్ సైన్యాలు ముందుకు వెళుతూ ప్రయోజనం పొందిన తరుణంలో ఈ ముగ్గురుమధ్యా ఈ సంభాషణ జరిగింది. ట్రంప్ ఎన్నికల ప్రచారం ద్వారా ఆయన గెలిస్తే జెలెన్‌స్కీకి భవిష్యత్‌లో తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందన్న సంకేతాలు వచ్చాయి. ట్రంప్ గెలిచాక జెలెన్‌స్కీ తన పరిస్థితిని మెరుగుపరచుకునేందుకు ట్రంప్‌తో సంబంధాలు వృద్ధిచేసుకోవాలని ఆశిస్తున్నారు. ఇందులో భాగంగా గడచిన బుధవారంనాడు ఎక్స్ వేదికగా జెలెన్‌స్కీ ఒక పోస్టింగ్ పెడుతూ తాను ట్రంప్‌కు అభినందనలు తెలియజేశానన్నారు. ఐతే ఆయన ఎలాన్‌మస్క్ ప్రస్తావన తేలేదు.

**ఉక్రేన్‌పై రష్యా దాడులు**

ఉక్రేన్‌లో శనివారంనాడు రష్యా చేసిన డ్రోన్ దాడుల్లో ఒకరు మరణించారు. మరో 13 మంది గాయపడ్డారు. ఉక్రేన్ నల్లసముద్ర ఓడరేవు ప్రాంతం ఒడెసాలో శనివారం తెల్లవారుజాము లోపే రష్యా డ్రోన్లు దాడులు చేశాయి. గాయపడినవారిలో ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారని ఉక్రేన్ రీజినల్ గవర్నర్ ఓలెహ్ కిపెర్ చెప్పారు. అనేక అపార్ట్‌మెంట్లు, ప్రైవేటు ఇళ్ళు, కమర్షియల్ బిల్డింగులు, డజన్ల సంఖ్యలో ప్రైవేటు కార్లు డ్రోన్ దాడుల్లో ధ్వంసమయ్యాయి.

## రైలు ఇంజిన్–బోగీల మధ్య ఇరుక్కుపోయి ఉద్యోగి మృతి

**పాట్నా:** బీహార్‌లోని బెగుసరాయ్‌లోని బరౌని రైల్వే జంక్షన్‌లో దారుణం ఘటన చోటుచేసుకుంది. రైలు ఇంజిన్‌బోగీల మధ్య ఇరుక్కుపోయి ఓ ఉద్యోగి మృతి చెందాడు. శనివారం జరిగిన షంటింగ్ ఆపరేషన్‌లో రైల్వే పోర్టర్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సోన్‌పూర్ రైల్వే డివిజన్ పరిధిలోని స్టేషన్‌లో పనిచేస్తున్న పోర్టర్ అమర్‌కుమార్‌రావుగా గుర్తించారు. లక్నోబరౌనీ ఎక్స్‌ప్రెస్ లక్నో జంక్షన్ నుంచి

## ఎలాన్ మస్క్ కొత్త అవతారం!

ప్రపంచ కుబేరుడు, వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ జ్యోతిష్కుడిగా కొత్త అవతారం ఎత్తాడు. త్వరలోనే చంద్రమండలంపై నివాసం సాధ్యమని అంటున్నాడు. అంగారక గ్రహంపైకి మనుషులను పంపే ప్రయత్నాలు చేస్తున్నాడు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంలో మస్క్ అత్యంత కీలక భూమిక పోషించిన విషయం బహిరంగ రహస్యం. ట్రంప్ సైతం తన విక్టరీ స్పీచ్‌లో ఇదే అంశాన్ని ప్రస్తావించడం గమనార్హం. ట్రంప్‌ను అధ్యక్ష భవనం వైట్‌హౌస్ చేరుకోకుండా ఎవరూ అడ్డుకోలేని ఎన్నికలకు ముందు సవాలు చేసిన మస్క్ ఇప్పుడు కెనడా గురించి కూడా బలమైన అంచనాలతో ఉన్నాడు. కెనడా ప్రస్తుత ప్రధాని జస్టిన్ ట్రూడో రాబోయే ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమంటూ జ్యోతిషం చెప్పాడు. వచ్చే ఏడాది అక్టోబర్‌లో కెనడా పార్లమెంటు ఎన్నికలు జరగున్నాయి. జర్మనీ సంకీర్ణ ప్రభుత్వం కుప్పకూలుతుందని మస్క్ చెప్పడం, అతను అన్న విధంగానే ఒలాఫ్ షుల్జ్ సర్కారు అధికారాన్ని కోల్పోవడం జరిగిపోయాయి. దీనితో మస్క్ జ్యోతిషంపై ప్రజల్లో నమ్మకం పెరుగుతున్నది. కెనడాలో సిక్కు వేర్పాటువాదులకు కొమ్ముకాస్తున్న కారణంగా ట్రూడో తన పదవిని కోల్పోక తప్పదన్నది 'ఎక్స్' వేదికగా మస్క్ పెట్టిన పోస్టు ఇప్పుడు సంచలనం రేపుతోంది. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ట్రూడో అనేకానేక సందర్భాల్లో విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. నిజ్జర్ హత్య నుంచి నిఘా వ్యవస్థలను పురికొల్పడం వరకూ తమ దేశంలో భారత్ అనేక రకాలుగా తమ ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నదని ట్రూడో ఆరోపణ. భారత్ ప్రతిసారీ కెనడా చేస్తున్న ఆరోపణలను ఖండిస్తునే ఉంది. కాగా, సిక్కు వేర్పాటువాదుల పక్షాన మాట్లాడుతూ, వారి చర్యలకు మద్దతు పలకడం అత్యంత ప్రమాదకరమని మస్క్ హెచ్చరించాడు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న ట్రూడోకు ఓటమి తప్పదని అన్నాడు. అతని జోస్యం ఫలిస్తుందా? లేదా? అనేది తేలాలంటే, ఓ ఏడాదిపాటు వేచిచూడక తప్పదు.

## లండన్‌లో మంకీపాక్స్ ప్రత్యక్షం

సుమారు రెండేళ్లపాటు యావత్ ప్రపంచాన్ని వణించిక కరోనా మహమ్మారి నుంచి బయటపడ్డామన్న ఆనందం మానవాళికి ఎక్కువ కాలం నిలవలేదు. వివిధ రకాల వైరస్‌లు ప్రపంచాన్ని చుట్టుముట్టి వేధిస్తున్నాయి. వాటిలో మంకీపాక్స్ ఒకటి. ఈ వ్యాధి కొత్త వైరస్ ఒకటి ఇటీవల లండన్‌లో ప్రత్యక్షం కావడం యునైటెడ్ కింగ్‌డమ్‌తోపాటు యావత్ ఐరోపాను భయాందోళనలకు గురి చేస్తున్నది. ఒక వైరస్‌ను సమర్థంగా నియంత్రించామని అనుకునేలోపే, అదే వైరస్ రూపుమార్చుకొని, కొత్తకొత్త వేరియంట్స్‌గా మళ్లీమళ్లీ దాడులు చేస్తున్నాయి. సూక్ష్మంగా 'ఎంపాక్స్' అని పిలిచే మంకీపాక్స్ ఆఫ్రికా దేశాలను హడలెత్తించింది. అత్యంత ప్రమాదకరమైన వైరస్‌లలో ఒకటైన ఎంపాక్స్ మరోసారి కొత్త వేరియంట్‌తో విరుచుకుపడడం పట్ల అంతర్జాతీయంగా ఆందోళన వ్యక్తమవుతున్నది. కొత్త వేరియంట్‌కు సంబంధించి నాలుగు కేసులను గుర్తించినట్టు బ్రిటిష్ ఆరోగ్య శాఖ ప్రకటించింది. అన్ని ఆసుపత్రులు, కమ్యూనిటీ సెంటర్లను అప్రమత్తం చేసినట్టు తెలిపింది. ఎంపాక్స్ ఒరిజినల్ వైరస్‌తో పోలిస్తే కొత్త వేరియంట్ అంత ప్రమాదకరం కాకపోయినప్పటికీ, వేగంగా వ్యాపించే గుణం ఉండడం వైద్య నిపుణుల ఆందోళనకు కారణం. ఈ వ్యాధిని నిర్ధారించిన రోగుల కుటుంబీకులతోపాటు, వారికి పరిచయం ఉన్న కుటుంబాలలోనూ ఈ వైరస్ వ్యాపించి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే, బ్రిటిష్ ప్రభుత్వం నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నది. ఈ వ్యాధి లక్షణాలను ప్రారంభంలో గుర్తించడం కష్టం కాబట్టి, అది సోకిన వారు ఎలాంటి అనుమానాలుగానీ, జంకుగానీ లేకుండా తమతమ పనులు నిర్వర్తించుకుంటూ ఉంటారు. అందుకే, ఇది త్వరగా విస్తరిస్తున్నది. కాంగోలో తొలుత గురించిన ఎంపాక్స్ ఆ తర్వాత వేగంగా ప్రపంచంలోని అనేక దేశాలకు చేరింది.

## ఇద్దరు మహిళా అభ్యర్థులు... ఒక ట్రంప్!

అమెరికా అధ్యక్షుడిగా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విజయం అనూహ్యమేమీ కాదు. విలక్షణమైనదిగా చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. గత ఎన్నికల్లో (2000) డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ చేతిలో పరాజయం ఎదుర్కొన్న ట్రంప్, ఈసారి అదే పార్టీ తరఫున బరిలోకి దిగిన కమలా హారిస్‌ను ఓడించి, రెండోసారి వైట్‌హౌస్‌లోకి అడుగుపెట్టడానికి సిద్ధమయ్యారు. తొలుత 2016లో పోటీ చేసినప్పుడు ఆయన ప్రత్యర్థి ఓ మహిళకావడం విశేషం. అమెరికా తొలి మహిళా ప్రెసిడెంట్‌గా రికార్డు నెలకొల్పే అవకాశం ఉందని భావించిన హిల్లరీ క్లింటన్‌ను ట్రంప్ ఓడించారు. ఆతర్వాత జరిగిన ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. ఈసారి మళ్లీ మహిళా అభ్యర్థే ఆయనకు ఎదురుకావడం గమనార్హం. ఈసారి కమలా హారిస్‌పై ఆయన పైచేయి సాధించారు. ఈ విధంగా రెండు పర్యాయాలు మహిళా అభ్యర్థులను ఓడించి చరిత్ర సృష్టించారు. అధికారంలో ఉండి, తదుపరి ఎన్నికల్లో ఓడినప్పటికీ, తిరిగి పుంజుకొని గెలిచిన రెండో అమెరికా అధ్యక్షుడిగా కూడా ట్రంప్ పేరు రికార్డు పుస్తకాల్లో చేరింది.

## కాలుష్యానికి పరాకాష్ట

ఇటీవల సిడ్నీ బీచ్‌లలోకి కొన్ని వేల సంఖ్యలో కనిపించిన నల్లని బంతులు కొట్టుకురావడం చర్చనీయాంశమైంది. తొలుత వీటిని డాంబర్(తారు) గోళాలుగా భావించారు. కానీ, వీటిని పరీక్షించిన యూనివర్శిటీ ఆఫ్ న్యూ సౌత్‌వేల్స్ (యుఎన్‌ఎస్‌డబ్ల్యు) శాస్త్రవేత్తలు విస్తుబోయే నిజాన్ని వెల్లడించారు. వీటిని ఫ్యాట్‌బర్గ్స్‌గా వారు నిర్ధారించారు. మానవ జట్టు, కొవ్వు, ఆమ్లాలు, ఆహార వ్యర్థాలతో ఇవి ఏర్పడతాయని ప్రకటించారు. మెథాంపేటమిన్‌ను కలిగి ఉన్న ఈ ఫ్యాట్‌బర్గ్స్ పెరుగుతున్న కాలుష్యానికి పరాకాష్టగా పేర్కొన్నారు. మనిషి ఉద్దేశపూర్వకంగా చేస్తున్న అకృత్యాలకు నిదర్శనంగా ఫ్యాట్‌బర్గ్స్‌ను అభివర్ణించారు. అత్యంత దుర్వాసనతో కూడిన ఈ ఫ్యాట్‌బర్గ్స్ పట్ల న్యూ సౌత్‌వేల్స్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అథారిటీ (ఇపిఎ) హెచ్చరికలు జారీ చేసింది. అవి ఏమిటో కనుగొనాలన్న ఉత్సాహంతో పరీక్షించవద్దని స్పష్టం చేసింది. సిడ్నీ తీరప్రాంతంలో విపరీతంగా పెరిగిన కాలుష్య సమస్యను ఈ ఘటన తెరపైకి తెచ్చింది. నిజానికి సముద్రంలో చమురు చిందడం వల్ల ఈ బంతులు ఏర్పడ్డాయని ప్రాథమిక పరీక్షలో శాస్త్రవేత్తలు తేల్చారు. అయితే, తదుపరి పరీక్ష మరింత సంక్లిష్టమైన, అసహ్యకరమైన వాస్తవాన్ని బయటపెట్టింది. మానవ వ్యర్థాలే నల్లటి గోళాకృతులను సంతరించుకున్నాయని పేర్కొన్నారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని బర్మింహామ్‌లో, అధికారులు 2021లో 330 టన్నుల ఫ్యాట్‌బర్గ్స్‌ను తొలగించారు. వీటిలో మానవ వ్యర్థాలతోపాటు మాదక ద్రవ్యాల ఆనవాళ్లు కూడా ఉండడం శాస్త్రవేత్తలను మరింత ఆందోళనకు గురి చేస్తున్నది.

## ఉన్నత విద్యకు చేయూత

దేశంలో ఉన్నత విద్యను అభ్యసించేవారికి చేయూతనిచ్చే పిఎం విద్యాలక్ష్మి పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేయడం శుభసూచకం. ప్రతిభాపాటవాలు ఉన్నప్పటికీ, ఆర్థికపరమైన సమస్యలతో ఉన్నత విద్యకు దూరమవుతున్న విద్యార్థులకు ఇది మంచి అవకాశం. జాతీయ విద్యా విధానం (ఎన్‌పిసి)2020లో భాగంగా ఈ పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని విస్తరించాలని సిఫార్సు చేసింది. ఈ పథకం దేశంలోని 860 అగ్రశ్రేణి ఉన్నత విద్యాసంస్థలలో ప్రవేశం పొందిన విద్యార్థులు, చదువుకు అవసరమైన విద్యా రుణాలను పొందే అవకాశాన్ని కూడా కల్పిస్తుంది. లబ్ధిదారులకు రూ. 7.5 లక్షల వరకూ రుణసాయం అందుకుతుంది. అందులో విద్యార్థి 75 శాతం క్రెడిట్ గ్యారంటీని పొందుతాడు. విద్యార్థులకు విద్యారుణాలు అందించేందుకు బ్యాంకులు ముందుకొస్తాయి. జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ద్వారా నిర్ణయించిన ర్యాంకుల ఆధారంగా దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశం లభిస్తుంది. ప్రధాన మంత్రి ఉచ్చెతర్ శిక్షా ప్రోత్సాహన్ (పిఎంయుఎస్‌పి) ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత విద్య చదువుకోవడానికి స్కాలర్‌షిప్ అందిస్తుంది. ఆర్థిఖ పరిమితులు లేకుండా నాణ్యమైన విద్యను పొందడంలో వారికి సహాయపడుతుంది. పిఎంయుఎస్‌పి ఉన్నత విద్యలో సమానత్వాన్ని ప్రోత్సహిస్తూ, షెడ్యూల్ కులాలు (ఎస్‌సి), షెడ్యూల్ జాతులు (ఎస్‌టి), ఇతర వెనుకబడి తరగతులు (ఒబిసి)సహా అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులకు ఈ పథకం ప్రాధాన్యతనిస్తుంది.

**బిఎస్ఎస్ మైత్రేయి**

# అలీగఢ్‌పై తీర్పు చరిత్రాత్మకం

ప్రతిష్టాత్మకమైన అలీగఢ్ ముస్లిం యూనివర్శిటీకి మైనారిటీ ప్రతిపత్తి ఉన్నట్టా, లేనట్టా? ఉన్నట్టేనని రాజ్యాంగ ధర్మాసనం తాజాగా చెప్పింది. రాజ్యాంగం అమలులోకి వచ్చాక పార్లమెంటు శాసనం ద్వారా అది కేంద్ర యూనివర్శిటీగా ప్రకటించబడినందున దానికి మైనారిటీ ప్రతిపత్తి పొందే అర్హత లేదని 1967లో అజీజ్ భాషా కేసులో ఐదుగురు జడ్జీల రాజ్యాంగ బెంచి తీర్పు చెప్పింది. ప్రధాన న్యాయమూర్తి డివై. చంద్రచూడ్ చివరి పనిదినం (శుక్రవారం) నాడు ఏడుగురు జడ్జీల బెంచి 4–3తో ఇచ్చిన మెజారిటీ తీర్పు – మైనారిటీ సముదాయం ఏర్పాటు చేసిన విద్యాసంస్థకు చట్టం ద్వారా గుర్తింపు ఇచ్చినప్పటికీ అది దాని ప్రతిపత్తిని కోల్పోదని అభిప్రాయపడింది. అయితే ఈ కేసు ద్విసభ్య ధర్మాసనం నుండి ఏడుగురు జడ్జీల ధర్మాసనం నిర్ణయం కోసం నివేదించబడినందున తుది నిర్ణయం కోసం దాన్ని రెగ్యులర్ బెంచికి తిప్పిపంపుతూ, విద్యాలయ ప్రతిపత్తి నిర్ణయించటానికి కచ్చితంగా పాటించాల్సిన సూత్రాలను నిర్దేశించింది.

ఈ ధర్మాసనం తీర్పును అలీగఢ్ ముస్లిం యూనివర్శిటీ అధ్యాపకులు, విద్యార్థులు స్వాగతించారు, మిఠాయిలు పంచుకున్నారు. 1967 తీర్పును తోసిపుచ్చటం మైనారిటీ ప్రతిపత్తి పునరుద్ధరణను కోరే అవకాశం యూనివర్శిటీకి ఇచ్చింది. వైస్ ఛాన్సలర్ నియమా ఖటూన్ తీర్పును 'నమ్రతతో' స్వాగతిస్తూ, తమ న్యాయ నిపుణులతో వివరాలు చర్చిస్తున్నామన్నారు. సుప్రసిద్ధ విద్యాసంస్థ స్థాయిని నిలుపుకునేందుకు కష్టపడి పనిచేయటం కొనసాగిస్తామన్నారు. మైనారిటీ ప్రతిపత్తి మంజూరుకోసం సుప్రీంకోర్టు నిర్దేశించిన సాక్ష్యాధారాల పత్రాలన్నీ ఉండే ఉంటాయని మాజీ విసి ప్రొఫెసర్ మహమ్మద్ గుల్‌రెజ్ అన్నారు.

విద్యాసంస్థలు స్థాపించేందుకు, నడిపేందుకు మత, భాషా మైనారిటీలకు హక్కు ఇచ్చిన రాజ్యాంగం అధికారణ 30(1) రాజ్యాంగం అమలులోకి రాకపూర్వం నెలకొల్పిన విద్యాసంస్థలకు కూడా వర్తిస్తుందన్న ధర్మాసనం అభిప్రాయం ఒక ఎఎంయుకే కాదు మైనారిటీ విద్యాసంస్థలన్నిటికీ వర్తిస్తుంది, మేలు చేస్తుంది. అందువల్ల ఇది చరిత్రాత్మకం. ముస్లిం మైనారిటీల చరిత్ర, సంస్కృతిని రూపుమాపటానికి బిజెపి, ఆర్ఎస్ఎస్ ఇతర హిందూత్వవాదులు, వారి తరఫున కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఈ తీర్పు ప్రత్యేక ప్రాముఖ్యత సంతరించుకుంది. ఎఎంయుతోపాటు జమియా మిలియా యూనివర్శిటీపై హిందూత్వ శక్తులు దాడి చేస్తున్నాయి. జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వం వహించిన ఈ బెంచిలోని ఇతర సభ్యులు జస్టిస్‌లు సంజీవ్ ఖన్నా, జెబి పార్దీవాలా, మనోజ్ మిశ్రా ఆయనతో ఏకీభవించగా, జస్టిస్‌లు సూర్యకాంత్, దీపాంకర్ దత్తా, ఎస్‌సి శర్మ వేర్వేరుగా భిన్నాభిప్రాయాలు రాశారు.

ఎఎంయు మైనారిటీ ప్రతిపత్తి నిర్ణయించేందుకు రాజ్యాంగ ధర్మాసనం నిర్దేశించిన మార్గదర్శకాలు సుస్పష్టంగా ఉన్నాయి : 1)విద్యా సంస్థ పుట్టుపూర్వోత్తరాలు పరిశీలించండి. విద్యాసంస్థ ఏర్పాటు ఆలోచన వెనుక ఉన్న బుర్ర ఎవరిదో గుర్తించండి. 2) దాన్ని ఏ ప్రయోజనం కోసం నెలకొల్పారో నిర్ధారించండి. మత లేదా భాషా మైనారిటీ మేలు దాని అత్యంత ప్రధాన ఆశయంగా ఉండాలి.3) ఈ భావాన్ని అమలు పెట్టటానికి తీసుకున్న చర్యలను కనుగొనండి – దానికి నిధులిచ్చిందెవరు, భూమి వగైరా సంపాదించటానికి ప్రయత్నించిందెవరు? వగైరా తెలుసుకోండి.4) సంస్థను నెలకొల్పేందుకు – అనుమతులు పొందటం, నిర్మాణాలు చేబట్టటం, ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేయటం వంటివి చేసిందెవరో కనుగొనండి.

ఇవి ఏ విద్యాసంస్థ ప్రతిపత్తి నిర్ధారణకైనా గీటురాళ్లు అవుతాయి. ఎఎంయుకు మైనారిటీ ప్రతిపత్తి ఇస్తూ 1981లో చట్టానికి చేసిన సవరణ చెల్లుబాటును కొట్టివేస్తూ అలహాబాద్ హైకోర్టు 2006లో ఇచ్చిన తీర్పును కూడా తమ తీర్పులోని సూత్రాల ఆధారంగా పరిశీలించాల్సిందిగా రెగ్యులర్ బెంచిని ధర్మాసనం కోరింది.

అలీగఢ్ ముస్లిం యూనివర్శిటీ 1875లో నెలకొల్పబడింది. దానికున్న మైనారిటీ ప్రతిపత్తిని 1981లో ఎఎంయు చట్టం (సవరణ) ద్వారా పార్లమెంటు పునరుద్ధరించింది. అలహాబాద్ హైకోర్టు 2006 జనవరిలో ఆ సవరణ చెల్లదని కొట్టివేసింది. ఈ సమస్య 2019 లో ఏడుగురు జడ్జీల సుప్రీంకోర్టు బెంచికి నివేదించబడింది.

''ఆర్టికల్ 30(1) వివక్షకు వ్యతిరేకమైందీ, అదే సమయంలో మత, భాష మైనారిటీలకు 'ప్రత్యేక హక్కులు' ఇస్తున్నది. అందువల్ల విద్యాసంస్థలు నెలకొల్పే, నడిపేందుకు వారికిగల హక్కుకు వ్యతిరేకమైన శాసనం లేదా ఉత్తర్వు ఆర్టికల్ 30(1) కి విరుద్ధం. విద్యాసంస్థ నెలకొల్పిన భాష లేదా మత మైనారిటీకి అధిక స్వయం ప్రతిపత్తికి గ్యారంటీ ఉంటుంది. 'ప్రత్యేక హక్కులకు అర్థం ఇదే''నని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. ఆర్టికల్ 30సెక్యులర్ విద్యకు కూడా విస్తరిస్తుందన్నారు. ఈ వివాదం ఇంతటితో ఆగాలని, మైనారిటీ హక్కులు పునరుద్ధరించబడాలని ఆశించుదాం.

ప్రజాపక్షం
10-11-2024, ఆదివారం

# నరేంద్రమోదీ పరువు తీస్తున్న సోషల్ మీడియా భక్తులు!

ఎం. కోటేశ్వరరావు

ఫేక్ న్యూస్, కృత్రిమ మేధతో నకిలీ ఫొటోలతో సామాజిక మాధ్యమంలో జరిపే ప్రచారంలో మన దేశం ఎంతో ముందుంది. నకిలీ వార్తల ముప్పు ఎక్కువగా ఉన్న దేశాలలో మనం ప్రథమ స్థానంలో ఉన్నట్లు గతంలో ప్రపంచ ఆర్థికవేదిక నివేదిక హెచ్చరించింది. గడచిన పది సంవత్సరాల లో ఈ ప్రచారదాడికి గురికాని వాట్సాప్ ఉన్న ఫోన్ బాధితులు లేరం టే అతిశయోక్తి కాదు. అది నరేంద్రమోదీ, జవహర్ లాల్ నెహ్రూ, మహాత్మాగాంధీ, మతం, విద్వేషం, తప్పుడు సమాచారం, వక్రీకరణ ఇలా పలు రూపాల్లో ఉంటుంది. ఈ వార్త ఏ ప్రధాన పత్రికల్లో, టీవీ ల్లో రాదు అంటూ తప్పుడు సమాచారాన్ని వాట్సాప్‌లో ఉచితంగా అందించే సామాజికసేవకులను మనం చూస్తున్నాం. అలాంటిదే ఇప్పుడు ఒక ఫొటో, దాని కింద సమాచారం ఒకటి తిరుగుతోంది.

భారత్–చైనా సైనికులు నాలుగేళ్లక్రితం ఎక్కడైతే ఘర్షణ పడ్డారో అక్కడే తొలిసారిగా దీపావళి రోజు పరస్పరం మిఠాయిలు పంచుకున్నారు. ఇలాంటి దృశ్యం మరోసారి చూడాలని కోరుకుంటున్నవారికి సంతోషం, ఘర్షణ కొనసాగాలని చూసిన వారికి విషాదం కలిగించింది. సంవత్సరాల పాటు సాగిన చర్చల అనంతరం అక్టోబరు మూడవ వారంలో ఉభయ దేశాల ప్రతినిధులు సరిహద్దుల్లో ఉద్రిక్తతలను సడలించి సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు ఒక ఒప్పందానికి వచ్చారు. దాన్ని రష్యాలోని కజాన్ నగరంలో జరిగిన బ్రిక్స్ సమావేశాల సందర్భంగా అక్టోబరు 23న మన ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నేతృత్వంలో ఉభయదేశాల ప్రతినిధి బృందాలు సమావేశమై తుదిరూపమిచ్చాయి. ఒక క్రమ పద్ధతిలో గాల్వన్ లోయ ఉదంతాలకు ముందున్న పరిస్థితిని పునరుద్ధరించేందుకు అంగీకరించారు. ఆ మేరకు అక్టోబరు చివరివారంలో సైనిక దళాల ఉపసంహరణ కూడా జరిగింది. ఈ తరుణంలో చైనా వ్యతిరేక, మోడీ అనుకూల సోషల్ మీడియా మరుగుజ్జులు రంగంలోకి దిగారు. చైనా దేశ మాప్ నేపథ్యంలో నరేంద్రమోదీ ఒక సింహాసనం లాంటి కుర్చీలో ఠీవిగా కూర్చొని ఉంటే జిన్‌పింగ్ మోకాళ్ల మీద కూర్చుని భూమిని అప్పగిస్తున్నదానికి చిహ్నంగా చెట్లు ఉన్న ఒక పచ్చని పళ్లెం లాంటి దాన్ని సమర్పించుకుంటున్నట్లు తయారు చేసిన నకిలీ కృత్రిమ చిత్రాన్ని సోషల్ మీడియాలో వదిలారు. దాన్ని చైనా సోషల్ మీడియాలో వైరల్ చేశారని, అడ్డుకునేందుకు అక్కడి ప్రభుత్వం సెన్సార్ చేసిందని, షేర్ చేస్తున్న వారిమీద కఠిన చర్యలకు దిగుతున్నట్లు సమాచారం వచ్చిందని రాశారు. తప్పుడు సమాచార వ్యాప్తిలో ఇదొక కొత్త టెక్నిక్, అబ్బే మనకేం సంబంధం లేదు, చైనాలోనే అలాంటిది జరిగినట్లు నమ్మించే అతి తెలివి తప్ప మరొకటి కాదు. తప్పుడు చిత్రాలు, సమాచారాన్ని ప్రచారం చేసే వారు ఎక్కడో ఒక దగ్గర దొరికిపోతారు. చైనా ఆక్రమించుకున్న 90వేల చదరపు మీటర్ల ప్రాంతాన్ని(22.23ఎకరాలు) తిరిగి మనదేశానికి అందచేసినట్లు రాశారు. నిజానికి రెండు దేశాల మధ్య వివాదం ఉన్న స్థల విస్తీర్ణం 90వేల చదరపు మీటర్లు కాదు కిలోమీటర్లు. ఆ ప్రాంతాన్ని నిజంగా చైనా అప్పగిస్తే అది ప్రపంచవార్తగా మారి ఉండేది. సరిహద్దుల్లో గతంలో మాదిరి ఎవరి ప్రాంతాల్లో వారు ఉండటం గురించి, గస్తీ మీద ఒక ఒప్పందానికి వచ్చారు తప్ప ఒక్క గజం స్థలం కూడా మార్చిడి జరగలేదు, అసలు దానిమీద చర్చలే జరగలేదు. అది మాది అంటే మాది అని మన ప్రభుత్వం, చైనా సర్కార్ ఎప్పటి నుంచో పరస్పరం వాదించుకుంటున్నాయి. మన ఆధీనంలో 84వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న అరుణాచల్ ప్రదేశ్ తమదని, అది టిబెట్ దక్షిణ ప్రాంతమని చైనా చెబుతుంటే, వారి ఆధీనంలో ఉన్న ఆక్సాయ్ చిన్ ప్రాంతం 90వేల చదరపు కిలోమీటర్లు మనదని అంటున్న అంశం తెలిసిందే. రెండు దేశాల మధ్య వివాదం అదే కద. అసలేమీ జరగనిదాన్ని చైనా సోషల్ మీడియాలో ఎలా ప్రచారం చేస్తారు. అక్కడ మన మాదిరి దేన్నిబడితే దాన్ని జనంమీదకు వదలటానికి గూగుల్, యూట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్‌లు లేవు. వాటిమీద నిషేధం ఉంది. అవెక్కడా కనిపించవు. చైనా సర్కార్ అధికారికంగా నిర్వహించే బైదు వంటి సామాజిక మాధ్యమవేదికలు ఉన్నాయి. నిజంగా ఎవరైనా అలాంటి పిచ్చి పోస్టు వాటిలో పెడితే వెంటనే తొలగించే సాంకేతిక నైపుణ్యం చైనా దగ్గర ఉంది. అందువలన అలాంటి వాటిని వైరల్ చేసే అవకాశం అక్కడ లేదు. అలాంటి చిత్రాల గురించి నిజానిజాలు తేల్చేందుకు చూసిన వారికి అది మన సోషల్ మీడియాలో తిరుగుతున్న ఒక కృత్రిమ చిత్రంగా తేలింది తప్ప చైనాలో తయారైందిగా కనిపించలేదు. ఒకవేళ ఎవరికైనా అలాంటి సమాచారం ఉంటే ఆధారాలతో వెల్లడించవచ్చు. ఆ చిత్రం తీరుతెన్నులను చూస్తే నరేంద్రమోదీ గొప్పతనాన్ని కృత్రిమంగా పెంచేందుకు చూస్తున్న కిరాయిబాపతు సృష్టి తప్ప మరొకటి కాదు అన్నది స్పష్టం. వారికి అదొక తుత్తి(తృప్తి), చౌకబారుతనం తప్ప మరొకటి కాదు. నిజంగా అలాంటి వాటిని పదేపదే ప్రచారం చేస్తే నిజం చెప్పినా ఒకనాటికి మోదీ భక్తులు కూడా నమ్మని స్థితి ఏర్పడుతుంది. పరాయి దేశాల్లో అపహాస్యం పాలౌతారు.

2020లో గాల్వన్‌లోయ సరిహద్దులో రెండు దేశాల మధ్య జరిగిన ఘర్షణ ఆసియా రాజకీయాల్లో భూకంపం అని కొందరు వర్ణించారు. ముఖ్యంగా అమెరికా మీడియా మాటలను చూస్తే భారత్–చైనాల మధ్య మరో యుద్ధమే తరువాయి అన్నట్లుగా భ్రమపడిన వారున్నారు. ఇంకేముంది మన చేతికి మట్టి అంటకుండా చైనాను నిరోధించే బాధ్యత నరేంద్రమోదీ నెత్తిన పెట్టవచ్చనుకున్నారు అమెరికన్లు. సరిహద్దులో లక్షల సైన్యం కొనసాగితే మరింతగా సొమ్ము చేసుకోవచ్చని అమెరికా, ఇతర ఐరోపా దేశాల ఆయుధ కంపెనీలు మన గురించి ఎన్నో ఆశలు పెట్టుకున్నాయి.మన మార్కెట్లో తమ సరకులను కుమ్మరించి లాభాలు పిండుకోవచ్చని కలలు కన్నాయి. ఇప్పుడవి కల్లలయ్యాయి. చైనా నుంచి గత నాలుగేండ్లుగా రికార్డు స్థాయిలో దిగుమతులు చేసుకోవటమే కాదు, నిషేధించిన పెట్టుబడులను కూడా పొందేందుకు మోదీ సర్కార్ నిర్ణయించింది. దీంతో ఇప్పుడు కుదిరిన సయోధ్య చైనా వ్యతిరేకులకు పిడుగుపాటుగా ఉంది. తమ ఎన్నికలకు పక్షం రోజుల ముందు కుదిరిన ఈ అవగాహనను అమెరికన్లు ఊహించినప్పటికీ పరిస్థితి తమ చేతుల్లో లేదన్న ఉక్రోషంతో ఉన్నారు. మనదేశంలోని కొన్ని శక్తులకు మింగుడు పడకపోయినా కార్పొరేట్ల వత్తిడి కారణంగా లోలోపల ఉడుక్కుంటున్నారు.

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌పై పోస్టు పెట్టినందుకు, దాన్ని వైరల్ చేయటం వంటివి చేసిందెవరో కనుగొనండి.

ఇవి ఏ విద్యాసంస్థ ప్రతిపత్తి నిర్ధారణకైనా గీటురాళ్లు అవుతాయి. ఎఎంయుకు మైనారిటీ ప్రతిపత్తి ఇస్తూ 1981లో చట్టానికి చేసిన సవరణ చెల్లుబాటును కొట్టివేస్తూ అలహాబాద్ హైకోర్టు 2006లో ఇచ్చిన తీర్పును కూడా తమ తీర్పులోని సూత్రాల ఆధారంగా పరిశీలించాల్సిందిగా రెగ్యులర్ బెంచిని ధర్మాసనం కోరింది.

అలీగఢ్ ముస్లిం యూనివర్శిటీ 1875లో నెలకొల్పబడింది. దానికున్న మైనారిటీ ప్రతిపత్తిని 1981లో ఎఎంయు చట్టం (సవరణ) ద్వారా పార్లమెంటు పునరుద్ధరించింది. అలహాబాద్ హైకోర్టు 2006 జనవరిలో ఆ సవరణ చెల్లదని కొట్టివేసింది. ఈ సమస్య 2019 లో ఏడుగురు జడ్జీల సుప్రీంకోర్టు బెంచికి నివేదించబడింది.

''ఆర్టికల్ 30(1) వివక్షకు వ్యతిరేకమైందీ, అదే సమయంలో మత, భాష మైనారిటీలకు 'ప్రత్యేక హక్కులు' ఇస్తున్నది. అందువల్ల విద్యాసంస్థలు నెలకొల్పే, నడిపేందుకు వారికిగల హక్కుకు వ్యతిరేకమైన శాసనం లేదా ఉత్తర్వు ఆర్టికల్ 30(1) కి విరుద్ధం. విద్యాసంస్థ నెలకొల్పిన భాష లేదా మత మైనారిటీకి అధిక స్వయం ప్రతిపత్తికి గ్యారంటీ ఉంటుంది. 'ప్రత్యేక హక్కులకు అర్థం ఇదే''నని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. ఆర్టికల్ 30సెక్యులర్ విద్యకు కూడా విస్తరిస్తుందన్నారు. ఈ వివాదం ఇంతటితో ఆగాలని, మైనారిటీ హక్కులు పునరుద్ధరించబడాలని ఆశించుదాం.

# అంగన్‌వాడీలపై గుజరాత్ హైకోర్టు తీర్పు ప్రాధాన్యం



ఎస్.బాల్‌రాజ్
ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
8074246685

గుజరాత్‌లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అనేక సంవత్సరాలుగా పని చేస్తూ శ్రమకు తగ్గ వేతనాలు రాక కోర్టు కెక్కారు. ప్రభుత్వమే ప్రైవేటు యాజమానులలాగ అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ అంగన్‌వాడీ ఉద్యోగులతో 12 గంటలు పనిచేయిస్తూ పనిభద్రత కల్పించకపోవటంతో 2015వ సంవత్సరంలో అనేక ప్రాజెక్టుల నుండి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వ

# కల్తీదారులపై ఉక్కుపాదం మోపాలి

## రైతులకు వ్యవసాయ అధికారులు అండగా నిలువాలి : రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విత్తనాలు, క్రిమి సంహారక మందులను కల్తీ చేసే కంపెనీలు, వ్యక్తుల పైన పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేసి, ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కొత్తగా బాధ్యతలు చేపట్టనున్న వ్యవసాయ అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎం సిఆర్ హెచ్ ఆర్ డి) లో శనివారం జరిగిన నూతనంగా రిక్రూట్ అయిన వ్యవసాయ అధికారుల శిక్షణ ముగింపు సమావేశంలో చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ అధికారులు ( ఎఒ ) అండగా నిలవాలన్నారు. నేల సారం పెరిగేలా ఎఒలు చర్యలు తీసుకోవాలని, అందుకు వర్మి కంపోస్టును ప్రోత్స హించాలన్నారు. రాష్ట్రంలో కూరగాయల కొరత ఉన్నదని, కూరగాయలు, పండ్ల ఉత్పత్తుల కోసం కూడా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ లో పాల సరఫరా డిమాండ్ కు అనుగుణంగా లేదని, ప్రతి రోజూ ఒక లక్ష లీటర్ల పాల సరఫరా కొరత ఉన్నదని వివరించారు.పాడి, పంటలతో పాటు వర్షాభావ ప్రాంతాల్లో వాటర్ షెడ్ కార్యక్రమాలపై వ్యవసాయ అధికారులు దృష్టి కేంద్రీకరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండ రెడ్డి, సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ విభాగం హెడ్ కెప్టెన్ పాండురంగా రెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి, శిక్షణ కోర్సు ఇన్‌చార్జ్ ఉషారాణి, వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర చైర్మన్ బొమ్మిరెడ్డి కృపాకర్ రెడ్డి, వ్యవసాయ యూనివర్సిటీ విశ్రాంత ఉన్నతాధికారి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డితో..

# వ్యవసాయ విస్తరణ అధికారుల భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పని ఒత్తిడి, వ్యవసాయ ఉన్నతాధికారుల వైఖరి వల్ల ఇటీవల కొంత కాలంగా తరచూ సమ్మె బాట పడుతున్న వ్యవసాయ విస్తరణ అధికారుల ( ఏఈఓ) సంఘం ప్రతినిధులు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్‌జి.చిన్నారెడ్డితో సమావేశమయ్యారు. మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్‌లోని శనివారం ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ ఛాంబర్‌లో చిన్నారెడ్డితో ఏఈఓలు తమ సమస్యలను తెలిపారు. ప్రభుత్వంపై తమకు ఎలాంటి కోపతాపాలు లేవని, క్షేత్ర స్థాయిలో తమకు ఉన్న పని భారాన్ని అర్థం చేసుకుని, క్రాప్ డిజిటల్ సర్వే పనుల్లో మరొకరిని తమకు సహాయంగా నియమించాలని ఏఈఓ సంఘం ప్రతినిధులు చిన్నారెడ్డిని కోరారు. గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్, మహిళా స్వయం సహాయక సంఘాల ఉద్యోగిని క్రాప్ డిజిటల్ సర్వే పనులకు తమకు చేదోడుగా ఉండేలా చూడాలని ఏఈఓలు చిన్నారెడ్డిని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లుతానని చిన్నారెడ్డి వారికి ఆయన తెలిపారు. త్వరలో మరికొంత మంది ఏఈఓలతో భేటీ అవుతామని, అందరి అభిప్రాయాలు తీసుకుని ముందుకు సాగుతామని చిన్నారెడ్డి అన్నారు. ఈ భేటీలో వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర ఛైర్మన్ బొమిరెడ్డి కృపాకర్ రెడ్డి, వ్యవసాయ యూనివర్సిటీ విశ్రాంత ఉన్నతాధికారి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఏఈఓ సంఘం ప్రతినిధులు ఆనంద్, వెంకటేశ్, రాజు, వెంకన్న, సురేష్, రాధమ్మ, రాజేశ్వరి, లలిత తదితరులు పాల్గొన్నారు.

## కులగణనపై రాహుల్ గాంధీ ట్వీట్

స్పందించిన సిఎం రేవంత్ రెడ్డి

కులగణన సర్వే చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుంది

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో కులగణన ప్రారంభమైందని, రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధికి సంబంధించిన విధానాలను రూపొందించడానికి ఈ డేటాను వినియోగిస్తామని ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. మహారాష్ట్రలోనూ ఇదే జరగనుందన్నారు. పార్లమెంట్‌లో ఈ కులగణను ఆమోదించి, రిజర్వేషన్‌లపై ఉన్న 50 శాతం అడ్డుగోడలను బద్దలు కొడతామన్నారు. రాహుల్ గాంధీ ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ సిఎం రేవంత్ రెడ్డి స్పందించారు. తెలంగాణలో ఈరోజు కులాల సర్వే గణన ప్రారంభంతో సరికొత్త విప్లవయాత్రకు శ్రీకారం చుట్టామని రేవంత్ రెడ్డి అన్నారు. తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ వాగ్దానం మేరకు రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సామాజిక న్యాయం సాకారం కానుందని పేర్కొన్నారు. కులగణన కార్యక్రమం చేపట్టిన ఈ రోజు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందన్నారు.

## రేవంత్‌రెడ్డి పాలనలో మేడే కార్మికుల సెలవు రద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే రోజును రేవంత్‌రెడ్డి సర్కార్ సెలవు దినంగా ప్రకటించకపోవడాన్ని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి ఎస్.బాలరాజ్ తీవ్రంగా ఖండించారు. ఎన్నో త్యాగాలు, పోరాటాల వల్ల సాధించుకున్న 8 గంటల పనిని మే 1న సాధించుకున్నామని తెలిపారు. ప్రపంచంలోని పెట్టుబడిదారి, ఇతర దేశాల అధినేతలు కూడా ప్రపంచ వ్యాప్తంగా మే 1వ తారీఖున కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సెలవు ప్రకటిస్తుంటే, తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం సెలవు ప్రకటించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.గతంలో ఉన్న ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం మే 1తారీఖున మేడేను కార్మికుల సెలవు దినంగా ప్రకటిస్తున్నప్పటికి ఈసారి 2025వ సంవత్సరానికి సంబంధించిన ప్రభుత్వ క్యాలెండర్లో మేడేను పొందుపర్చకుండా కార్మిక వర్గాన్ని అవమానించటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి వెంటనే క్యాలెండర్లో మే 1న సెలవు ప్రకటించాలని, ప్రకటించకుంటే రాష్ట్రంలోని అన్ని కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున పోరాటాలు, ఉద్యమాలు చేస్తామని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ హెచ్చరించారు.

## ఈనెల 11,12న ''డెడికేషన్ కమిషన్''బహిరంగ విచారణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వెనుకబడిన తరగతుల రిజర్వేషన్‌కు సంబంధించి, స్థానిక సంస్థల స్వభావం, సమస్యలు, సమకాలీన అంశాలపై డెడికేటెడ్ కమిషన్' ఈ నెల 11,12వ తేదీన రెండు రోజుల పాటు బహిరంగ విచారణ చేపట్టనుంది. 11న ఉదయం 11:30గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు హైదరాబాద్,మాసబ్‌ట్యాంక్‌లోని డిఎస్ఎస్ భవన్‌లోని నాల్గవ అంతస్తులో బహిరంగ విచారణను ప్రారంభించనుంది. ఈ విచారణకు అందరూ ఆహ్వానితులే. ఆ మరుసటి రోజు ఈ నెల 12న ఉదయం 11:30గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఎన్‌జిఒ, కుల, సంక్షేమ సంఘాలు తదితరులు బహిరంగ విచారణలో పాల్గొనాలని డెడికేటెడ్ కమిషన్ కార్యదర్శి బి.సైదులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## సిఎంపై బిఆర్ఎస్ నేతల ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్)కు చెందిన నేతలు ఫైసల్‌ఖాన్, సాయితేజ మీర్‌చౌక్ ఎసిపికి శనివారం ఫిర్యాదు చేశారు. బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుపై ఇటీవల బహిరంగ ప్రసంగంలో ముఖ్యమంత్రి 'పరువు నష్టం కలిగించే విధంగా మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలలో హింస, వ్యక్తిగత అవమానాలు, బెదిరింపులు ఉన్నాయని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.

## సిఎం కనుసన్నల్లో పోలీసులు

మాజీ ఎంపి వినోద్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం రేవంత్‌రెడ్డి కనుసన్నల్లో పోలీసులు పనిచేస్తున్నారని, పదవులు శాశ్వతం కాదనే విషయం వారు గుర్తుంచుకోవాలని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత కెసిఆర్ ప్రభుత్వం ఐదు వేల మంది లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో దళితబంధు నిధులను జమచేస్తే, ఆ ఖాతాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఫ్రీజ్ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఫ్రీజ్ చేసిన ఖాతాల నుంచి లబ్ధిదారులకు డబ్బులు విడుదల చేసేలా బ్యాంకులకు ఆదేశాలు ఇవ్వాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో రెండవ విడత దళితబంధు బాధితుల ధర్నాలో ఎంఎల్ఎ పాడి కౌశిక్‌రెడ్డిపై పోలీసులు దాడి చేశారని ఆయన మండిపడ్డారు. పోలీసులు అనవసరంగా దాడి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మాజీఎంఎల్ఎ జ్యోతి మరణం సిఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మెట్‌పల్లి మాజీ ఎంఎల్ఎ కొమిరెడ్డి జ్యోతి మరణం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ద్రిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దివంగత మాజీ ఎంఎల్ఎ, అడ్వకేట్ కొమిరెడ్డి రాములు సతీమణి కొమిరెడ్డి జ్యోతి ఆత్మకు శాంతి చేకూరాలని సిఎం ప్రార్థించారు. జ్యోతి కుటుంబ సభ్యులకు సిఎం ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మెట్‌పల్లి మాజీ ఎంఎల్ఎ కొమిరెడ్డి జ్యోతి మరణం పట్ల రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కొమిరెడ్డి జ్యోతి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# 27న సాధారణ, 23 ఐచ్ఛిక సెలవులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వచ్చే ఏడాది2025 సంవత్సరానికి గాను సాధారణ, ఐచ్ఛిక సెలవుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. 2025లో మొత్తంగా 27 సాధారణ సెలవులు, 23 ఐచ్ఛిక సెలవులను ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులను జారీ చేశారు. జనవరి 1న సాధారణ సెలవు ప్రకటించినందుకుగాను ఫిబ్రవరిలో రెండో శనివారం పనిరోజుగా ఉంటుంది. మొత్తం 23 ఐచ్ఛిక సెలవుల్లో ఉద్యోగులు గరిష్ఠంగా ఐదు తీసుకోవచ్చునని ఉత్తర్వులో పేర్కొన్నారు.భోగీ, సంక్రాంతి, గణతంత్ర దినం, మహాశివరాత్రి, హోలీ, ఉగాది, రంజాన్, బాబూ జగజ్జీవన్ రాం, శ్రీరామనవమి, అంబేద్కర్ జయంతి, గుడ్ ఫ్రైడే,బక్రీద్, మొహరం, బోనాలు, స్వాతంత్ర్య దినం, శ్రీకృష్ణాష్టమి, వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ, బతుకమ్మ, గాంధీ జయంతి, దసరా, దీపావళి, కార్తీక పౌర్ణమి, క్రిస్మస్‌ను సాధారణ సెలవులుగా ప్రభుత్వం ప్రకటించింది. రంజాన్, మొహరం, మిలాద్ ఉన్ నబీ పండుగలకు నెల వంక కనిపించిన రోజున సెలవు రోజు మారితే మీడియా ద్వారా సమాచారం ఇవ్వనున్నట్లు ప్రభుత్వంతెలిపింది. కాగా ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ పరిశ్రమలు, విద్యా సంస్థల్లోని ఉద్యోగులకు సెలవులు ఆయా శాఖలు ప్రత్యేకంగా వెల్లడిస్తాయని ఉత్తర్వుల్లో తెలిపారు. జనరల్ హాలిడేస్, ఆప్షనల్ సెలవుల్లో ఎక్కువగా జనవరి నెలలోనే సెలవులు ఎక్కువగా మంజూరయ్యాయి.

**సాధారణ సెలవులు :** జనవరి 1న నూతన సంవత్సరం, జనవరి 13న భోగీ, 14న సంక్రాంతి, 26వ తేదీన గణతంత్ర దినోత్సవం, ఫిబ్రవరి 26న మహాశివరాత్రి, మార్చి 14న హోలీ, మార్చి 30న ఉగాది, మార్చి 31న ఏప్రిల్ 1న రంజాన్( రెండు రోజులు) , ఏప్రిల్ 5న బాబూ జగజ్జీవన్ రాం జయంతి , ఏప్రిల్ 6న శ్రీరామనవమి, ఏప్రిల్ 14న డాక్టర్.బి.ఆర్. అంబేద్కర్ జయంతి, ఏప్రిల్ 18న గుడ్ ఫ్రైడే, జూన్ 7న బక్రీద్, జులై 6న మొహరం,జులై 21న బోనాలు, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం, ఆగస్టు 18న శ్రీకృష్ణాష్టమి, ఆగస్టు 27న వినాయక చవితి, సెప్టెంబర్ 5న మిలాద్ ఉన్ నబీ, సెప్టెంబర్ 21న ఎంగిలిపువ్వుల బతుకమ్మ ,అక్టోబర్ 2న గాంధీ జయంతి, అక్టోబర్ 3న దసరా, అక్టోబర్ 20న దీపావళి, నవంబర్ 5న కార్తీక పౌర్ణమి,గురునానక్ జయంతి, డిసెంబర్ 25,26న క్రిస్మస్( రెండు రోజులు) సెలవులు.

## న్యూజిలాండ్‌లో తెలంగాణ శాసనసభ స్పీకర్ బృందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆస్ట్రేలియా లోని సిడ్నీలో జరిగిన 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సిపిఎ) కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అనంతరం స్టడీ టూర్ లో భాగంగా తెలంగాణ శాసన సభ స్పీకర్ బృందం శనివారం న్యూజిలాండ్ చేరుకుంది. న్యూజిలాండ్‌లో 'తెలంగాణ సెం ట్రల్ అసోసియేషన్' ఆద్వర్యంలో ఆక్లాండ్‌లో ఏర్పాటు చేసిన మీట్ గ్రీట్' కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ,డిప్యూటీచైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్,లేజిస్లేచర్‌సెక్రటరీడా.వినరసింహాచార్యులు,తెలంగాణ సెంట్రల్ అసోసియేషన్ ప్రతినిధులు రాంమోహన్, కళ్యాణ్‌రావు పాల్గొన్నారు. సభాపతి, చైర్మన్, డిప్యూటీ చైర్మన్, సెక్రటరీలను సాంప్రదాయం ప్రకారం శాలువా, పుష్ప గుచ్ఛాలతో అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు.

## జార్జి రెడ్డి పిడిఎస్‌యు గ్రేటర్ హైదరాబాద్ నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షునిగా ఎం.వెంకటేశ్..ప్రధాన కార్యదర్శిగా ఎస్.అంజి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (జార్జి రెడ్డి పిడిఎస్‌యు) రాష్ట్ర నిర్మాణ సర్వసభ్య సమావేశం ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించారు. ఈ సమావేశంలో జార్జిరెడ్డి పిడిఎస్‌యు ఉస్మానియా యూనివర్సిటీ నూతన కమిటీని ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రేటర్ హైద్రాబాద్ అధ్యక్షులుగా ఎం.వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.అంజి, ఉపాధ్యక్షులుగా రుక్మత్ పాషా, ప్రశాంత్, సతీష్, సహాయ కార్యదర్శులుగా కోటేశ్వర్, శివ కుమార్, కోశాధికారిగా ధనుష్‌లతో పాటు మరో 15 మందితో కమిటీని రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నాగేశ్వర రావు, ఎన్. సుమంత్‌ల సమక్షంలో ఎన్నుకున్నారు.

# రహదారుల ఆక్రమణలపై హైడ్రా ఫోకస్

ఫిల్మ్ నగర్‌లో రోడ్డుకు అడ్డుగా ఉన్న.. షాప్‌లు, షెడ్, ప్రహరీ గోడల తొలగింపు

రోడ్డు విస్తరణ జరగడంతో హర్షం వ్యక్తం చేసిన స్థానికులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ రోడ్లపై హైడ్రా ఫోకస్ చేసింది. రహదారులను ఆక్రమించి నిర్మించిన కట్టడాల తొలగింపునకు చర్యలు చేపట్టింది. గ్రేటర్ హైదరాబాద్ రోడ్లను ఆక్రమించి నిర్మించిన షాప్‌లు, షెడ్‌లను శనివారం హైడ్రా, జిహెచ్ఎంసి సిబ్బంది కూల్చేవేశారు. ఫిల్మ్ నగర్‌లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన కట్టడాలపై స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఫిల్మ్ నగర్‌లోని లేఔట్‌ను హైడ్రా అధికారులు పరిశీలించారు. రోడ్డును అక్రమించి నిర్మాణాలు జరిగినట్టు జిహెచ్ఎంసి అధికారులు నిర్ధారించారు. ఇంటి ప్రహారీ గోడ, రేకుల షెడ్డును జిహెచ్ఎంసి, హైడ్రా అధికారులు కూల్చేశారు. కూల్చివేతల వెంటనే అక్కడి శిథిలాలను తొలగించారు. జిహెచ్ఎంసి ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ మాట్లాడి, వెంటనే కూల్చివేతలు జరిపిన స్థలంలో రోడ్డును నిర్మించాలని సూచించారు. అక్కడ సుమారు 15 ఏళ్లుగా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని స్థానికులు చెప్పారు. ఆక్రమణలను కూల్చివేసి రహదారిని విస్తరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కూల్చివేతలు జరిపిన వెంటనే అక్కడి నిర్మాణ వ్యర్థాలను హైడ్రా వెంటనే తొలగించింది.

# 'రిమ్మోలియన్'కు ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చాలా కాలం తర్వాత ఒక రిమ్మోలియన్‌కు రాష్ట్రంలో మెడిసిన్ విద్యార్థిగా వైద్య కళాశాలలో సీటు లభించింది. డెహ్రాడూన్‌లోని ప్రతిష్టాత్మక రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ (ఆర్ఐఎంసి)లో చదివిన విద్యార్థులను 'రిమ్మోలియన్స్'గా పిలుస్తారు. ఆర్ఐఎంసి అనేక ప్రతిష్టాత్మక రక్షణ సిబ్బందిని అందించడంలో అగ్రస్థానంలో నిలిచింది. ప్రతి రాష్ట్రం నుంచి ఒక్కరిని చొప్పున ఎంపిక చేసి ఈ కళాశాలలో శిక్షణ ఇస్తారు. డిజిపి కార్యాలయంలో సిపి ఆర్ఓగా పనిచేస్తున్న సిహెచ్.శ్రీనివాస రావు పెద్ద కుమారుడు చేపూరి అవినాష్ తన 13 ఏళ్ల వయస్సులో 2017లో ఆర్ఐఎంసిలో ప్రవేశం పొందాడు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాత పరీక్ష ద్వారా తరువాత ఇంటర్వ్యూకు ఎంపికయ్యాడు. సాంప్రదాయ రీత్యా రక్షణ రంగంలో సాహసాలు చేసే ఆర్ఐఎంసి విద్యార్థులు రక్షణశాఖ తో పాటు వారికి నచ్చిన భిన్న మార్గాలను ఎంచుకుంటారు. అవినాష్ వైద్యరంగాన్ని ఎంచుకుని ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రవేశించాడు. ఆర్ఐఎంసి విద్యను పూర్తిచేసిన తర్వాత, 2024 లో మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీటు పొందిన రిమ్మోలియన్‌గా నిలిచాడు.

# అంకిత భావంతో సర్వే పూర్తి చేయాలి

## జిల్లా స్పెషల్ ఆఫీసర్ డి.దివ్య దేవరాజన్

**ప్రజాపక్షం/రంగారెడ్డిప్రతినిధి:** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యుమరేటర్లు,సిబ్బంది అంకిత భావంతో సర్వే పూర్తి చేయాలని సెర్ప్ సిఇఒ,ప్రజావాణి నోడల్ అధికారి,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్పెషల్ ఆఫీసర్ డి.దివ్య దేవరాజన్ అన్నారు.శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోనిసమావేశ మందిరంలో సామాజిక, ఆర్థిక, ఉపాధి,రాజకీయ,కుల సర్వే ప్రక్రియ పై జిల్లా స్పెషల్ ఆఫీసర్ దివ్య దేవరాజన్ జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ సర్వే ప్రక్రియలు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఎ లాంటి ఇబ్బంది లేకుండా ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.సర్వే ప్రక్రియలో ఎన్యుమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సర్వే పై ప్రజలల్లో ఏమైనా సందేహాలుంటే తక్షణమే నివృత్తి చేయాలన్నారు. ఇచ్చిన ప్రొఫార్మా లో సమాచారాన్ని క్రోడీకరించాలన్నారు. ప్రజలు ఎలాంటి అపోహాలు పడకుండా ఎన్యుమరేటర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వే నిర్వహించే ప్రాంతంలో ముందు రోజే ఆయా కుటుంబాలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఇంటి యజమాని ఇచ్చిన వివరాలను మాత్ర మేప్రొఫార్మాలోపొందు పరచాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్పెషల్ అధికారి డి.దివ్య దేవరాజన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తో కలిసి ధాన్యం కొనుగోలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు.దివ్య దేవరాజన్ మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియ శరవేగంగా జరగాలని అధికారులకు సూచనలు చేశారు. ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అధికారులు పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలన్నారు.రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే తూకం జరిపించి,సేకరించిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్,జిల్లా పరిషత్ సిఇఒ కృష్ణారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### సర్వే పనులను తనిఖీ చేసిన స్పెషల్ ఆఫీసర్ దివ్య దేవరాజన్

అనంతరం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డులో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి సర్వే సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు కుటుంబాల వారితో మాట్లాడుతూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా సామాజిక, ఆర్థిక, ఉపాధి,రాజకీయ,కుల సర్వే ప్రక్రియను నిర్వహిస్తున్నామని,విధులలో ఎలాంటి ఆలసత్వం వహించకుండా సర్వే ప్రక్రియను నిర్వహించాలని ఎన్యూమరేటర్లకు స్పెషల్ ఆఫీసర్ దివ్య దేవరాజాన్ ఆదేశించారు.

# మణిపూర్‌లో మహిళను కాల్చిచంపిన ఉగ్రవాదులు

**ఇంఫాల్ :** మణిపూర్‌లో ఉగ్రవాదులు శనివారం నాడు వరిపంట పొలాల్లో ఒక మహిళను కాల్చిచంపారు. బిష్ణుపురిజిల్లాలో పర్వతప్రాంత ఉగ్రవాదులుగా వారిని భావిస్తున్నట్లు పోలీసు అధికారులు చెప్పారు. ఇతర కూలీలతో కలిసి మహిళ పంట పొలం పనులకు వెళ్ళినప్పుడు ఉగ్రవాదులు ఆమెపై కాల్పులు జరిపారు. ఇంఫాల్ పల్లపుప్రాంత వ్యవసాయ క్షేత్రాలలో ఈ ఘటన జరిగింది. మహిళ అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకున్నాయి. కేంద్ర బలగాలు ఈ ప్రాంతంలో మోహరించినప్పటికీ వారు ఉగ్రవాదులపై ఎలాంటి చర్యలూ తీసుకోవడంలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. జిరిబమ్ జిల్లాలోని జైరాన్ హ్మార్ గ్రామంలో రెండు రోజులక్రితం 31 ఏళ్ళు వయసుగల ఒక మహిళను మంటల్లో కాలి మరణించిన ఘటన తర్వాత వెంటనే ఈ మహిళను కూడా కాల్చి చంపారు. శుక్రవారం జరిగిన ఘటనలో ఆరు ఇళ్ళు దగ్ధమయ్యాయి. మహిళ ఒక ఇంట్లో ఉండిపోయింది. కాలిన ఆమె మృతదేహాన్ని తర్వాత వెలికితీశారు. గడచిన ఏడాది కాలంగా మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండలో 200 మంది మరణించారు. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు.

## చదువే లక్ష్యంగా విద్యార్థులు ముందుకు సాగాలి

**ప్రజాపక్షం /నల్లగొండ :** చదువే లక్ష్యంగా విద్యార్థులు ముందుకు సాగాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.శనివారం నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంతో కలిసి నల్లగొండ జిల్లా మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో సుమారు 37.95 కోట్లతో నిర్మించనున్న అకడమిక్ భవనం,విద్యార్థినిల వసతి గృహం, అంతర్గత సిసి రహదారుల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ పనులన్నింటినీ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి మాట్లాడుతూ ఐటీ శాఖ సహకారంతో, మహాత్మా గాంధీ యూనివర్సిటీలో నైపుణ్యాల అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసేందుకు దృష్టి సారిస్తానని తెలిపారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఖాజా అల్తాఫ్ హు

## సైబర్ నేరగాళ్లతో తస్మాత్ జాగ్రత్త

### ఎస్ఐ కురుమయ్య

ప్రజాపక్షం / నర్వ : కుటుంబ సర్వే పేరుతో కొంత మంది కొత్త తరహా దోపిడి చేసే అవకాశం ఉందని వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని మండల ప్రజలకు ఎస్ఐ కురుమయ్య అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దీన్ని ఆసరాగా చేసుకొని సైబర్ కేటగాళ్లు సైబర్ దోపిడిలకు పాల్పడవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ కురుమయ్య మాట్లాడుతూ సర్వే పేరుతో ఇండ్లలోకి వస్తున్న అపరిచిత వ్యక్తులు బ్యాంకు అకౌంట్ , బయోమెట్రిక్ ఫోన్ నంబర్ , ఓటీపీలు తీసుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీస్ శాఖ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు మీ ఇంటికి వచ్చి సర్వే పేరుతో ఆధారాలు సేకరించే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మండల ప్రజలను కోరారు. తెలంగాణ వ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే జరుగుతున్న సంగతి తెల్సిందే. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమాచారాన్ని సేకరిస్తున్నారు. అసలైన సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. అపరిచిత వ్యక్తులు వచ్చినట్లు అనుమానం వస్తే 100 ఫోన్ చేయాలని సూచించారు.

## శ్రీశ్రీ శివ రామంజనేయ స్వామి వారి దేవాలయానికి హుండీ వితరణ

**ప్రజాపక్షం/అడ్డాకుల :** మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలంలోని బలీదుపల్లి గ్రామానికి చెందిన అక్కల పద్మ వెంకట్రాములు గౌడ్ ఎర్‌టిసి కండక్టర్ గ్రామ దేవాలయానికి ఈ పుణ్య దంపతులు సంపాదనలో ఎంతో కొంత సమాజానికి గ్రామానికి చెయ్యాలనే ఆలోచన వారికి రావడం చాలా గొప్ప విషయం అలాంటి ఆలోచనలు చేతల్లో చూపిన వారు అందరికి ఆదర్శం అవుతారు. తమ సొంత ఊరు దేవాలయానికి తమ వంతుగా ఈ పుణ్య దంపతులు లాకర్ హుండీ ని 40,000 వేల రూపాయాతో తయారు చేపించి శనివారం దేవాలయంలో కార్తీక శనివారం సందర్భంగా శివుడికి రుద్రాబీషేకం ఆంజనేయస్వామి కి ఆకుల పూజ తర్వాత హుండీకి పూజ కార్యక్రమంలో పురోహితులు సురేష్, తారకేశ్వర్ అయ్యా గారులు చేసి గుడిలో పెట్టడం జరిగింది. గ్రామ దేవాలయానికి చేసిన సహాయానికి దేవాలయ కమిటీ వారు దంపతులను వేద పండితులు సురేష్, తారకేశ్వర్ అయ్యగారులు చేత వారిని సన్మానించి ఆశీర్వచనాలు అందజేయడం జరిగింది గ్రామ ప్రజలందరి తరపున కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో పద్మ వెంకట్రాములు గౌడ్ కుటుంబ సభ్యులు, గ్రామ మహిళా మణులు , గ్రామ పెద్దలు, యువకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

## సర్వేకు సహకరించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని 7వ వార్డులో నివాసముంటున్న మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి నివాసంలో సర్వే నిర్వహించారు. ఈ సమగ్ర సర్వేలో సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే పూర్తి సమాచారాన్ని ఇచ్చి అధికారులకు సహకరించారు. ప్రజలు సమగ్ర సర్వేలో భాగస్వాములై అధికారులకు పూర్తి స్థాయిలో సహకారం అందించి సమగ్ర సర్వేను విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సర్వేలో ఏన్యూమారేటర్ , సూపర్వైజర్స్ , పురపాలక కమిషనర్ సమాచారాన్ని సేకరించారు. ఈ సర్వేలో రాజకీయ పుర ప్రముఖులు చంద్రకాంత్ గౌడ్, కట్ట సురేష్ కుమార్ గుప్తా, రవికుమార్ , కావలి ఆంజనేయులు, నాగరాజ్ , ఓబులేష్ , ఫయాజ్ , మల్లేష్, రాము, ఆశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నివాళి

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ కేంద్రంలో మిస్కిన్ నర్సింగ్ రావు, ఆడేం రాకేష్ పార్థివ దేహాలకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పూలమాలలతో నివాళిలర్పించి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి కుటుంబాలకు అండగా ఉంటానని ఆయన హామీ నిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్ గౌడ్ , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారి మరమ్మతులు చేయాలని నిరసన

ప్రజాపక్షం / మద్దూరు : చద్దూరు మండలం నుండి ఖజిపూర్ మీదుగా కానుకుర్తి కర్ణాటక వెళ్లే ప్రధాన రహదారి మూలమలుపులు ఈ మధ్య కాలంలో వర్షాలుపడటంతో రోడ్డు ఇరువైపులా పీసుమక్కలు పెరగడంతో ఒక బండి పోతుంటే ఇంకో బండికి దారి లేనట్లుగా తయారైంది. మూలమలుపుల దగ్గర ఎదురెదురుగా వచ్చే బండ్లు కనిపియ్యకపోవడంతో ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. కర్ణాటకకు వెళ్లాలంటే అతి తక్కువ కిలో మీటర్‌తో కూడిన ఈ రహదారి డబుల్ రోడ్డు చేయాలని ఈ రోడ్డులో విద్యార్థులు ప్రజలు ఎక్కువగా ప్రయాణికులు తిరుగుతూ ఉంటారు. వెంటనే డబుల్ రోడ్డు చేపట్టి తక్షణమే ఈ చెట్లను పీచుముక్కలను ఇరువైపులా తీయించి ప్రమాదాలు కాకుండా కాపాడాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రోడ్డుపై నిరసన తెలియజేస్తూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఆశోక్ , డివైఫ్ఐ జిల్లా కార్యదర్శి మహమ్మద్ అలీ, ఖాజీపురం గ్రామ యువ నాయకుడు సాయిలు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

# 17న ఎఎన్ఎంల రెండో మహాసభలు

### జయప్రదం చేయండి : ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** రెండో ఎఎన్ఎంల మహాసభలను జయప్రదం చేయాలని ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ తాలుకా కేంద్రంలో రెండో ఎఎన్ఎంల కొల్లాపూర్ తాలుకా నాయకురాలు కె.మంజుల అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ పాల్గొని మాట్లాడుతూ ఈనెల 17న రంగారెడ్డిజిల్లా శంషాబాద్ మండలం ఎలైట్‌హోటల్‌నందు జరిగే తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ హెల్త్‌మిషన్‌నందు పనిచేస్తున్న రెండో ఎఎన్ఎంల ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నేషనల్‌హెల్త్ మిషన్‌నందు గత 17 సంవత్సరాలుగా రెండో

ఎఎన్ఎంగా పనిచేస్తున్నవారందరిని రెగ్యులర్‌చేయాలని డిమాండ్‌చేశారు. గత 17 సంవత్సరాల నుండి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఏప్రభుత్వం తమను కనికరించలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికి తమ జీవితాల్లో మాత్రం ఎటువంటిమార్పు రాలేదన్నారు. ప్రజల ఆరోగ్యం గురించి పనిచేసేవారికి ఎటువంటి హెల్త్‌కార్డు లేదన్నారు. కాంట్రాక్టుపద్ధతిలో నెలకు రూ.52వేలు రావాల్సిన వారికి నెలకు రూ.27వేలు వస్తుందన్నారు. ఆవచ్చే రూ.27వేలలో రికార్డులకు ఉద్యోగంలోని ఇతర ఖర్చులకు రూ.10వేలకు పైగా వెచ్చించాల్సి వస్తుందన్నారు. కనీసం హెల్త్‌కార్డుకూడా ఇవ్వలేదన్నారు. కావున ఈనెల 17న రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎలైట్‌హోటల్‌నందు జరిగే రాష్ట్ర ప్రథమ మహాసభలో భవిష్యత్తుపోరాటాల గురించి చర్చించి కార్యక్రమాల రూపకల్పన చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియూసి నాగర్‌కర్నూల్ జిల్లా 2వ ఎఎన్ఎంల యూనియన్ నాయకులు కె.మంజుల, యశోద, శ్వేత, వసుంధర, నిర్మల, పుష్ప, సరళ పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

**ప్రజాపక్షం/నారాయణపేట ప్రతినిధి :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు, వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్ మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికారాదు అని సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. వాహనదారులు మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదానికి గురై అవకాశం ఉంటుందని జాగ్రత్తగా వచ్చే వారి వాహనాలకు కూడా రోడ్డు ప్రమాదాలు జరిగా అవకాశం ఉంటుందని డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో దొరికితే జరిమానాతో పాటు జైలుకు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఆటోలలో ఎక్కువ మంది పిల్లలను , కూలీలను ఎక్కించుకోరాదని, ఆటోలో సీట్ పర్మిట్ ఉన్నంత వరకే ప్యాసింజర్ ఎక్కించుకోవాలన్నారు. డ్రైవింగ్ చేస్తూ సెల్ఫోన్ మాట్లాడరాదని, రాష్ డ్రైవింగ్ చేయరాదని, పరిమిత వేగంలో వాహనాలు నడపాలని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీస్ వారికి సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు సంతోష్ , ఆంజనేయులు, వాహనదారులు పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయిలో కలెక్టర్ సర్వే పర్యవేక్షణ

**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** నారాయణపేట మండలంలోని సింగారం గ్రామంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను శనివారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పర్యవేక్షించారు. గ్రామంలోని ఓ ఇంటి వద్ద జరుగుతున్న సర్వేను ఆమె దగ్గరుండి పరిశీలించారు. కలెక్టర్ సమక్షంలోనే ఎన్యుమరేటర్ సర్వే ఫారంలో కుటుంబ సభ్యుల వివరాలను ఎన్యుమరేటర్ నమోదు చేశాడు. సర్వే ఫారంలో ఏమైనా అనుమానాలు వస్తే నివృత్తి చేసుకొని పూర్తి వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఒక సర్వే ఫారం నింపే వరకు ఎంత సమయం పడుతుందని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఒక సర్వే ఫారం నింపి పూర్తి చేసే వరకు 20 నుంచి 30 నిమిషాల సమయం పడుతుందని సర్వే సిబ్బంది కలెక్టర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వినోద్ , సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

# విజయవంతంగా 'నూరేండ్ల నా ఊరు' గాయకుల ఎంపిక

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : శనివారం మహబూబ్‌నగర్ పట్టణ కేంద్రంలోని రెడ్ క్రాస్ బిల్డింగ్ లో జరిగిన నూరేండ్ల నా ఊరు గేయ కావ్యానికి గాయకుల ఎంపిక కార్యక్రమంలో సుమారు 140 మంది ఉమ్మడి జిల్లా కళాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 100 సంవత్సరాల పూర్వం సహజమైన పల్లె జీవన విధానం సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను కళ్లకు కట్టినట్టుగా రచించి, రాబోయే తరాలకు ఈ విలువైన చరిత్రను అందించాలనే ఉద్దేశంతో 243 చరణాల గేయకవ్యాన్ని 243 మంది మట్టిలో మాణిక్యలాంటి గొంతులను ఏరి పాడించి జానపద కళా రంగంలో నూతన ఒరవడి సృష్టించేందుకు వినూత్నమైన ఆలోచనతో ఈ యొక్క బృహత్తర

మైన కార్యక్రమం చేపట్టడం జరిగింది. కొన్ని సంవత్సరాల తర్వాత జానపద కళా రంగంలో సంచలనం సృష్టిస్తున్న నూరేళ్ల నా ఊరు గేయ కావ్యం కళాకారులందర్నీ నూతన ఉత్తేజంతో ముంచెత్తుతుంది, జిల్లా జిల్లాలో కళాకారులు చూపుతున్న ఆదరణ సంతోషాన్ని కలిగిస్తుందని, కళాకారులు ఇదేవిధంగా ఐక్యతగా ఉంటూ కలలను ఆదరిస్తూ కళాకారులను గౌరవిస్తూ ఉంటే కళా రంగానికి ఎంతో బలం అనీ వరంగల్ శ్రీనివాస్ అన్నారు. చాలా రోజుల తర్వాత మొదటి సారి మహబూబ్నగర్ జిల్లాకు వచ్చిన కవి గాయాలకు సీని సంగీత దర్శకులు వరంగల్ శ్రీనివాస్ స్థానిక కళాకారులు శాలువా కప్పి గౌరవ సన్మానం అందించి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పాలమూరు జానపద కళాకారుడు జంగి రెడ్డి పెద్ద కుమారై స్ఫూర్తి కి సభలో మౌనం పాటించి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో రవిశంకర్, జయప్రకాష్, జక్కగోపాల్ , రేలారే ప్రసాద్, దప్పు స్వామి, గోల్కొండ బుచ్చన్న, జూపక శివ, గూడూరి మహేష్, కేశవులు, పరుశురాం, టంకర శ్రీనివాస్, నర్సింహా, సంతోష్, సువర్ణ, శైలజ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## మొదటి రోజు 520 కుటుంబాలు సర్వే

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటా కుటుంబ సర్వేకు మొదటి రోజు మండలంలో విశేష స్పందన లభించింది. మండలంలో మొత్తం 14 గ్రామ పంచాయతీలు ఉండగా అధికారులు 7047 ఇండ్లను సర్వే చేయటానికి గుర్తించినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. మొదటి రోజు 520 కుటుంబాలను సర్వే చేయడం జరిగిందని, కుటుంబ సర్వేకు ఎన్యుమరేటర్లు 53 మంది , సూపర్వైజర్లు ఐదుగురు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొంటున్నట్లు వివరించారు.

## సిఎంపై చర్యలకు వినతి

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** మాజీముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేకర్ రావుని రాజ్యాంగ పదవిలో ఉండి శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా అనుచిత వ్యాఖ్యలను చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం వనపర్తి పట్టణ కేంద్రంలో ఎస్పీ కార్యాలయంలో డిఎస్పీకి బిఆర్ఎస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. కేసిఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సిఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ యువత, విద్యార్థి నాయకులు అంబేద్కర్ చౌరస్తాలో దగ్ధం చేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు గట్టు యాదవ్ , బి. లక్ష్మ య్య, వాకిటి శ్రీధర్ , మార్కు ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది

**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి :** ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉర్దూ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తు కు బంగారు బాటలు వేసే అవకాశం కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే ఉంటుందని కాబట్టి వారి భవిష్యత్తు ను దృష్టిలో ఉంచుకుని మంచి లక్ష్యాలను సాధించడానికి మీరు తర్ఫీదు ఇవ్వాలని ఆయన సూచించారు. అనంతరంర ఉర్దూ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే ఉర్దూ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఖాజా కుతుబుద్ధిన్, షకీల్ అహ్మద్, అన్సారి, మమ్మద్ నజాముద్దీన్, అబ్దుల్ సలాం ఖాన్, నీయూం సిద్ధికి, ఎయంఓ దుంకుడు శ్రీనివాస్, గట్టు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తుంగభద్ర నుంచి తరలిపోతున్న ఇసుక

**ప్రజాపక్షం/ఉండవెల్లి :** తుంగభద్ర నది నుంచి సమీప గ్రామాల్లోని ట్రాక్టరుతో ఇసుక తరలిస్తున్న అధికారులు పట్టించుకోకపోవడంతో అర్ధరాత్రి వేళలో ఇసుక రావన్న జోరుగా సాగుతుంది. పోలీస్ రెవెన్యూ శాఖ అధికారులు కు నెలల మామూలు ఇవ్వడంతో పట్టించుకోవడం లేదని విమర్శనలు ఉన్నాయి. ఉండవెల్లి మండల పరిధిలోని జాతీయ రహదారికి 44వ సమీపంలోనూ రియల్ ఎస్టేట్ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. బిల్డింగ్ నిర్మాణాలు కోసం ఇసుక అవసరం ఎంతో ఉంది ఎటువంటి అనుమతి లేకుండానే రాత్రి వేళలో ఇసుకను తరలించుకొని దంపు చేసుకొని వివిధ రకాల పనులకు ఉపయోగించుకుంటున్నారు. రియల్ ఎస్టేట్ దందాల్లో ఇండ్ల నిర్మాణాలు అపార్ట్మెంట్ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నది తీరం వెంబడి ఇసుక తరలించేందుకు అనువుగా ఏర్పడింది ఇప్పటికైనా సంబంధం అధికారులు చర్యలు తీసుకొని అక్రమంగా ఇసుకను తరలించకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉన్నది.

# గౌడ కమ్యూనిటీ భవన నిర్మాణానికి సహకరిస్తా

### ఎమ్మెల్యే యెన్నం

**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి :** గౌడ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి సహకరిస్తానని మమబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ పురపాలక పరిధిలోని మయూరి నర్సరీ లో ఏర్పాటు చేసిన కార్తీక మాస వన భోజన మహోత్సవం కార్యక్రమానికి ఆయన సంఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన మహబూబ్ నగర్ లో కాటమయ్య దేవాలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, చాలా సంతోషంగా ఉందని, ఆయన చెప్పారు. దేవాలయం అనేది ప్రజలందరికి

సంబంధించినదని, దేవాలయాన్ని అద్భుతంగా నిర్మించుకొందాం అని ఆయన తెలిపారు. దేవాలయం ఏ ఒక్కరికో సంబంధించినది కాదని, ప్రజలందరికి సంబంధించినదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఇంటి గడప నుంచి కూడా ఆ దేవాలయానికి వచ్చి పూజలు నిర్వహించాలి అలాంటి అప్పుడే, ఆ దేవాలయానికి శక్తి పెరుగుతుందని ప్రతిష్ట కూడా పెరుగుతుందని ఆయన అన్నారు. అలాగే కాటమయ్య మనందరిపై చల్లని చూపు చూడాలని ఆయన ఆకాంక్షించారు. కాటమయ్య దేవాలయం ఆవరణలో అనేక దైవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను అలరించాయి. అనంతరం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక మాస వన భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, లక్ష్మ ణ్ గౌడ్, గౌడ సంఘం సభ్యులు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## సర్వేకు ప్రజలు సహకరించాలి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** తెలంగాణప్రభుత్వం ప్రవేశపెట్టిన సామాజిక ఆర్థిక విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వే సమగ్ర ఇంటింటి కుటుంబసర్వేలో భాగంగా పట్టణంలో శనివారం ప్రారంభమైనటువంటి ఇంటింటిసర్వేను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రత్యేకాధికారి రవి పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన ప్రజలతోమాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమగ్ర ఇంటింటి కుటుంబసర్వేకు సహకరించాలన్నారు. అన్నివివరాలు అడిగి తెలుసుకొని సర్వేఫామ్‌నందు పొందుపర్చాలని ఎన్యుమరేటర్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ శ్రీనివాసులు, తహసీల్దార్ ఇబ్రహీం, పురకమీషనర్ మహ్మద్ షేక్, పురసిబ్బంది పాల్గొన్నారు.

## కచ్చితమైన సమాచారం సేకరణ

### ఎంపిడిఓ వెంకటరాములు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** సమగ్రకుటుంబసర్వేలో కచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని ఎంపిడిఓ వెంకటరాములు,ఎంఈవో శంకర్‌నాయక్‌లు ఎన్యుమరేటర్లను ఆదేశించారు. శనివారం కల్వకుర్తి ఎంపిడిఓ కార్యాలయ సమావేశమందిరంలో ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేకొరకు జారీచేసినబుక్‌లెట్‌లో మొత్తం 56 అంశాలున్నాయని ఎలాంటి అనుమానాలు, సందేహాలకు తావులేకుండా ప్రజలనుండి కచ్చితమైన సమాచార సేకరణతో నమోదు చేయాలని సూచించారు. సమగ్ర కుటుంబసర్వేలోభాగంగా సామాజిక ఆర్థిక రాజకీయ ఉపాధి ఉద్యోగ అంశాలను పక్కాగా స్వీకరించాలన్నారు. అనంతరం ఎన్యుమరేటర్లకు కుటుంబసర్వే ఫారంలను అందజేశారు. కల్వకుర్తి మండలపరిధిలోని తర్నికల్ గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఎసిఎల్‌బి దేవసహాయం ఎంపిడిఓ కలిసి పరిశీలించారు.కార్యక్రమంలో ఎన్యుమరేటర్‌లు, ఆయాశాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

## మాజీ ఉపసర్పంచ్‌కు లక్ష్మారెడ్డి పరామర్శ

**ప్రజాపక్షం/జడ్చర్ల :** ఉరుకొండ మండలం రాచలపల్లి మాజీ ఉప సర్పంచ్ పరుశురాములు తండ్రి 10 రోజుల క్రితం మరణించడం జరిగింది. వారి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మారెడ్డి మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య పార్టీ నాయకులు, గిరి నాయక్, జంగయ్య, వీరారెడ్డి, శ్రీనువాసు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ

**ప్రజాపక్షం/జడ్చర్ల :** ఎమ్‌జేపిటిసి బాలికల పాఠశాలలో శనివారం జిపి మధుమిత పుట్టిన రోజు సందర్భంగా జనతా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పిల్లలకు నోట్ బుక్ అండ్ పెన్నుల పంపిణీ చేయడం జరిగింది. జనతా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు జహంగీర్ పాషా విద్యార్థులను ఉదేశించి మాట్లాడుతూ విద్య ప్రమాణాలు ముందుకు పోవడానికి కారణము ఏపీజే కలామ్ అని ఈ సందర్భంగా విద్యార్థులు నూతన విధానం టెక్నాలజీ విద్య పైన మాక్కువ చూపాలని, సామాజికంగా విద్య విలువ చెప్పలేనిది వెలకట్టలేనిది అని ఆయన కొనియాడారు. చివరిగా విద్య దానం మహా దానంగా ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నావారు ఉపాధ్యాయురాలు శ్రీలత, సొసైటీ అధ్యక్షులు జహంగీర్ పాషా, కో ఆర్డినేటర్ షారుఖ్ ఖాన్, బల బాలికలు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో బాలుడు మృతి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** గుడిసెలో విద్యుత్‌బల్బ్ ఆన్‌చేస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురైబాలుడు మృతిచెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఐతోల్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికిచెందిన ఎల్లగౌడ్ సుజాత దంపతుల కుమారుడు నిశాంత్‌గౌడ్(8) మూడో తరగతి చదువుతున్నాడు. శనివారం సెలవుకావడంతో తమ గుడిసెలో విద్యుత్‌బల్బ్ ఆన్‌చేస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. దీంతో అక్కడికక్కడే తల్లడిల్లుతూ కుప్పకూలాడు. స్థానికులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు తెలిపారు.

## ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లాలో చెట్టుకు ఉరేసుకొని మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. నాగర్‌కర్నూల్ మండలంలోని మంతటి గ్రామ శివారులో కాల్వదగ్గర చెట్టుకు ఉరివేసుకొని జగదీష్ అనేయువకుడు మృతి చెందారు. ఊర్కొండపేటకు చెందిన యువకుడిగా సమాచారం. ఈఘటనకు సంబంధించిన పూర్తివివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



## గుట్కా ప్యాకెట్లు పట్టివేత

**ప్రజాపక్షం / మక్తల్ రూరల్ :** కర్ణాటక రాష్ట్రం నుండి నిషేధిత గుట్కా ప్యాకెట్లను అక్రమంగా తీసుకువచ్చి దొంగతనంగా విక్రయిస్తున్న గుట్కా పాన్ మసాలా మిరాజ్‌లను మక్తల్ పోలీసుల పట్టుకొని స్వాదీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి మాట్లాడుతూ మక్తల్ మండల పరిధిలోని జక్లెర్ గ్రామంలో కృష్ణమూర్తి శెట్టి కిరణా షాప్‌లో విక్రయిస్తుండగా పట్టుకోవడం జరిగిందని, వీటి విలువ 28వేలు ఉంటుందని అన్నారు. పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జర

# పంచాయతీలకు నిధులేవి?

### పెండింగ్ బిల్లులు చెల్లించాలి
### జాతీయ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షులు
### యలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్

**ప్రజాపక్షం/ఖమ్మం:** గ్రామ పంచాయతీలకు నిధులు, విధులు, అధికారాలు ఇవ్వాలని జాతీయ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షులు యలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు రాజ్యాంగం ప్రకారం ఇవ్వాల్సిన నిధులు, విధులు, అధికారాలను తక్షణమే బదలాయించాలన్నారు. శనివారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో పేర్కొన్న 73, 74 రాజ్యాంగ సవరణ చట్టం, ఆర్టికల్ 243 జిలో పేర్కొన్న 29 అంశాలను స్థానిక సంస్థలకు బదిలీ చేయాలన్నారు. రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటు చేసిన అధికారాలను సైతం బదలాయించేందుకు కొర్రీలు పెడుతున్నారని ఆరోపించారు. భారతదేశంలోని 2.30 లక్షల గ్రామాలకు 90 కోట్ల గ్రామీణ ప్రజల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని జాతీయ పంచాయతీరాజ్ చాంబర్ పోరాడుతుందన్నారు. దేశ వ్యాప్తంగా పర్యటించి స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయడంతో పాటు విధులు, నిధులు సాంధించడం జరుగుతుందన్నారు.రాష్ట్రంలో పంచాయతీలకు పెండింగ్ బిల్లులను చెల్లించాలని పంచాయతీరాజ్ చాంబర్ బాధ్యులు డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో చాంబర్ బాధ్యులు నరేందర్, చింతల సత్యనారాయణరెడ్డి, బాదెపల్లి సిద్ధార్థ, ప్రతాపరెడ్డి, అశోక్‌రావు, బెల్లం శ్రీను, లక్ష్మి, ముత్యాలరావు, లోడిగ వెంకన్న, శ్రీశైలం, సామినేని హరిప్రసాద్, లెనిన్ పాల్గొన్నారు.

## గిరిజన పాఠశాలలో వసతులు కరువు

**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ మండలం సర్వారంలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, మంచినీరు తాగడానికి ఆర్వో ప్లాంట్ బాగు చేయించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వరక అజిత్ కోరారు. తరగతి గదులలో కిటికీలు డార్మెంటరీలో తలుపులు పాడైపోయి ఉన్నాయని, ఆశ్రమ పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని, ఇలాంటి వసతి గృహాన్ని అభివృద్ధి వైపు తీసుకుని వెళ్లి గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా పై అధికారులు చర్యలు తీసుకోవాలని అజిత్ అన్నారు. అదే విధంగా కొత్తగూడెం నియోజకవర్గ కేంద్రానికి దగ్గర ఆనుకొని ఉన్న ఏకైక ఆశ్రమ పాఠశాల అనేక సమస్యలతో సతమతమవుతువున్నా మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు.ఉన్నతాధికారులు సందర్శించి సమస్యలు పరిష్కరించాలని అజిత్ డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, జిల్లా సహాయ కార్యదర్శి సృజన్ పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం అందించేందుకే..

**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలోని రావినూతల, ముష్టికుంట్ల, బోనకల్ గ్రామాల్లో ముమ్మరంగా సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమం విజయవంతంగా శనివారం నిర్వహించారు. తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్ మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వేలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. తెలంగాణ ప్రజానీకానికి రానున్న రోజుల్లో అభివృద్ధి, సంక్షేమం మరింతగా అందేందుకే ఈ సమగ్ర కుటుంబ సర్వే అని అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ఎన్యుమరేటర్స్‌కు ఆధార్, రేషన్‌కార్డు, భూమి పట్టాదారు నంబరు, అప్పులు, ఆదాయం, ఇతరత్ర విషయాలను వాస్తవమైన విషయాలను తెలపాలని కోరారు. ఎంపిఓ వివిఎస్ శాస్త్రి,ఆర్ఐ గుగులోత్ లక్ష్మణ్, ఎన్యుమరేటర్స్ పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ సద్వినియోగం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఓటరు జాబితా ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాలేరు డివిజన్ ఎన్నికల అధికారి రాజేశ్వరి సూచించారు. శనివారం మండలం లోని సింగారెడ్డిపాలెం, నేలకొండపల్లి లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. బీఎల్‌వో లకు పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడారు...ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శని, ఆదివారలలో ప్రత్యేక కార్యక్రమంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హులైన వారు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటింటి సర్వే తరువాత ప్రకటించిన ముసాయిదా జాబితా లో అభ్యంతరాలు ఉంటే బీఎల్‌వో లకు తెలియజేయాలని సూచించారు.నేలకొండపల్లి తహశీల్దార్ మానిక్‌రావ్, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆలస్యం మధుసూధన్‌రావు పాల్గొన్నారు.

## రైతుల సమస్య పరిష్కారం

**ప్రజాపక్షం/పెనుబల్లి:** గ్రీన్ ఫీల్డ్ హైవే బ్రిడ్జ్ వలన రైతులకు ఏర్పడిన సమస్యను పరిష్కారం చేయాలని చేస్తున్న ధర్నాలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని రైతుల సమస్యను పరిష్క రించారు. శనివారం పెనుబల్లి మండలం పాత కారాయిగూడెంలో గ్రీన్ ఫీల్డ్ హైవే బ్రిడ్జ్ వలన రైతులు తమ పొలాల్లోకి వెళ్లటానికి ఇబ్బందులు ఏర్పడిన కారణంగా సమస్య పరిష్కారం కోసం రైతులు ధర్నా చేశారు. రైతుల సమస్య తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ రైతులతో పాటు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రీన్ ఫీల్డ్ అధికారులతో ఫోన్ ద్వారామాట్లాడి రైతుల సమస్యను వివరించి సమస్య పరిష్కరించారు. పెనుబల్లి మండలకాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వంకాయలు పాటి వెంకటేశ్వరావు, కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజబోయన కోటేశ్వరరావు, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

## ఖోఖో క్రీడలు ప్రారంభం

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులో శనివారం 68వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్ 17 సంవత్సరాల బాలికల ఖో ఖో పోటీలు శనివారం ఉమ్మడి పది జిల్లాల పరిధిలో 120 మంది క్రీడాకారులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి క్రీడల పథకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం మినీ స్టేడియం నందు ఈ పోటీలు ఘనంగా, వైభవంగా ప్రారంభమయ్యాయి. క్రీడల సమాఖ్య మరియు ఖమ్మం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ క్రీడలో జరుగుతున్నవి.ఎం. శివరాం సౌకర్యాలను పరిశీలించారు. జాతీయ స్థాయి పోటీలు డిసెంబర్ 5 నుంచి 8 వరకు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో జరుగుతాయని పేర్కొన్నారు. ఎస్.జి.ఎఫ్ కార్యదర్శి నరసింహమూర్తి, సి.హెచ్ హరి, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్, ఎస్కే ముస్తఫా, కార్యదర్శి బీమా, పసుపులేటి వీరరాఘవయ్య ఈ క్రీడలు నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. శ్రీదేవి, కవిత, రమాదేవి, నరసయ్య, రాధాకృష్ణ, కృష్ణారావు, రామారావు, ప్రసాద్, పలు జిల్లాల నుంచి కోచ్ మేనేజర్లు హాజరయ్యారు.

## తొలిరోజు స్వచ్ఛందంగా సహకారం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** సమగ్ర సర్వే కు మండల ప్రజలు స్వచ్ఛదంగా సహకరిస్తున్నారు. శనివారం సర్వే ప్రారంభించారు. మండలం లోని 32 గ్రామపంచాయతీలకు గాను, 20, 270 ఇళ్ల ను సర్వే చేయాల్సి ఉంది. మొత్తం 139 ఎన్యుమరేటర్స్,13 మంది సూపర్‌వైజర్లు సర్వే ను పరిశీలిస్తున్నారు. తొలి రోజు స్వచ్ఛదంగా ముందుకు వచ్చి వివరాలు అందిస్తున్నారు. తహశీల్దార్ జె.మానిక్‌రావ్, ఎంపీడీఓ యర్రయ్య పరిశీలించారు. అనాసాగారాం, నేలకొండపల్లి, నాచేపల్లి బ్లాక్‌కు చెందిన సూపర్ వైజర్ టి.గురవయ్య మాట్లాడారు.

## వైరా మున్సిపాలిటీ అభివృద్ధిపై సమీక్ష

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ అభివృద్ధిపై శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అఖిలపక్ష పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో అభివృద్ధిపై చేయాల్సిన పనులు వాటితో చర్చించడంతో పాటు అఖిలపక్ష నాయకుల సూచన స్థలాలు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తీసుకున్నారు. జిల్లా కాగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, బొర్రారాజశేఖర్, మున్సిపాల్ చైర్మన్ జైపాల్, టిడిపి వైరా నియోజకవర్గ ఇంచార్జి చెరుకూరి చలపతి, టిడిపి మండల అధ్యక్షులు కిలారి సురేందర్, సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, న్యూడెమోక్రసీ యలదండి బాబు, వైరా మున్సిపాలిటీ పాలకమండలి సభ్యులు, మున్సిపాలిటీ అధికారులు, కమీషనర్ చింతా వేణు, వైరా ఎమ్మార్వో శ్రీనివాసరావు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎన్.సాగర్, మున్సిపాలిటీ డిఈ నరేష్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

## 'తిరుమలాయపాలెం'లో ముమ్మరంగా సాగుతున్న కుటుంబ సర్వే

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** కుటుంబ సర్వేను పకడ్బందీగా మండలంలో అధికారులు నిర్వహిస్తున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టర్ ముజామిల్ ఖాన్ సూచనలతో అధికారులు ముందుకు సాగు తున్నారు. పాలేరు నియోజకవర్గ డిఆర్డిఏ అదనపు పిడి నూరుద్దీన్, మండల తహసిల్దార్ పి.వి రామకృష్ణ, ఎంపీడీవో ఎస్కే సిలార్ సాహెబ్, ఎంపీఓ సూర్యనారాయణ, పర్యవేక్షణలో మొత్తం 40 గ్రామ్ పంచాయతీలో అన్ని గ్రామాల్లో కలిపి 184 బ్లాక్ లు గా విభజించి 148 మంది ఇన్విజిలేటర్లు 17 మంది సూపర్వైజర్లు సర్వేలోనిమగ్నమయ్యారు.రెవెన్యూ,పంచాయతీరాజ్‌మండలఅధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఐకెపి సీసీలు అంగన్వాడీ టీచర్లు సర్వేలో నిమగ్నమయ్యారు. క్షుణ్ణంగా వివరాలను నమోదు చేసుకుంటున్నారని తహసిల్దార్ పి.వి రామకృష్ణ తెలిపారు. రేపటినుండి గ్రామాల్లో బిఎల్వోలు కూడా కొత్త ఓట్లను మార్పులు చేర్పులు, మరణించిన వారి వివరాలు సేకరిస్తారని తెలిపారు. తహాసిల్దార్ పి వి రామకృష్ణ, ఎంపీడీవో సిలార్ సాహెబ్, ఎంపీఓ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షులు అంజి, ప్రణీత, సంధ్యారాణి, సుజాత, భవ్య, దమ్మాయిగూడెం కార్యదర్శి రమేష్, జల్లేపల్లి కార్యదర్శి రమేష్, పిండిప్రోలు కార్యదర్శి పి.రాము ఉన్నారు.

## వివరాల నమోదులో జాగ్రత్త

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని అంబేద్కర్‌నగర్‌లో సమగ్ర సర్వేను శనివా రం ఆర్డిఓ రాజేంద్ర పరిశీలించారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఎలాంటి తప్పులు లేకుండా స మాచార సేకరణ చేసి పూర్తిచేయాలని సర్వే సిబ్బందికి సూచించారు. ఎలాంటి దోషాలు లేకుండా నమోదు చేసుకోవాలని తెలిపారు. తహశీల్దార్ పులి సాంబశివుడుతో పాటు సూపర్వైజర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారుల సమస్యలు పరిష్కరించండి
### మంత్రి పొంగులేటికి ఎఇఒల విజ్ఞప్తి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలో పనిచేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలను పరిష్కరించాలని ఎఇఒలు శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి విజ్ఞప్తి చేశారు. క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 65 మంది ఏఈవోలను అకారణంగా సస్పెండ్ చేశారని, యూనియన్లతో జరిగిన చర్చల్లో తిరిగి విధుల్లోకి తీసుకుంటామని, సస్పెన్షన్ ఉత్తర్వులను ఎత్తివేస్తామని చెప్పినప్పటికీ ఇప్పటికీ ఆ పని చేయలేదని మంత్రికి వివరించారు. కొన్ని జిల్లాల్లో కొన్ని రోజులు మాత్రమే వేతనం ఇచ్చారని పూర్తి వేతనం ఇవ్వలేదని తెలిపారు. డిజిటల్ క్రాప్ సర్వేలో అన్ని రాష్ట్రాల్లో అమలు పరుస్తున్న విధానాన్ని మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని కోరారు. అభ్యర్థనకు స్పందించిన మంత్రి పొంగులేటి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే దిశగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం నాయకులు షేక్ నాగులమీరా, శ్రీకాంత్, రవీందర్, బాలకృష్ణ, మహేష్, ఆదర్శ్, అయేషా, సుష్మా, కావ్య, జిష్ణు, శివ పాల్గొన్నారు.

# నమోదులో పొరపాట్లు చేయొద్దు
### ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

**ప్రజాపక్షం/ ఖమ్మంఅర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఖమ్మంజిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శనివారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఖమ్మం నగరంలోని సారధినగర్‌లో ఎన్యుమరేటర్లు, అధికారులతో ఇంటింటికి తిరుగుతూ సర్వే ప్రక్రియలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను అధికారులు విజయవంతంగా నిర్వహించాలన్నారు. సర్వే జరిగే సమయంలో సంబంధిత ప్రజలకు ముందుగానే తెలిసేలా ప్రచారం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సర్వేను సకాలంలో ప్రారంభించాలని ప్రతి కుటుంబం దగ్గర సంపూర్ణంగా వివరాలను ఎటువంటి పొరపాట్లు లేకుండా సేకరించాలని ప్రజల నుంచి సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సర్వే పట్ల ప్రజలకు ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కల్పించాలని ఈ సర్వే కారణంగా ఎటువంటి ప్రభుత్వ పథకాలు రద్దు కావని ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. జెడ్పి డిప్యూటీ సిఈవో నాగలక్ష్మి , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య పనుల పరిశీలన

**ఖమ్మంఅర్బన్ :** ఇంటింటికి చెత్త బండి సక్రమంగా వస్తుందా, చెత్త సేకరణ సజావుగా జరుగుతుందా, ఇంటి నుంచి తడి, పొడి చెత్తను విడివిడిగా ఇస్తున్నారా అంటూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జూబ్లీపుర, సారధినగర్ ప్రాంతాలలో తిరిగి అడిగి తెలుసుకున్నారు. శనివారం ఖమ్మం నగరంలోని జూబ్లీపుర, సారధినగర్ ప్రాంతాలలో చెత్త సేకరణ పనులను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకస్మికంగా పరిశీలించారు.రోజు వారి పనులలో నిమగ్నమైన మున్సిపల్ కార్మికలతో కలెక్టర్ ముచ్చటించారు. నగర కార్పోరేషన్‌లో పారిశుధ్య కార్మికుల నుంచి పైస్థాయి వరకు ప్రతి ఒక్కరూ ప్రణాళిక ప్రకారం పనిచేస్తేనే నగర పారిశుధ్య నిర్వహణ మెరుగవుతుందన్నారు. నగర కార్పోరేషన్‌లో కేటాయించిన పారిశుధ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాలని సూచించారు. కూడలి, కొన్ని ప్రదేశాలలో ప్రజలు చెత్త బయట వేస్తున్నారని అలాంటి ప్రదేశాలలో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోవడం, చెత్త వేయడం వల్ల దోమలు, కోతులతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా ఖాళీ ప్లాట్లను యజమానులు శుభ్రం చేయకుంటే ప్రభుత్వ స్థలంగా బోర్డులు పెట్టాలని ఆదేశించారు. విద్య, వైద్య వ్యవస్థలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందనికలెక్టరుతెలిపారు.

## ఒకే ఉపాధ్యాయుడు.. విద్యార్థుల్లేని పాఠశాల

### పడిపోతున్న ప్రాథమిక పాఠశాలల ఎన్‌రోల్‌మెంట్

**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని మల్లేపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో "ఒంటి గుడిసె తండా" పిఎస్ స్కూల్లో విద్యార్థులు లేక ఒకే ఒక ఉపాధ్యాయుడు తో ప్రభుత్వ పాఠశాల నిర్వహించబడుతుంది. ఇదే విషయాన్ని ఉపాధ్యాయుడు కృష్ణారావు తో ప్రజాపక్షం విలేకరి పాఠశాల పరిస్థితిని తనతో పంచుకోగా దాదాపు ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుండి విద్యార్థులు లేక అలానే కొనసాగుతుందని నా బాధ్యతగా నేను నాకు ఇచ్చిన స్కూలుకి టైం ప్రకారం వస్తూ వెళ్తున్నానని ఇంకా మండలంలోని ఏదైనా స్కూల్లో పని నా పై అధికారులు చెబితే వెళ్లి అవసరమైన పాఠశాలకు వెళ్లి విధులు నిర్వహిస్తూ ఉంటున్నానని ఇంకా అవసరం లేనప్పుడు మళ్లీ తిరిగి ఇదే పాఠశాలకు వస్తూ వెళ్తుంటున్నానని తెలిపారు.

### ఎంఇఒ వీరస్వామి వివరణ

గత కొద్ది రోజుల క్రితం జరిగిన నూతన డిఎస్సీ ఉపాధ్యాయులను ప్రభుత్వం తీసుకుంటున్న క్రమంలో ముందుగా ప్రమోషన్స్ ప్రకారం ఉన్న ఉపాధ్యాయులు వేరే చోటుకు వెళ్లాల్సి వచ్చిందని అందులో భాగంగా ఒంటి గుడిసె స్కూల్లో ఉన్న టీచర్ ప్రమోషన్ పై వేరే స్కూలుకు వెళ్లగా అక్కడ ఉన్న ఇద్దరు ముగ్గురు విద్యార్థులు ఇంకో టీచర్ పోస్టు వచ్చేలోపు విద్యార్థులు ఉండకుండా పోయారని తెలిపారు. అయితే ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయున్ని ఈ నవంబర్ ,డిసెంబర్ నెల వరకు టీచర్లు మండలంలోని అక్కడక్కడ పాఠశాలలో సెలవులపై వెళ్తున్న నేపథ్యంలో ఆ టైంలో ఒంటి గుడిసె స్కూలు ఉపాధ్యాయుని సేవలను వాడుకుంటున్నామని ఇటీవల కాలంలో విద్యార్థులు ఎన్రోల్మెంట్ బాగా తగ్గిందని అనేక పాఠశాలలో కూడా విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చిందని తెలిపారు. ఒంటి గుడిసె స్కూల్లో ఒకే ఉపాధ్యాయుడు ఉండటం పిల్లలు లేకపోవడం నిజమైన దేనని తెలిపారు.

## కచ్చితమైన సమాచారం నమోదుకు ప్రాధాన్యత

**ప్రజాపక్షం/ ఖమ్మంఅర్బన్ :** హౌజ్ లిస్టింగ్ పూర్తి చేసుకుని శనివారం నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. శనివారం నుండి ప్రారంభమైన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, సిఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయం నుండి సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌కుకలెక్టర్ కార్యాలయం నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో మాట్లాడుతూ సర్వే కొరకు జారీ చేసిన బుక్‌లెట్‌లోని మొత్తం అంశాలపై ఎలాంటి అనుమానాలు, సందేహాలకు తావు లేకుండా ప్రజల నుండి ఖచ్చితమైన సమాచార సేకరణతో నమోదు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియను సూపర్ వైజర్లు, మండల ప్రత్యేకాధికారులు, నియోజక వర్గ బాధ్యులు సూపర్ చెక్ చేయాలని నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే ప్రక్రియను నిబద్ధతతో, నిష్పాక్షపాతంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలన్నారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించి సమగ్ర సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎలాంటి అపోహలు లేకుండా ప్రజలు ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలని సూచించారు. సిపివో ఎ. శ్రీనివాస్, జెడ్పి డిప్యూటీ సిఈవో నాగలక్ష్మి , అదనపు డిఆర్‌డివో నూరోద్దిన్, ఖమ్మండివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు పాల్గొన్నారు.

## సత్యనారాయణరెడ్డి కుటుంబానికి భాగం పరామర్శ



**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన మమత హాస్పటల్స్ యూడిసి చిట్టా సత్యనారాయణరెడ్డి కుటుంబాన్ని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ శనివారం పరామర్శించారు. ఇటీవల సత్యనారాయణరెడ్డి మాతృమూర్తి చిట్టా మంగమ్మ మృతి చెందారు. ఆమె దశదిన కర్మను స్వగృహంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుల కొండపర్తి గోవిందరావులో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాగం, పోటు మాట్లాడుతూ..చిట్టా మంగమ్మ వామపక్ష వాది అని, నాటి నుండి తుదిశ్వాస విడిచే వరకు వామపక్ష వాది గానే జీవించారని కొనియాడారు. కష్టజీవులకు, పేదలకు అండగా నిలిచేది ఒక కమ్యూనిస్టులు మాత్రమేనని అన్నారు.అనంతరం సత్యనారాయణరెడ్డి సోదరులు చిట్టా కోటిరెడ్డి, చిట్టా సైదిరెడ్డి, చిట్టా లక్ష్మారెడ్డి, చిట్టా బాబురెడ్డి, చిట్టా వెంకటరెడ్డి, చిట్టా రామిరెడ్డిలను పరామర్శించారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, టిఆర్ఎస్ కార్మిక శాఖ మండల అధ్యక్షులు బంధం నాగేశ్వరరావు, శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, బోయినపల్లి బసవయ్య, కొంగర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీపై వాయిదాల పర్వం!

### తొమ్మిది డిసెంబరన్న మంత్రి తుమ్మల ఆఖరుకు అంటున్న పొంగులేటి ఆందోళనలో రైతన్నలు

**ప్రజాపక్షం/ఖమ్మం:**రుణమాఫీపై రైతుల్లో ఆందోళన నెలకొనగా అధికార కేంద్రాల నుంచి వాయిదాల పర్వం కొనసాగుతుంది. డిసెంబరు 15 నాటికే రుణమాఫీ పూర్తి చేస్తామన్న ప్రభుత్వం అది పూర్తి చేయకపోగా ఇప్పుడు వాయిదాలు వేయడం పలు ఆలోచనలకు తావిస్తుంది. రూ.31 వేల కోట్ల విలువైన రైతు రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. రెండు లక్షల లోపు ఉన్న రుణాలను మాఫీ చేస్తామని తెలిపిన కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత పార్లమెంటు ఎన్నికల సమయంలో ఆగస్టు 15 నాటికి రుణమాఫీ చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. రెండు లక్షల లోపు రుణాలకు సంబంధించి రూ.18వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయగా అందులోను గందరగోళం నెలకొంది. 60శాతానికి మించి రుణమాఫీ జరగలేదని వివిధ కారణాల వల్ల రుణమాఫీ జరగ లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డులు లేకపోవడం, రెవెన్యూ అధికారుల కుటుంబ ధృవీకరణ జరగకపోవడం తదితర కారణాలతో రెండు లక్షల లోపు ఉన్న రైతుల రుణాల మాఫీ నిలిచి పోయింది. రెండు లక్షలు పైబడిన రైతులకు సంబంధించి రెండు లక్షలను రైతుల ఖాతాలలో ప్రభుత్వం జమ చేస్తుందని మిగిలిన పైకాన్ని రైతులు చెల్లించాలని ప్రభుత్వం నిబంధన విధించింది. కాని ఈ రెండు లక్షలు పైబడిన రైతు రుణాల మాఫీ విషయంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఆగస్టు 15 తర్వాత 15 రోజుల్లో మిగిలిన మొత్తాన్ని రైతుల ఖాతాలలో జమ చేస్తామన్న ప్రభుత్వం క్రమేపి వాయిదా వేస్తూ వచ్చింది. ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రుణమాఫీకి సంబంధించి ఒక ప్రకటన విడుదల చేస్తూ డిసెంబరు తొమ్మిది సోనియా గాంధీ పుట్టిన రోజు నాటికి రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేస్

# మహానగరి

## శబరిమలైకి అద్దెకు ఆర్టీసి బస్సులు

### ఐదుగురికి ఉచితం

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** శబరిమలై దర్శనానికి వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం అద్దె ప్రాతిపదికన కుషాయిగూడ ఆర్టీసీ డిపో ప్రత్యేక లక్జరీ బస్సులను ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని డిపో మేనేజర్ మహేష్‌కుమార్ తెలిపారు. గత ఏడాది కంటె ఈ సారి కిలో మీటరుకు ఆరు రూపాయలు తగ్గించిందని, 36 సీట్ల బస్సుకు గాను కిలో మీటరుకు రూ.59 వసూలు చేయనున్నామన్నారు. ఒక్కో బస్సును తీసుకొన్న వారికి ఆ బస్సులో వంట చేసేందుకు తీసుకొని వెళ్లే ఇద్దరు వంట వాళ్లకు, ఒక అటెండెంట్, ఇద్దరు మణికంఠ స్వాములకు మొత్తంగా ఐదుగురికి ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నా రు.

## ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డి చొరవ.... జీవన్గీ రైతుల ఖాతాల్లో డబ్బులు జమ

**ప్రజాపక్షం/తాండూరుః** రోడ్డు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన జీవన్గీ గ్రామానికి చెందిన భూ నిర్వాసితుల ఖాతాలలో డబ్బులు జమ జేశారు. స్థానిక ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి చొరవ తీసుకుని భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.10లక్షల చొప్పున పరిహారం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని, ఇట్టి డబ్బులు అట్టి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయించారు. రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డి చిత్ర పటానికి భూ నిర్వాసితులు పాలాభిషేకం చేశారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంఎల్ఎ

**ప్రజాపక్షం/తాండూరుః** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్ష తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం యాదగిరి గుట్టలో ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి శాలువతో సన్మానించడంతో పుష్పగుచ్చాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## సంతోషిమానగర్‌లో సదర్ వేడుకలు

**ప్రజాపక్షం/ మల్కాజిగిరి :** వినాయకనగర్ డివిజన్‌లోని సంతోషిమానగర్ ప్రాంతంలో సదర్ వేడుకలు ఘనంగా జరిగాయి. సంప్రదాయ బద్ధంగా వచ్చే పండుగలను ప్రజలు భక్తి శ్రద్ధలతో సర్వమత ప్రాధాన్యతనిస్తూ జరుపుకోవటంహర్షించదగిందని ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బర్ల నరేష్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, వెంకటేష్ యాదవ్, రాందాస్, వినోద్, సందీప్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి

### శామీర్‌పేట ఎంపిడివో మమతబాయి

**ప్రజాపక్షం/శామీర్‌పేట ః** సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని శామీర్‌పేట ఎంపిడివో మమతబాయి అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండల కేంద్రంలోని అలియాబాద్‌లో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేకొరకు అధికారులు ఇంటికి వచ్చినప్పుడు అడిగిన వివరాలను తెలుపాలని కోరారు. ఏలాంటి తప్పులు లేకుండా ప్రోఫార్మాలో పేర్కొన్న అంశాలను క్షుణ్ణంగా అడిగి వివరాలను నమోదు చేయాలన్నారు. ప్రతి రోజు కనీసం ఒక్కో ఎన్యుమరేటర్ పదికి మించి ఇండ్లను సర్వే చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, సూపర్‌వైజర్ బస్వరాజ్, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

## శ్రీసాయినగర్‌లో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పర్యటన

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని వినాయకనగర్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. డివిజన్‌లోని శ్రీసాయినగర్ ప్రాంతంలో శనివారం విద్యుత్ విభాగం, జిహెచ్ ఎంసి, జలమండలి అధికారులతో కల్సి పర్యటించారు. త్వరలో ప్రజా బోర్ల మరమ్మత్తు పనులు చేపట్టి నీటి సమస్య లేకుండా చేస్తానని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా త్రీ ఫేజ్ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయిస్తానన్నారు. కాలనీ అధ్యక్షుడు ఉపేందర్, కార్యదర్శి రమేష్, జగదీష్‌చారి, చంద్రమౌళి, వెంకటేష్, రమాదేవి, సుజాత, పద్మ,సుమతి, సంగీత, సోమేష్, పండు, ధనరాజ్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం / కొడంగల్ ః** ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా అడిషినల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మంగళవారం కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటరు నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు గా నమోదు సుకోవాలని సూచించారు. ఓటరు లిస్టులో ఏవైన మార్పు చేర్పులు చేసుకోవల్సిన వారు రెండు రోజుల పాటు ప్రత్యేకంగా బిఎల్‌వోలను ఏర్పాటు చేయడం జరిగిందని అందుకు మీ మీ వార్డులలో బిఎల్‌వోలు అందుబాటులో ఉంటారన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతంగా సంబందిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే పనులను పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు కార్గిల్ కాలనీలో సర్వే పనులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు మున్సిపల్ కమిషినర్ బలరాం నాయక్, తహశీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో ఉషశ్రీలతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రీజినల్ రింగ్ రైల్ సర్వే అడ్డగింత

## మాదిరెడ్డిపల్లి రైతుల ఆగ్రహంతో వెనుదిరిగిన సర్వే సిబ్బంది

**ప్రజాప క్షం/నవాబుపేట ః** రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా రింగ్ రైల్ నిర్మాణ సర్వేను ఆర్బి అసోసియేషన్ ఏజెన్సీ సిబ్బంది చేపట్టిన వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం మాదిరెడ్డిపల్లి గ్రామ రైతులు అడ్డుకున్నారు. రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మా పట్టా భూముల్లో నుంచి రింగ్ రోడ్డు అంటూ ఒకరు, రింగ్ రైల్ సర్వే అంటూ మరొకరు తమకు సమాచారం లేకుండా సర్వే చేపట్టడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. ఉన్న భూమి గుంజుకుంటే మా బతుకులు ఎట్లెల్లాలె..? మేము ఏం సాగు చేసుకొని బతకాలె..? ఉన్నదే ఎకరం.. అరెకరం. అదీపోతే మా ఆదెరువు ఎట్ల..? మా భూములు మాకే ఉండనియ్యండి.. మమ్మల్ని బత్కనియ్యండి అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు సమాచారం ఇవ్వకుండా సర్వే చేయించడం సరికాదని సంబంధిత శాఖ అధికారులపై రైతులు మండిపడుతున్నారు. అధికారులు మోఖామీదకు వచ్చి తమ మొర వినాలని కోరారు. భూమికి భూమి, నష్టపరిహారం పై స్పష్టమైన హామీ ఇచ్చే దాకా సర్వే చేయనిచ్చేది లేదని తేల్చి చెప్పారు. మాకు జీవనాధారమైన ఈ భూములను ప్రభుత్వం అభివృద్ధి పేరుతో లాక్కొని మా బ్రతుకులను రోడ్డుపాలు చేయాలని చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూస్వాముల భూములు కాకుండా సన్న కారు, చిన్న కారు రైతులమైన మా భూముల్లో నుండి త్రిబుల్ ఆర్ రోడ్, రింగ్‌రైల్ నిర్మాణాలు చేపట్టేందుకు సర్వే చేయడం సరి కాదని మండిపడ్డారు. ఈ సర్వే వలన సుమారు 400మంది రైతులము తమ పట్టాభూమి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైన మా భూములు వదిలేది లేదని రైతులు తేల్చిచెప్పారు.

## కృషి, పట్టుదలతో సాధించలేనిది ఏమీలేదు

### కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ః** కృషి, పట్టుదలతో జీవితంలో సాధించలేనిది ఏమి లేదని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. ఇండియన్ నేవికి ఎంపికై ఉద్యోగం సాధించిన చింతల్ డివిజన్ కు చెందిన మేకల మనోహర్ కుమార్తె మేకల ప్రిస్పిల్లా వెస్లీ శనివారం ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా ఇండియన్ నేవిలో ఉద్యోగం సంపాదించిన మేకల ప్రిస్మిల్లా వెస్లీని ఎమ్మెల్యే శాలువతో సత్కరించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బలహీనతలను అధిగమించినప్పుడు ఎంతటి లక్ష్యానైనా సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేగ రాము, రాచకొండ మురళీ, ఆది నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు**

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని షిరిడి హిల్స్ లో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ ఆలయం లో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నల్ల పోచమ్మ అమ్మవారి దయతో ప్రజలంతా సుభిక్షంగా అష్ట ఐశ్వర్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ జగద్గిరి గుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం మాజీ చైర్మన్ వేణు యాదవ్, నాయకులు అడ్వకేట్ కమలాకర్, మక్సూద్ అలీ, మెట్ల శ్రీను, ఎర్ర లక్ష్మయ్య, వెంకటేష్, ఎర్వ సాయి కిరణ్, ఆలయ చైర్మన్ సురేందర్ రావు, ఆలయ కమిటీ సభ్యులు బండ మహేందర్, సాయి, మహేష్, నరేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా సమగ్ర కుటుంబ సర్వే

### జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట ః** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. శనివారం మూడుచింతలపల్లి మండలంలో జగ్గంగూడలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. అనంతరం లక్ష్మాపూర్‌లో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖి చేశారు. మూడుచింతలపల్లి మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న తహాశీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ వెంకటనర్సింహ్మా రెడ్డి, కార్యదర్శులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

## సమగ్ర ఇంటింటి సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే తీరు తెన్నులను జిల్లా కలెక్టర్ గౌతం, అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికా గుప్తాలు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. కుటుంబ సభ్యులతో నేరుగా మాట్లాడుతూ సర్వే గురించి వివరిస్తూ సిబ్బంది ఏ విధంగా ప్రశ్నలడిగి నిర్దేశించిన సమాచారాన్ని సేకరిస్తున్నారన్న విషయాలపై తెలుసుకొంటూ అవసరమైన సూచనలిస్తున్నారు. శనివారం కలెక్టర్ గౌతం శామీర్‌పేట మండలంలోని ఆలియాబాద్‌లో, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మూడుచింతలపల్లి మండలంలోని జగన్ గూడలో, మరో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా దమ్మాయిగూడ, పోచారం మండలాల్లో సర్వేను వేర్వేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు సిబ్బందికి ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలన్నారు. సర్వే చేస్తున్న సమయంలో తమ ఇళ్లకు వచ్చే ఎన్యుమరేటర్లకు కుటుంబ సభ్యులకు సంబంధించిన ఆధార్, ఓటర్ తదితర కార్డులను చూపించాలన్నారు. ప్రొఫార్మాల్లో పూరించేందుకు గాను కోడింగ్‌ను ఉపయోగించాలన్నా రు. ఎన్యుమరేటర్లు తమ కిచ్చిన ప్రొఫార్మాలలో నమోదు చేస్తున్న వివరాలు, ఇళ్లకు అతికిస్తున్న స్టిక్కర్లను సిబ్బందికి కేటాయించిన ప్రొఫార్మాలను భద్రపరచేందుకు గాను అవసరమైన బ్యాగులను అందించాలని, అవసరమైన పక్షంలో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసాయలన్నారు.

## స్థిరమైన సాంకేతిక పరిష్కారాలతో 'మేకల్డన్2024'

**ప్రజాపక్షం/దుండిగల్ ః** ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా రోబోటిక్స్ సాంకేతిక పరిష్కారాలతో మేకల్డన్–2024 విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపల్ తపస్సుమ్ జైదీ మాట్లాడుతూ మేకల్డన్ హైదరాబాద్ ఎడిషన్లో స్కూల్ విద్యార్థులు అద్భుతమైన సృజనాత్మక నిబద్ధతను వాస్తవ ప్రపంచం సవాళ్లకు స్టిం విద్య ఎలా పరిష్కరించగలదో చెప్పిందని ప్రదర్శించబడి న అసాధారమైన ప్రాజెక్టులు స్టిం సూత్రా ల గురించి దృఢమైన అవగాహన మాత్రమే కాకుండా ప్రపంచ సదస్సులకు పరిష్కరించగల సామర్థ్యాన్ని కూడా ప్రతిబిస్తాయని అన్నారు సైన్స్ అండ్ టెక్నాలజీలతో విమర్శనాత్మక ఆలోచన సమ స్య పరిష్కారం మరియు ఆలోచన అవసరాత్మక పరిష్కారాలుగా మార్చడాని కి విద్యార్థులకు వేదికగా అందించాయని అన్నారు. ఆర్కిడ్స్ ది ఇంటర్నేషన ల్ స్కూల్ జోనల్ హెడ్ రవి నాయక్ మాట్లాడుతూ, ccమెకాథ్లాన్, స్టమ్ ఫస్ట్, విద్యార్థులకు తమ చదువుకు మించిన నైపుణ్యాలను అందిస్తుందనీ, విద్యార్థుల వినూత్న పరిష్కారాలను గమనించిన తరువాత, పరిశ్రమలు, సంఘాలకు భవిషత్తులో సహకారం అందిస్తారని గట్టిగా నమ్ముతున్నామన్నారు.

## 18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు

### జిల్లా కలెక్టర్ ప్రతిక్‌జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి ః** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివారెడ్డి పేట్ గ్రామం నందు 133,134 పోలింగ్ స్టేషన్ లను సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రతిక్‌జైన్ ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరు తప్పని సారిగా ఓటరు నమోదు చేసుకోవాలని అన్నారు. నేడు రేపు బుత్ స్థాయిలో ప్రత్యేక క్యాంపు లు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జనవరి 1 ,2025 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవలని అన్నారు. ఓటర్ జాబితాలో తమ పేరు ఉన్నదో లేదో చేక్ చేసుకోవాలని లేకుంటే ఫార 6 ద్వారా పోలింగ్ బుత్ స్థాయిలో ఫారం 6,7,8ఎ దరఖాస్తులు బిఎల్ఓల దగ్గర అందుబాటులో వుంటరని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఓటర్ నమోదు సమాచారం కోసం 1950కు ఫోన్ చేసి తెలుసుకోచ్చుఅని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్ .తహసీల్దార్ లక్ష్మి నారయణ, బిఎల్ఓలు స్వరుప తదితరులు పాల్గొన్నా రు.

**తప్పులు లేకుండా ఇంటింటి సర్వే** g సర్వే కొరకు ఎలాంటి అనుమానలు , సందేహాల కు, తప్పులు లేకుండా సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి అని కలెక్టర్ విడియో కన్ఫిరేన్స్ అనంతరం అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే ప్రక్రియ నిబ్బద్ధతతో నిష్పక్షపాతంగా ఎలాంటి పోరపట్లు లేకుండా నిర్వహించాలని తెలిపారు. సర్వేకు ఓకు రోజు ముందగ్రామల్లో పట్టణల్లో విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. ఎలాంటి సందేహాలు ఉన్నా యంపిడిఓ , తహసీల్దార్లకు తెలుపలని అన్నారు. సర్వేపై ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు తప్పవరి కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్ ,డిపిఓ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ఫాస్ట్ ఫుడ్.. పరేషాన్

### నిషేధిత రంగులు కలిపి ఆహారం విక్రయం

**ప్రజాపక్షం/అల్వాల్ ః** ఆకలి రుచి ఎరుగదు. నిద్ర సుఖ మెరుగదు అంటా రు. ఈ సామెతను అందిపెంచుకున్న కొందరు వ్యాపారులు అల్వాల్ పట్టణ కేంద్రంలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను ఏర్పా టు చేస్తున్నారు. ఇందులో నూడుల్స్ పానీ పూరి బేకరీ ఐస్ క్రీమ్ నాన్ వెజ్ ఫ్రైడ్ రైస్ వాటి ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారు. లోతుకుంట లోని ఇవర్మ విక్రయ కేంద్రా న్ని కల్తీ ఫుడ్ రావడంతో 6 మంది అస్వస్థ కు గురయ్యారు. దీంతో మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. తక్కువ ధరకు ఆహార పదార్థాలు అంటూ బోర్డులు వేలాడదీసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఫలితంగా నాణ్యత లేని ఆహారం తినే ప్రజలు ఆరోగ్యం కొని తెచ్చుకుంటున్నారు. పట్టణంలోని ఎక్కడ పడితే అక్కడ పదుల సంఖ్యలో దుకాణాలు దర్శనమిస్తున్నాయి. వీటిలో చాలా వరకు కనీస నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. ఆహార పదార్థాల విక్రయాల్లో కల్తీ రాజ్య మేలుతుంది. ఇది తెలియక తింటున్న భోజన ప్రియులు అనారోగ్యాని కొన్ని తెచ్చుకుంటున్నారు. వివిధ పనుల నిమిత్తం అల్వాల్ పట్టణానికి వివిధ గ్రామాల నుంచి రోజు వస్తున్న ప్రజలు విద్యార్థులు ఆహార పదార్థాల వైపు మొగ్గు చూపుతున్నారు. తక్కువ ధరకే లభిస్తుండడంతో వీటిని లొట్టలేసుకుంటూ తింటున్నారు. కొంతమంది దుకాణాదారులు రుచితో ఆకట్టుకునేందుకు ఆరోగ్యానికి హాని కలిగించే వస్తువులతో పాటు ఆహార పదార్థాలు తయారు చేస్తున్నట్టు తెలుస్తుంది. ఫాస్ట్ ఫుడ్ తినడం ఆరోగ్యానికి మంచిది కాదు. ప్రధానంగా యువత ఫాస్ట్ ఫుడ్ వైపు మక్కువ చూపుతుంది. రుచులు రంగులకు తలోంగి ఫాస్ట్ ఫుడ్ లో కి వెళ్లి తినేస్తున్నారు. దీనివల్ల వచ్చే అనర్థాలను మాత్రం గుర్తించడం లేదు. ఈ విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తపరచాలి. ఫాస్ట్ ఫుడ్ వల్ల అనేక వ్యాధులు వస్తాయని వారికి చెప్పాలి. అధికారులు సైతం తనిఖీలు చేపట్టాలి.

## విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమే

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** విద్యతో పాటు క్రీడల విషయంలోనూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తి కనపరచాలని నారాయణ పాఠశాల ఎజిఎం పురుషోత్తం రెడ్డి అన్నారు. మల్కాజిగిరి నారాయణ పాఠశాలలో జరిగిన వార్షిక క్రీడోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యా సంస్థల్లో విధిగా క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అవసరమైన క్రీడా స్థలాలు కేటాయిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నిర్వహించే క్రీడా పోటీలకు సిద్ధమయ్యేలా విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో సరైన శిక్షణ పొందాలన్నారు. క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ పద్మలత, వైస్ ప్రిన్సిపాల్ స్వీప ఖాలిని, మమత, అకడమిక్ డీన్ తదితరులు పాల్గొన్నారు.

## కులగణన సర్వేపై సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం/దుండిగల్ః**దుండిగల్ మున్సిపల్ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ; కుల సర్వే కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ కే.సత్యనారాయణ రావు, సూపర్వైజర్లకు ఎనిమినేటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హౌస్ హోల్డ్ సర్వే ద్వారా సేకరించిన వివరాలను ప్రతిరోజు హౌస్ ఓట్ట్ లిస్ట్ ప్రకారంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సేకరించే కార్యక్రమానికి ప్రారంభించారు. ఈ సర్వే మున్సిపాలిటీనీ 239 ఏన్యూ మరేటర్ బ్లాకులుగా చేయడం జరిగిందనీ, 10 ఏన్యూ మరేటర్ లకు ఒక సూపర్వైజర్ ఉంటారని మొత్తం 24 మంది సూపర్వైజర్లు నియమించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సునంద, మున్సిపల్ ఇంజనీర్ బి.సురేందర్ నాయక్, సూపర్వైజర్లు, ఏన్యూ మరేటర్స్ పాల్గొన్నారు.

# మహానగరి

## ఓటర్ గుర్తింపు కార్డులో తప్పల సవరణ

**ప్రజాపక్షం/కొత్తూరు:** ఓటర్ గుర్తింపు కార్డులో తప్పులను సరి చేసేందుకు చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ ఆర్‌డిఓ సరిత సూచించారు. శనివారం కొత్తూరు, ఫరూక్‌నగర్ మండలాల్లో తహసీల్దార్ పార్థసారధి పోలింగ్ బూత్‌ను తనిఖీ చేశారు. తప్పులు లేకుండా ఓటర్ జాబితాను తయారు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఓ సరిత కోరారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజల నుండి నేరుగా వచ్చిన ధరఖాస్తులే కాకుండా ఆన్‌లైన్‌లో వచ్చిన ధరఖాస్తులను సైతం సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఓ సరిత సూచించారు.

## పత్తికి గిట్టుబాటు ధర పొందండి

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** తక్కువ తేమశాతంతో పత్తికి తీసుకువచ్చి ప్రభుత్వ గిట్టుబాటు ధర పొందాలని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ సూచించారు. శనివారం మార్కెట్ యార్డులో నిర్వహించిన సమావేశంలో కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ షాద్‌నగర్ మార్కెట్ యార్డు పరిధిలో 11 సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సిసిఐ కొనుగోలు కేంద్రానికి వచ్చే సమయంలో పత్తితో పటు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం జీరాక్స్, బాంక్ పాస్ పుస్తకం తీసుకురావాలని సూచించారు. విక్రయించిన పత్తి నగదును వెంటనే రైతు బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరుగుతుందని వివరించారు.

## శివారు కాలనీలు అభివృద్ధి చేస్తా

### ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బిఎన్‌రెడ్డి డివిజన్‌లో శివారు కాలనీలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని శివారు కాలనీలపై అధికారులు, కాలనీవాసులు, రైతులతో క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ శివారు కాలనీలు భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ నూతన లైన్‌ల ఏర్పాటుకు రైతుల పొలాలు మధ్యలో ఉండడంతో సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. రైతులు ముందుకు వస్తే సమస్య పరిష్కారం వస్తుందని గుర్తు చేశారు. రైతులకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. వరద ప్రభావం సాగర్ కాంప్లెక్స్ నుండి వచ్చే వరద నీటిని కాప్రాయ్ చెరువులోకి రాకుండా గుర్రంగూడ ఫారెస్టు నుండి విపశ్యన ధ్యాన కేంద్రం మీదుగా దిగువన ఉన్న శ్రీగాయత్రి నగర్, పాపిరెడ్డి కాలనీ, క్రిస్టల్ విల్లాస్ మీదుగా తీసుకెళ్లి మునగనూర్ మీదుగా అంబర్‌పేట్ శివారులో కలపాలని ప్రణాళిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్ రావు, రైతులు జక్కిడి మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జక్కిడి సంజీవరెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ ఆసుపత్రిలో సదరం క్యాంపు

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దూరం చేసేందుకు సదరం క్యాంపును స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలోనే నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శనివారం స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో కార్యనిర్వాహణ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైద్య సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగులు పడుతున్న ఇబ్బందులను దూరం చేసేందుకు వైద్యులు కృషి చేయాలని, విధుల పట్ల వైద్యులు నిర్లక్ష్యం వహించరాదని పేర్కొన్నారు. సమయపాలన పాటిస్తూ వైద్యులు రోగులకు పరీక్షలు చేయడంతోపాటు సకాలంలో మందులు ఇవ్వాలని సూచించారు. షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మరమ్మత్తులు సకాలంలో పూర్తి చేసేందుకు వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని శంకర్ సూచించారు. సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీనివాస్‌రెడ్డితోపాటు వైద్య సిబ్బంది, అడ్వైజరీ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## యూనివర్సల్ ఇమ్యునైజేషన్ అతిపెద్ద ప్రజారోగ్య కార్యక్రమం

### డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ అతిపెద్ద ప్రజారోగ్య కార్యక్రమం అని రంగారెడ్డి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిడాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా ప్రజా ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేసే వైద్య అధికారులకు శనివారం ఎల్ బినగర్ లోని కామినేని హస్పటల్ లో ఏర్పాటుచేసిన రొటిన్ ఇమ్యునైజేషన్ మాన్యువల్ నూతన ఎడిషన్ అవగాహన కార్యక్రమాన్నికి డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య అధికారులకు, ప్రోగ్రామ్ ఆఫీసర్లకు అవసరమైన అవగాహన, ఆచరణాత్మక మార్గదర్శకత్వంతో యునివర్సల్ ఇమ్యునైడేషన్ మైక్రో ప్లాన్ తోపాటు లబ్దిదారులకు పెండింగ్ జాబితాలను అభివృద్ధి చేయడానికి, పట్టణ, గ్రామీణ సెట్టింగ్ అనుగుణంగా ఫార్మాట్ లను వివరణతో మెరుగు పరచబడిందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య డిప్యూటీ డిఎంహెచ్‌వోలు,ప్రొగ్రాం ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

## కుటుంబ సర్వే కిట్ల అందజేత

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా శనివారం చందానగర్ సర్కిల్‌లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో కుటుంబాల వారీగా వివరాల సేకరణకు ఎన్యుమరేటర్లకు అవసరమైన కిట్లను చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పి.మోహన్ రెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వే కార్యక్రమానికి సర్కిల్ లో ఉన్న సుమారు ఒక లక్ష పై చిలుకు కుటుంబాలకు ప్రతి 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్ ను, ప్రతి 10 మంది ఎన్యుమరే టర్లకు ఒక సూపర్‌వైజర్ లాగా క్షేత్ర స్థాయి విధులు కేటాయించమన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులం వివరాలు పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. సంబధిత సూపర్‌వైజర్లు పది శాతం ఎన్యూమరేటర్ల నమోదును క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి ఎన్యుమరేటర్లకు మార్గదర్శకత్వం చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ పి.మోహన్‌రెడ్డి, ఏసిపి నాగిరెడ్డి, ప్రాజెక్టు అధికారిని శ్రీమతి ఉషారాణి, ఏ ఎం సి లు విజయ్ కుమార్,కృష్ణ పాల్గొన్నారు.

## గ్రేటర్‌లో ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో

# 'సమగ్ర కుటుంబ సర్వే'

### రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 'సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే'ను షెడ్యూల్ ప్రకారం ఖచ్చితత్వంతో చేపట్టేందుకు జిహెచ్ ఎంసి జోన్‌ల పరిధిలో సమన్వయ, పర్యవేక్షణ అధికారులను రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దాన కిషోర్ నియమించారు. ఈ మేరకు శనివారం ఆయన మెమో జారీ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి)లో నిర్వహించే సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) సర్వే సమన్వయ అధికారిగా హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను నియమించారు. సికింద్రాబాద్, చార్మినార్ జోన్‌లకు హెచ్‌ఎండిఏ జాయింట్ మెట్రో పాలిటన్ కమిషనర్ శ్రీవాత్సవ కోట, ఎల్.బి.నగర్ నగర్, ఖైరతాబాద్ జోన్‌లకు మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి ప్రియాంక, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్‌లకు జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్‌లను పర్యవేక్షణ అధికారులుగా నియమించారు. పర్యవేక్షణ అధికారులు సంబంధిత జోనల్ కమిషనర్‌లతో సర్వే సమన్వయం చేసుకుంటూ, క్షేత్ర స్థాయిలో సర్వే సకాలంలో ఖచ్చితత్వంతో పూర్తి అయ్యేలా తగిన చర్యలు తీసుకుంటారు. క్షేత్రస్థాయి సర్వే పురోగతికి సంబంధించి జిహెచ్‌ఎంసి సమన్వయ అధికారికి తెలుపుతారు. జోనల్ కమిషనర్లు, మానిటరింగ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ గ్రేటర్ పరిధిలో ప్రభుత్వ నిర్దేశిత షెడ్యూల్ ప్రకార సర్వే సజావుగా జరిగేలా జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు సమన్వయ అధికారి సర్ఫరాజ్ అహ్మద్ సహకారం అందించనున్నారు.

## తాగునీటి సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్2 లో కలబ్ గూర్ నుంచి పటాన్ చెరు వరకు ఉన్న 1500 ఎంఎం దయా పిఎస్‌పి పంపింగ్ మెయిన్‌కు భారీ లీకేజీలు ఏర్పడ్డాయి. ఈ లీకేజీలు అరికట్టేందుకు ఈనెల 11 ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. కావున ఈ 24 గంటలు కింద పేర్కొన్న కొన్ని ప్రాంతాల్లో లో ప్రెజర్‌తో నీటిసరఫరా, మరికొన్ని ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుంది. కావున నీటి సరఫరాలో అంతరాయం ఏర్పాడే ప్రాంతాల వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి అధికారులు సూచించారు.

**అంతరాయం ఏర్పడే ప్రాంతాలు...**

ఓఅండ్‌ఎం డివిజన్ 15 ఆర్‌సి పురం, అశోక్ నగర్, జ్యోతినగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్. ఓఅండ్‌ఎం డివిజన్ 24 బీరంగూడ, అమీన్ పూర్. ట్రాన్స్‌మిషన్ డివిజన్ 2 ఆఫ్ పాయింట్స్, బల్క్ కనెక్షన్లు. ఓఅండ్‌ఎం డివిజన్ 6 ఎర్రగడ్డ, ఎస్.ఆర్.నగర్, అమీర్ పేట్. ఓఅండ్‌ఎం డివిజన్ 9 కెపిహెచ్‌బి కాలనీ, కూకట్ పల్లి, మూసాపేట్, జగద్గిరిగుట్ట.

## ఆ ముగ్గురిని విధుల్లోకి తీసుకోండి

### మంత్రి శ్రీధర్‌బాబుకు శ్రీకృష్ణ విజ్ఞప్తి

**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** మధ్యాహ్న భోజనం కార్మికులుగా పనిచేస్తున్న ముగ్గురు మహిళలను విధుల నుంచి అకారణంగా తొలగించడం దుర్మార్గమైన చర్య అని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం, ధన్వాడ గ్రామంలోని జెడ్‌పిహెచ్‌ఎస్‌లో దళిత మహిళ పసుల సువర్ణ, ఇజ్జంకి మణెమ్మ, ఇజ్జంకి కలమ్మ పదేండ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో సువర్ణ ఇల్లు ప్రమాదవశాత్తూ కాలిపోగా, అప్పటి ఎంఎల్‌ఎ పుట్ట మధు తన కుటుంబానికి సాయం చేశారని ఆమె చెప్పారు. సువర్ణ ఇలా చెప్పడమే ఆమె పాలిట శాపమైందన్నారు. తనకు జరిగిన అన్యాయంపై సువర్ణ స్థానిక ఎంఎల్‌ఎ, మంత్రి శ్రీధర్ బాబును కలిసినా న్యాయం జరగలేదన్నారు. ఈ ఘటనపై పునరాలోచించి పేద కుటుంబాలకు చెందిన వారిని విధుల్లోకి తీసుకొనేలా ఆదేశాలివ్వాలని ఆయన మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. సమావేశంలో బాధితురాలు పసుల సువర్ణ, దళిత క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వేతో ప్రజలకు ఒరిగేదేమీ లేదు

### టిడిపి నేత సాయిబాబా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజల ఆర్థిక స్థితిగతులు, ఆస్తుల వివరాలు తెలుసుకుంటున్న ప్రభుత్వం వారికున్న అప్పులు తీరుస్తుందా? అని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా ప్రశ్నించారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడు తూ కులగణన పేరుతో ప్రజల ఆర్థిక స్థితిగతు లు తెలుసుకొనే అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రజల ఆర్థిక స్థితిగతులు తెలుసుకొని వారిని తాకట్టు పెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కుల గణన పేరుతో ప్రజల ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఆస్థుల వివరాలు తెలుసుకోవడం సమంజసం కాదన్నారు. గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా సమగ్ర సర్వే నిర్వహించి, ప్రజలను దోచుకుందని ఆరోపించారు. ఈసర్వేలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని హామీనిచ్చి, ఆ సంగతి పక్కన పెట్టి, కులగణన పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్, ఎస్.ప్రకాష్, బి.రాజు పాల్గొన్నారు

## తప్పల్లేకుండా సమగ్ర కుటుంబ సర్వే

**ప్రజాపక్షం/కేశంపేట:** కేశంపేట మండలంలోని గ్రామాల్లో శనివారం అధికారులు సమగ్ర కుటుంబ సర్వేను ప్రారంభించారు. అధికారులు ఇంటింటికి తిరుగుతూ కుటుంబంలోని సభ్యుల ఆస్తి, అప్పులతో పాటు సమగ్రంగా అన్ని వివరాలను సేకరించారు. గ్రామాల్లోని అన్ని కుటుంబాల సభ్యులు తమ వివరాలను సర్వే అధికారులకు వివరంగా తెలియజేయాలని మండల ప్రత్యేకాధికారి రాజారత్నం కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, తాసీల్దార్ అజం అలీలతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయరా?

### సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

**ప్రజాపక్షం/షాబాద్ :** సిఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలో సిపిఐ మండల సమితి సమావేశం మండల కార్యదర్శి నక్కల జంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రైతులకు రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి ఇప్పుడు వాయిదాల పద్ధతిలో చెల్లిస్తామని రైతులను మోసం చేస్తున్నాడని పేర్కొన్నారు. నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పి గతంలో బిఆర్‌ఎస్ కట్టిన ఇండ్లకు కల్లర్ వేసి ఇస్తున్నారే తప్పా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఎమి లేదని విమర్శించారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లకు ప్రత్యేక కమిటి నిర్వహించి నిరు పేదలకు నూతనంగా ఇండ్లు కట్టి ఇవ్వాలని వివరించారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సి, బిసి, మైనార్టీ విద్యార్థులకు ఫీజు రియంబర్సెమెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, సిపిఐ నాయకులు మాజీ డిప్యూటి సర్పంచ్ తూర్పాటి రఘురాం, మధు, నారాయణ, రుక్కయ్య, శ్రీశైలం, బరువుల నర్సయ్య, రాములు, నర్సింలు, పాండు, బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు

### మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేయాలని ఎఐటియుసి అనుబంధ సంఘం మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఎల్‌బి నగర్ జోన్ పరిధిలోని జిల్లా నాయకులు మద్దిలేటి ఆధ్వర్యంలో నాగోల్‌లోని డాంగే భవనంలో మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్లో అన్ని విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి కార్మికులందరికీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. కార్మికుల అందరిని పర్మినెంట్ చేసేంతవరకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలలన్నారు. కార్మికులకు క్యాజువల్ లీవ్‌లు అమలు చేయాలని, జాతీయ పండుగ సెలవులు ఇవ్వాలన్నారు. పారిశుద్ధ్యం పనులు చేస్తున్నటువంటి కార్మికులని చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనాలు ఇంప్లిమెంట్ చేయకపోవడం మరి దారుణమని, కార్మికుల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కారం చేయాలన్నారు. కార్మికులు విధులు నిర్వహణ సమయంలో ప్రమాదం జరిగి మరణిస్తే రూ.25లక్షలు ఇవ్వాలన్నారు. దహన సంస్కారాల ఖర్చు 30వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఎల్‌బి నగర్ జోన్ మున్సిపల్ సంఘం రాష్ట్రం కార్యదర్శి జైపాల్‌రెడ్డివారితో పాటు 27 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జె.యాదమ్మ, కార్యనిర్వాహక అధ్యక్షులుగా హంసమ్మ, ఉపాధ్యక్షులుగా వెంకటమ్మ, అంజమ్మ, నందు, ప్రధాన కార్యదర్శిగా ఎం.మద్దిలేటి, సహాయ కార్యదర్శిలుగా లక్ష్మ మ్మ, కృష్ణవేణి, నరసమ్మ, కోశాధికారి లక్ష్మి , కౌన్సిల్ సభ్యులుగా సిహెచ్. పద్మ, అండాలు, విజయమ్మ, సుమత, లావణ్య, యాదమ్మ, రవి, రాజు, లలిత, కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## సిఎం సహాయ నిధిపేదలకు అండ

### టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అండ అని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. శనివారం ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని వన్థలిపురం, బిఎన్‌రెడ్డి, హస్తినాపురం, హయత్ నగర్ చెందిన గడ్డం వెంకటేశ్వర్లుకు 50వేలు, సాహెబ్ నగర్‌కు చెందిన ఎం. తరుణ్ గౌడ్‌కు 60వేలు, నందనవనం చెందిన బుష్రా బేగంకు 60వేలు, పుష్పమ్మలకు 60వేలు రూపాయలు బాధిత కుటుంబాలకు సీఎం రీలిఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు మకుటం సదాశివుడు, చెన్నగొని రవి, కుట్ల నరసింహ యాదవ్, వేణుగోపాల్ యాదవ్, నాయకులు షేక్ షకీర్, ఖదీర్, దాము, మహేందర్ యాదవ్, పరీఫ్, డి. శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి/నార్సింగి :** ఓటరు జాబితాలోని తప్పులను గుర్తించి సవరించే ప్రక్రియ క్షుణ్ణంగా పరిశీలిస్తు పకడ్బందీగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి బూతు లెవెల్ అధికారులకు సూచించారు. శనివారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 9,10 తేదీలలో యువతీ యువకులు ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోవడానికి నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపును జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏవైనా లోటుపాట్లు ఉంటే సవరించడం, ఓటరు జాబితాలో డూప్లికేషన్, చనిపోయిన వారి పేర్లను జాబితా నుండి తొలగించాలని, నమోదు ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు జరగకుండా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియ నిర్వహణపై మాట్లాడుతూ చేపట్టే సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియను ఎన్యూమరేటర్లకు శిక్షణలో ఇచ్చిన గైడ్లైన్స్ ఆధారంగా అర్థం చేసుకొని జాగ్రత్తగా సమగ్ర కుటుంబ సర్వే 75 కాలముల ఫామ్ ను పూర్తి చేయాలని ఆదేశించారు. కంగారుగా, ఆందోళన చెందకుండా జాగ్రత్తగా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని, సర్వే నిర్వహిస్తున్న సమయంలో ఎన్యూమరేటర్లకు ఏమైన సందేహాలు ఉంటే పై అధికారులను అడిగి సందేహాలను నివృత్తి చేసుకున్న తరువాత సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

### పాఠశాల పరిశుభ్రతకు చర్యలు

అనంతరం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తయారు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతీ రోజు ఎంత మంది విద్యార్థులకు భోజనం తయారు చేస్తారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రధాన ఉపాధ్యాయునికి తెలిపారు. పదవ తరగతిని జిల్లా కలెక్టర్ తనిఖీ చేసిన సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. మీరంతా క్రమశిక్షణ, పరిశుభ్రతను, మంచి అలవాట్లను పాటించి, మీతోటి విద్యార్థులను కూడా పాటించేలా చూడాలన్నారు. జీవితంలో ఎదగడానికి పదవ తరగతి తొలి మెట్టు అని, గడిచిన కాలాన్ని తిరిగి పొందలేమని, ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను ..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు గొప్ప గొప్ప స్థానాల్లో ఉన్నారన్నారు. నేను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నాని కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు. ప్రతి రోజు స్కూల్‌కు యునిఫాం ధరించి రావాలని, తరగతిలో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకొని, క్రమశిక్షణతో చదవాలని, ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. మీ కన్న తల్లిదండ్రుల కలలను నెరవేర్చే విధంగా చదువును ఇష్టపడి చదవాలని, మన చదువుకు ఆటంకంగా మరే వస్తువులను, పరిస్థితులను అధిగమించి చదువును కొనసాగించినప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటామన్నారు. పదవ తరగతి పరీక్షలలో మీరంత పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించాలని చెప్పారు. విద్యార్థులకు టీం వర్క్ అలవాటు చేయాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. నేను మరొకసారి పాఠశాలకు వచ్చినప్పుడు మీ అందరిలో నేను సూచించిన మార్పును చూడాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆకాక్షించారు. కార్యక్రమంలో శంషాబాద్ తహసీల్దార్ రవీందర్ దత్తా, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ



## నీరజ్ చోప్రాకి కొత్త కోచ్ వచ్చేశాడు!

భారత స్టార్ జావెలిన్ త్రో ప్లేయర్ నీరజ్ చోప్రాకు కొత్త కోచ్ వచ్చాడు. ప్రముఖ జావెలిన్ లెజెండ్ జాన్ జెలెజ్నీ నీరజ్‌కు కోచ్‌గా బాధ్యతలు అందుకున్నాడు. ఇకపై ఈ బల్లెం వీరుడు జాన్ బెలెజ్నీ దగ్గర శిక్షణ తీసుకోనున్నట్లు తెలిపాడు. గత అయిదేళ్లుగా నీరజ్ చోప్రాకు క్లాస్ బార్టోనీజ్ శిక్షణ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే కుటుంబ కారణాలతో కోచ్ బాధ్యతల నుంచి 75 ఏళ్ల బార్టోనీజ్ తప్పుకున్నాడు. కోచ్‌గా బార్టోనీజ్ తప్పుకోవడంపై నీరజ్ చోప్రా భావోద్వేగానికి గురయ్యాడు. తాను ఆటగాడిగా, వ్యక్తిగా ఉన్నత స్థాయికి చేరుకోవడానికి బార్టోనీజ్ కోచ్‌గా ఎంతో కృషి చేశారని చెప్పాడు. గాయంతో ఇబ్బంది పడిన రోజుల్లో, ఎత్తుపల్లాలో తనకు ఎంతో అండగా నిలిచారని నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. బార్టోనీజ్ శిక్షణలో నీరజ్ చోప్రా ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచాడు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం, పారిస్ ఒలింపిక్స్‌లో రజతం సాధించాడు. అంతేగాక ప్రపంచ ఛాంపియన్‌గా, డైమండ లీగ్ ఛాంపియన్‌గా నిలిచాడు. కాగా, కోచ్ బాధ్యతలు అందుకున్న జాన్ బెలెజ్నీ జావెలిన్‌లో ప్రపంచ రికార్డులు నమోదుచేశాడు. 1992, 1996, 2000 ఒలింపిక్స్‌లో బెలెజ్నీ పతక విజేతగా నిలిచాడు. జెకియా లెజెండ్ బెలెజ్నీ 1996లో జర్మనీలో 98.48 మీటర్లు బల్లెం విసిరి వరల్డ్ రికార్డు నెలకొల్పాడు. కాగా, బెలెజ్నీ నుంచి శిక్షణ పొందడంపై నీరజ్ ఉత్సుకతతో ఉన్నాడు. తన కెరీర్‌లోని ఓ ఉత్తేజకరమైన కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నాడు. కాగా, నీరజ్ చోప్రా మెరుగైన సాధన కోసం ఈనెలాఖరులో దక్షిణాఫ్రికా వెళ్లనున్నాడు. వచ్చే ఏడాది పోటీల కోసం దక్షిణాఫ్రికాలోని పాచ్‌ఫస్ట్రోమ్‌లో నీరజ్ 31 రోజుల పాటు శిక్షణ తీసుకోనున్నాడు. టోక్యో, పారిస్ ఒలింపిక్స్‌కు ముందు కూడా పాచ్‌ఫస్ట్రోమ్‌లోనే నీరజ్ శిక్షణ తీసుకున్నాడు.

## ఆస్ట్రేలియా చేతిలో భారత్‌కు మరో ఓటమి!

ఆస్ట్రేలియా పర్యటనను భారత్ 'ఎ' జట్టు పే లవంగా ముగించింది. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన రెండో అనధికారిక టెస్టులోనూ ఓట మిపాలైంది. ఆరు వికెట్ల తేడాతో ఘోర పరా జయాన్ని చవిచూసింది. 168 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా నాలుగు వికెట్లు కోల్పో యి 47.5 ఓవర్లలో ఛేదించింది. సామ్ కొనస్టాస్ (73 నాటౌట్; 128 బంతుల్లో, 7 ఫోర్లు, 1 సిక్సర్), వెబ్‌స్టర్ (46 నాటౌట్; 66 బంతుల్లో, 6 ఫోర్లు) సత్తాచాటారు. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ రెండు వికెట్లు, ముకేశ్ కుమార్, తనుష్ కొటియన్ తలో వికెట్ తీశారు. అయితే ఛేదనలో ఆస్ట్రేలియా తొలి ఓవర్‌లోనే రెండు వికెట్లు కోల్పోయింది. మార్కస్ హారిస్, కామెరూన్ బెన్‌క్రాఫ్ట్‌లను ప్రసిధ్ కృష్ణ గోల్డెన్ డకౌట్ చేశాడు. కొద్దిసేపటికి ముకేశ్, తనుష్ కూడా వికెట్లు పడగొట్టడంతో ఆసీస్ 73 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. అయితే ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన వెబ్‌స్టర్‌తో కలిసి సామ్ ఇన్నింగ్స్ చక్కదిద్దారు. వీరిద్దరు సాధికారికంగా ఆడుతూ ఆసీస్‌ను విజయతీరాలకు చేర్చారు. అంతకుముందు 73/5 ఇవాళ ఆటను ఆరంభించిన భారత్ఏ జట్టు 77.5 ఓవర్లలో 229 పరుగులు చేసింది. ధ్రువ్ జురెల్ (68; 122 బంతుల్లో, 5 ఫోర్లు) మరోసారి జట్టును ఆదుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో అర్ధశతకంతో సత్తాచాటాడు. తనుష్ కొటియన్ (44; 84 బంతుల్లో, 4 ఫోర్లు, 1 సిక్సర్), ప్రసిధ్ కృష్ణ (29; 43 బంతుల్లో, 5 ఫోర్లు) కీలక పరుగులు చేశారు. కాగా, భారత్ ఎ తొలి ఇన్నింగ్స్‌లో 161 పరుగులకే కుప్పకూలింది. వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (80) పోరాడాడు. నీజర్ నాలుగు వికెట్లు, వెబ్‌స్టర్ మూడు వికెట్లు తీశారు. ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్‌లో 223 పరుగులు చేసింది. ప్రసిధ్ కృష్ణ నాలుగు వికెట్లు, ముకేశ్ కుమార్, ఖలీల్ అహ్మద్ రెండు వికెట్లతో పడగొట్టారు. మార్కస్ హారిస్ (70) టాప్ స్కోరర్.

## అక్షర్‌పై వేటు..రమన్‌దీప్ సింగ్ అరంగేట్రం

### సౌతాఫ్రికాతో ఆడే రెండో టీ20 జట్టు ఇదే!

దక్షిణాఫ్రికాతో జరుగుతున్న నాలుగు టీ20ల సిరీస్‌ను భారత్ ఘనంగా బోణీ కొట్టింది. డర్బన్ వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన తొలి టీ20లో టీమిండియా 61 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆల్ రౌండ్ షోతో సత్తా చాటి సఫారీలను చిత్తు చేసింది. అదే జోరులో సెయింట్ జార్జ్ పార్క్ వేదికగా ఆదివారం జరగనున్న రెండో టీ20లోనూ గెలవాలని టీమిండియా పట్టుదలతో సిద్ధమవుతోంది. మరోవైపు రేపటి మ్యాచ్‌లో గెలిచి భారత్ ఆధిక్యాన్ని 1–1తో సమం చేయాలని సౌతాఫ్రికా ఉవ్విళ్లూరుతోంది. అయితే రెండో టీ20లో తుదిజట్టులో మార్పులు చేయాలని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ భావిస్తున్నారు. విన్నింగ్ కాంబినేషన్ మార్చడానికి ఇష్టం లేకపోయినా యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని చూస్తున్నారు. ఈ క్రమంలో కేకేఆర్ రిటైన్డ్ ప్లేయర్, ఆల్‌రౌండర్ రమన్‌దీప్ సింగ్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేయనున్నాడు. స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ స్థానంలో అతను జట్టులోకి రానున్నాడు. తొలి టీ20లో భారత్ 202 పరుగులు భారీ స్కోరు చేసినప్పటికీ చివరి 6 ఓవర్లలో40 పరుగులే చేసింది. పేస్‌తో పాటు హార్డ్ హిట్టర్ రమన్‌దీప్ జట్టులో ఉంటే భారత్ మరింత భారీ స్కోరు చేయగలదని టీమిండియా మేనేజ్మెంట్ భావిస్తోంది. అంతేగాక తొలి టీ20లో అక్షర్ పటేల్‌ను బౌలింగ్ పరంగా సూర్య ఎక్కువగా ఉపయోగించలేదు. ఒక్క ఓవర్ మాత్రమే బౌలింగ్ ఇచ్చాడు. వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్‌తో స్పిన్ బౌలింగ్ బలంగా ఉండటంతో రమన్‌దీప్‌కు అవకాశం ఇవ్వాలని చూస్తున్నారు. రమన్‌దీప్ బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు అద్భుతమైన ఫీల్డర్. కాగా, భారత్ దక్షిణాఫ్రికా ఇప్పటివరకు 28 మ్యాచ్‌లు ఆడగా టీమిండియా 16 మ్యాచ్‌ల్లో, సఫారీలు 11 పోరుల్లో గెలిచాయి. అయితే సెయింట్ జార్జ్ పార్క్ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్‌పై దక్షిణాఫ్రికాదే పైచేయి.

**సౌతాఫ్రికాతో తొలి టీ20కి భారత తుది జట్టు (అంచనా)**

భారత జట్టు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్, రింకూ సింగ్, తిలక్ వర్మ, జితేశ్ శర్మ, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, రమన్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్షదీప్ సింగ్, విజయ్‌కుమార్ వైశాక్, అవేశ్ ఖాన్, యశ్ దయాల్.

# రీల్

## 'గేమ్ ఛేంజర్' టీజర్ లాంచ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'గేమ్ ఛేంజర్' ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ బజ్‌ని క్రియేట్ చేసింది. ఇక తాజాగా ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ గ్రాండ్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడంతో ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.అయితే, ఈ టీజర్ లాంచ్ ఈవెంట్‌ని లక్నో పట్టణంలో గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ ఈవెంట్‌కి రామ్ చరణ్, హీరోయిన్ కియారా అద్వానీ, ఎస్.జె.సూర్య, దిల్ రాజులు హాజరయ్యారు. కానీ, ఈ చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు శంకర్ మాత్రం ఈ ఈవెంట్‌కి రాలేదు. దీంతో ఆయన ఈ టీజర్ లాంచ్ ఈవెంట్‌కి ఎందుకు రాలేదా అని అభిమానులు ఆసక్తిగా చూశారు. కానీ, తాను 'గేమ్ ఛేంజర్' మూవీకి సంబంధించిన ఎడిటింగ్ వర్క్‌లో బిజీగా ఉన్నానని.. అందుకే టీజర్ లాంచ్‌కి రాలేదని.. అభిమానులు కోరుకునే విధంగా సినిమాను తీర్చిదిద్దుతున్నానని ఆయన తెలిపాడు.దీంతో ఈ సినిమా కోసం శంకర్ ఎంత శ్రమిస్తున్నాడో అర్థం చేసుకున్నారు. ఇక ఈ సినిమా శంకర్‌కు సాలిడ్ కమ్‌బ్యాక్ ఇస్తుందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నాడు. జనవరి 10న ఈ చిత్రాన్ని గ్రాండ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు

## బాలయ్య, బన్నీ అన్‌స్టాపబుల్ డేట్ లాక్!?

ప్రస్తుతం నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా తన 109వ సినిమా చేస్తూ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. అలాగే ఈ సినిమా సహా బాలయ్య తన సెన్సేషనల్ హిట్ టాక్ షో అన్ స్టాప్పబుల్ సీజన్ 4 కూడా స్టార్ట్ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈసారి కూడ అనేకమంది స్టార్స్ వస్తుండగా ఈ సీజన్లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పై కూడా ఓ సాలిడ్ ఎపిసోడ్ ఉందని తెలిసిందే. అయితే ఇది కూడా ఎంతో రసవత్తరంగా మారగా ఈ అవైటేడ్ ఎపిసోడ్ పై లేటెస్ట్ సమాచారం వినిపిస్తుంది. దీని ప్రకారం ఈ ఎపిసోడ్ ని ఆహా వారు ఈ నవంబర్ 15 కి లాక్ చేసినట్టుగా తెలుస్తుంది. ఆల్రెడీ ఈ ఎపిసోడ్ షూటింగ్ కంప్లీట్ చేసుకోగా ఫైనల్ గా ఈ ఎపిసోడ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అలాగే దీనిపై అధికారిక క్లారిటీ త్వరలోనే రానుంది. ఇక అల్లు అర్జున్ మరోపక్క పుష్ప 2 తో బిజీగా ఉండగా ఆ ప్రమోషన్స్ లో తాను ఈ షోకి హాజరయ్యాడు.

## 'లక్కీ భాస్కర్'కి మెగాస్టార్ అభినందనలు

రీసెంట్ గా మన టాలీవుడ్ సినిమా దగ్గర రిలీజ్ కి వచ్చిన దీపావళి సినిమాల్లో యువ హీరో దుల్కర్ సల్మాన్ హీరోగా యువ దర్శకుడు దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించిన లక్కీ భాస్కర్ కూడా ఒకటి. మరి వీరి కలయికలో వచ్చిన మొదటి సినిమా ఇది కాగా సూపర్ హిట్ టాక్ అండ్ మంచి వసూళ్లు కూడా ఇది సాధించింది. మరి ఈ సినిమా సక్సెస్ ని మెగాస్టార్ చిరంజీవి దర్శకుడు వెంకీ అట్లూరికి మరింత ప్రత్యేకంగా మార్చడం విశేషం. లేటెస్ట్ గా వెంకీ అట్లూరి తన ఇన్స్టాగ్రామ్ తో పోస్ట్ పెట్టి ఎగ్జైట్ అయ్యాడు. చిరు తనకి పూలగుచ్ఛం ఇచ్చి నా సినిమాకి అభినందనలు తెలపడం నేను అయన సినిమాలు తెల్లవారు షోస్ చూసేవాడిని అలాంటిది ఆయన నా సినిమా చూసి అభినందించడం ఎంతో ఆనందంగా ఉంది అంటూ వెంకీ అట్లూరి ఎగ్జైట్ అయ్యాడు. దీంతో తన పోస్ట్ వైరల్ గా మారింది.

## కంగువా రెండో ట్రైలర్ లేనట్టేనా?

ప్రస్తుతం పాన్ ఇండియా బాక్సాఫీస్ మీద దండయాత్రకు వస్తున్న లేటెస్ట్ చిత్రం ఏదన్నా ఉంది అంటే అది కోలీవుడ్ నటుడు నడిప్పిన్ నాయగన్ సూర్య నటించిన కంగువా కూడా ఒకటి. మరి దర్శకుడు శివ తెరకెక్కించిన ఈ భారీ సినిమా పాన్ ఇండియా లెవెల్లో గ్రాండ్ ప్రమోషన్స్ చేసుకుంటూ వెళుతుంది. అయితే అంతా బాగానే ఉంది కానీ సినిమాపై ఉన్న బజ్ ఖచ్చితంగా ఇంకా పెరగాల్సి ఉందని చెప్పాలి. ఈ చిత్రం నుంచి ఒక్క ట్రైలర్‌ని మేకర్స్ వదిలారు. అక్కడ నుంచి కేవలం పాటలు కొన్ని ప్రోమోలు మాత్రమే వేస్తూ వచ్చారు. అయితే వీటిని మించి రెండో ట్రైలర్ కోసం మాత్రం మేకర్స్ నుంచి ఇంకా ఎలాంటి అలికిడి లేకపోవడం గమనార్హం. ఈ తరహా సినిమాలకి రెండో ట్రైలర్ కూడా చాలా కీలకం. మొదటి ట్రైలర్ నే ఎప్పుడో ఇచ్చారు. అక్కడ నుంచి ఆ ఒక్క ట్రైలర్ మాత్రమే ఆడియెన్స్ లో ఉంది. మరి కంగువా పై మరింత ఇంట్రెస్ట్ రావాలి అంటే డెఫినెట్ గా రెండో ట్రైలర్ కూడా వదిలితేనే ఆడియెన్స్ మరికాస్త ఆసక్తి చూపిస్తారు. లేదు అంటే ఉన్న ఇంట్రెస్ట్ కూడా ముందు రోజుల్లో సన్నగిల్లే అవకాశం ఉందని చెప్పక తప్పదు.

## దళిత అభ్యున్నతే లక్ష్యంగా ఎఐడిఆర్ఎం 2వ మహాసభలో కార్యాచరణ

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ్మ

ప్రజాపక్షం/హైదరాబాద్ : అఖిలభారత దళిత హక్కుల ఉద్యమం (ఎఐడిఆర్ఎం) రెండవ జాతీయ మహాసభలను జనవరి 5– 7 తేదీలలో హైదరాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలనరసింహా ప్రకటించారు. దేశ సంపదలో దళితుల వాటా, సామాజిక న్యాయం, ఉపాధి అవకాశాలను సాధించడమే లక్ష్యంగా (ఎఐడిఆర్ఎం) మహాసభలలో సమర శంఖాన్ని పూరించనున్నట్లు చెప్పారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్)రాష్ట్ర సమితి సమావేశం అధ్యక్షులు కె.ఏసురత్నం అధ్యక్షతన హైదరాబాద్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో శనివారం జరిగింది. ఈ సమావేశంలో బాలనరసింహ మాట్లాడుతూ ప్రభుత్వాలు దళితుల అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. దళితులకు నేటికీ పరిమితంగానే విద్యా ఉద్యోగ అవకాశాలు దొరుకుతున్నాయన్నారు. గతంలో కొంతమేరకు ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా దళితులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు దొరికేవని, కానీ బిజెపి సంకీర్ణ ప్రభుత్వం కేంద్రంలో అధికారం లోకి వచ్చాక ప్రైవేటీకరణ, సరళీకరణ ఆర్థిక విధానాలను వేగవంతం చేయడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడంతో వారికి అవకాశాలు కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయడంతో పాటు ప్రైవేట్ రంగాలలో రిజర్వేషన్లు అమలుకు పార్లమెంట్‌లో బిల్లు పెట్టి ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితులకు ఆర్థిక, రాజకీయ, సామాజిక హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, కుల వివక్షత కుల నిర్మూలన కోసం ఎస్‌సి సబ్ ప్లాన్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా దళితుల అభివృద్ధికి కేటాయించిన నిధులు దారి మళ్లించకుండా చర్యలు తీసుకోవాలని స్వయం ఉపాధి పథకాలు పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## 14 నుండి డిసెంబర్ 9 వరకు 'ప్రజా విజయోత్సవాలు'

### 'ప్రజా విజయోత్సవ మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో' ఉప ముఖ్యమంత్రి భట్టి

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తవుతున్న నేపథ్యంలో ఈ నెల 14వ తేదీ నుండి డిసెంబర్ 9 వ తేదీ వరకు 26 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున 'ప్రజా విజయోత్సవాలను' నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. చివరి రోజైన డిసెంబర్ 9న హైదరాబాద్ నగరంలో వేలాది మంది కళాకారులతో ప్రదర్శనలు, లేజర్ షోలు, బాణాసంచా ప్రదర్శనలతో పాటు పలు కార్యక్రమాలను పెద్దఎత్తున ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమల్లో భాగంగా గ్రూప్ 4 పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందచేస్తామని, వివిధ శాఖలకు సంబందించిన పాలసీ విధానాలను కూడా ప్రకటిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. 'ప్రజా విజయోత్సవాల' నిర్వహణ నిమిత్తం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం సమావేశం భట్టి విక్రమార్క అధ్యక్షతన హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం జరిగింది. ఈ సమావేశానికి రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కె.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, రాష్ట్ర సాహిత్య అకాడమీ అధ్యక్షురాలు అలేఖ్య పుంజాల, ప్రజాకవి జయరాజ్, వివిధ శాఖల కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో దేశంలోని మరే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టలేని అనేక విప్లవాత్మక, ఊహకు అందని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమాలను షోకేస్ చేస్తూ, ప్రభుత్వ విజన్‌ను తెలియచేసేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నామని వివరించారు. మొత్తం 26 రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో ప్రభుత్వ గ్యారంటీ పథకాలలో భాగంగా మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరా మహిళా శక్తి తదితర పథకాలతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చైతన్యపరిచేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. 'ప్రజా విజయోత్సవాల' కార్యక్రమంలో పలు కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటామని, స్పోర్ట్స్ యూనివర్సిటీకి ఫౌండేషన్, 16 నర్సింగ్ కళాశాలలు, 28 పారా మెడికల్ కళాశాలల ప్రారంభోత్సవం, ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన తదితర కార్యక్రమాలను ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను కూడా ప్రారంభిస్తామన్నారు. పోలీస్ శాఖ ద్వారా డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాలు, డాగ్ షోలు, పోలీస్ బ్యాండ్ ప్రదర్శనలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమాలకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లను చేయాలని సంబంధిత శాఖల కార్యదర్శులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, వివిధ శాఖల ముఖ్యకార్యదర్శులు రవిగుప్త, క్రిస్టినా జోంగ్తు, ఎం.శ్రీధర్, కార్యదర్శి దాసరి హరిచందన, లోకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యంగా.. (మొదటి పేజీ తరువాయి)

ఉగ్రవాది మృతదేహాన్ని కూడా గుర్తించినట్లు క్వెట్టా డివిజనల్ పోలీస్ కమిషనర్ హంజా షక్వాత్ ధృవీకరించారు. ఇది ఖచ్చితంగా ఆత్మాహుతి దాడేనని, సామాన్య ప్రజలను లక్ష్యంగా చేసుకుని కూడా ఈ దాడి జరిగిందని హంజా షక్వాత్ ధృవీకరించారు. ఆ ప్రాంతంలో ప్రజలు గుమిగూడటాన్ని నిషేధించామని, రైల్వే స్టేషన్లను మూసివేశామని, రైళ్ళ రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశామని ఆయన చెప్పారు. ఇన్‌ఫాంటరీ స్కూలు నుండి వచ్చే సైన్యాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ ఆత్మాహుతిదళ దాడి జరిగిందని బలూచిస్థాన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ మొయాజ్జమ్ జాహ్ అన్సారీ ధృవీకరించారు. పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్, ఖైబర్ పక్త్వంఖ్వ రాష్ట్రాలలో ఏడాది కాలంగా ఉగ్రవాదాదులు అనూహ్యంగా పెరిగిపోయాయి. బలూచిస్థాన్ ముస్తాంగ్‌జిల్లాలో వారం రోజుల క్రితం ఒక బాలికల పాఠశాల, ఆసుపత్రి సమీపంలో జరిగిన బాంబుపేలుడులో ఐదుగురు పిల్లలతోసహా ఎనిమిది మంది మరణించిన సంఘటన పరంపరలో భాగంగానే ఈ ఆత్మాహుతి దాడి జరిగింది. క్వెట్టా–పెషావర్ మధ్య సుమారు 45 రోజులపాటు రైల్వే రాకపోకలు స్తంభించిన తర్వాత వాటిని పునరుద్ధరిస్తున్నట్లు రైల్వేశాఖ అక్టోబరు 11వ తేదీన ప్రకటించింది. తర్వాత దాదాపు నెలరోజుల్లోనే ఈ ఆత్మాహుతి బాంబుదాడి జరిగింది.

## అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

వరంగల్ పంట పండినట్లేనని అక్కడి భూముల ధరలకు రెక్కలొస్తాయని చెబుతున్నారు. అంతే కాదు అక్కడ ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. వరంగల్ గురించి ఈ మధ్య రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. వరంగల్ ను రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకు తగ్గట్లుగానే ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.వరంగల్, హనుమకొండ జంట నగరాల అభివృద్ధిపై ఇటీవల మంత్రులు హదరాబాద్‌లో సమావేశం అయ్యారు. వరంగల్ ఓఆర్ఆర్, ఐఆర్ఆర్‌లకు సంబంధించి భూసేకరణ తదితర అంశాలపై చర్చించారు. భేటీలో కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేలు, సీఎం ప్రధాన సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, అధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్ కు దీటుగా వరంగల్ ను అభివృద్ధి చేస్తామని పొంగులేటి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తే మామునూరు విమానాశ్రయం అందుబాటులోకి వస్తుందని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి గత జూన్‌లో వరంగల్ జిల్లాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డుకు అవసరమైన భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంపై కూడా అధికారులతో చర్చించారు. వరంగల్ తో పాటు కరీంనగర్ కూడా అభివృద్ధిలో ముందుండేలా పలు పనులు చేపడుతున్నారు.

**రెండో రాజధాని ప్రకటనల వెనుక రాజకీయ కోణం**

వరంగల్ రెండో రాజధాని అనే అంశాన్ని చాలా వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్తోంది కాంగ్రెస్ పార్టీ. ఎవరు అడ్డుకున్నా ఆగబోం అని తాజాగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ రెండో రాజధానిపై కాంగ్రెస్ చేస్తున్న ప్రకటనల వెనుక అసలు రాజకీయం ఉందన్న చర్చ నడుస్తోంది. తెలంగాణలో హైదరాబాద్ తర్వాత పెద్ద నగరం వరంగల్ నే. రెండో రాజధాని అని ప్రకటించినా ప్రకటించకపోయినా వరంగల్‌కు ఆ స్టేటస్ ఉంది.అయితే కొత్త రాజకీయంలో పండిపోతున్న